అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 14-05-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 134 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

నాల్గో విడత పోలింగ్ 67 శాతానికి పైనే..

- ఆంధ్రా, బెంగాల్‌లో చెదురుమదురుగా హింసాత్మక ఘటనలు
- బెంగాల్, ఒడిశాల్లో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయింపు
- పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా ఓటింగ్ -జమ్మూ కాశ్మీర్‌లో అత్యల్పం...

5లో..



పోలింగ్ ప్రశాంతం

తెలంగాణలో 64.74 శాతం నమోదు

- మరికొంత పెరిగే అవకాశం
- మంగళవారం మధ్యాహ్నం వరకు తుది గణాంకాలు : ఎన్నికల సంఘం వెల్లడి
- పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు
- భారీ భద్రత నడుమ స్ట్రాంగ్‌రూంలకు తరలింపు
- ఈవీఎంలలో నేతల భవితవ్యం

జూన్4న తేలనున్న ఫలితాలు





లోక్‌సభ నాలుగో విడత ఎన్నికల్లో భాగంగా తెలంగాణలోని 17 నియోజకవర్గాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ పరిధిలో పోలింగ్ ప్రశాంతగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 64.74 శాతానికి పైనే పోలింగ్ నమోదైంది. మంగళవారం మధ్యాహ్నం వరకు పోలింగ్ శాతానికి సంబంధించి కచ్చితమైన సమాచారం తెలుస్తుందని ఎన్నికల సంఘం తెలిపింది. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 66.4 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ సారి కూడా అదే స్థాయిలో పోలింగ్ నమోదయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సోమవారం ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ 11 గంటల నుంచి ఊపందుకుంది. మొదటి రెండు గంటల్లో 9.8 శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తర్వాత వేగం పుంజుకుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 40.38 శాతం పోలింగ్ నమోదైంది. ఎండ తీవ్రత ఉన్నా మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడటంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటేసేందుకు జనం బారులు తీరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా ఎప్పటిలాగే హైదరాబాద్ వాసులు బద్ధకించారు. మారుమూల సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 13 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మధ్యాహ్నం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. మిగతా 106 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ ముగిసే సమయానికి 1500కు పైగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు వరుసలో నిలబడి ఉన్నందున వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పించనున్నట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత పోలింగ్ ఆఫీసర్ల (పీవో) తనిఖీ అనంతరం ఈవీఎంలను భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూంలకు తరలించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాటికి మూడంచెల భద్రత కల్పిస్తారు. ఈ ఎన్నికల్లో చెదురుమదురు సంఘటనలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి ...13లో

ఎవరి ధీమా వారిదే!

ఈవీఎమ్‌ల్లో ఓటర్ తీర్పు

- జూన్ 4న కౌంటింగ్
- అప్పటి వరకు సస్పెన్సే...
- బద్ధకించిన 'గ్రేటర్' ఓటర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పోలింగ్ పూర్తయ్యింది. ఈవీఎమ్‌ల్లో ఓటరు తీర్పు నిక్షిప్తమైంది. కాకపోతే ఇప్పటికిప్పుడు ఫలితాలు వెల్లడయ్యే అవకాశం లేదు. దేశంలో మరో మూడు విడతల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో జూన్ 4వ తేదీ వరకూ ఫలితాల కోసం వేచిచూడాల్సిందే. పోలింగ్ పూర్తికాగానే ప్రధాన రాజకీయపార్టీలు అధిక సీట్లు మావంటే...కాదు మావే అంటూ మీడియా ముందు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాయి. ఓటరు నాడి ఇప్పటికే ఆయా పార్టీల నేతలకు తెలిసిపోయినా, వాస్తవాలను ఇప్పటికిప్పుడు ఒప్పుకోవాల్సిన అవసరం లేదనేది వారి ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో 12 నుంచి 14 స్థానాలు గెలుస్తామని అన్ని రాజకీయపార్టీల అధినేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలను ఇప్పటికే ప్రధాన రాజకీయపార్టీల అధినేతలతో పంచుకున్నట్టు సమాచారం. తాజాగా దీన్ని ...13లో



బద్ధకించిన కంటోన్మెంట్ ఓటర్లు

సాయంత్రం 5 గంటల వరకు 47.88 శాతం పోలింగ్

- మరికొంత పెరిగే అవకాశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికలో నగర ఓటర్లు బద్ధకించారు. సాయంత్రం 5 గంటల వరకు 47.88 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. మరో రెండు నుంచి మూడు శాతం పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉందని ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు 6.28 శాతం పోలింగ్ నమోదు కాగా, 9 గంటల నుంచి 11 గంటల వరకు 16.34 శాతం నమోదైంది. ఎప్పటిలాగే తక్కువ పోలింగ్ శాతం నమోదైంది. ఈ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో ముఖాముఖి నెలకొన్న ఈ నియోజక వర్గంలో ఇండిపెండెంట్లతో కలిపి మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. లోక్‌సభతో పాటే జూన్ 4న కంటోన్మెంట్ అసెంబ్లీ ఫలితాలు వెల్లడి కానున్నాయి.

నివేదిక తర్వాతే రీపోలింగ్‌పై నిర్ణయం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ శాసన సభ నియోజక వర్గానికి జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారం వికాస్‌రాజ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారుల నుంచి వచ్చిన నివేదిక తర్వాత రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈవీఎంలను భారీ భద్రత నడుమ 44 స్ట్రాంగ్ రూంలకు తరలించామనీ, వాటిని మూడంచెల భద్రత నడుమ ఉంచుతామని ...13లో

రాష్ట్రానికి బీజేపీ ప్రమాదకరం

- కాంగ్రెస్ వందరోజుల పాలనకు ఎన్నికలు రెఫరెండం : కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం



వివరాలు 3లో



ప్రాంతీయ పార్టీలదే కీలకపాత్ర

- చింతమడకలో ఓటేసిన మాజీ సీఎం కేసీఆర్

వివరాలు 3లో




ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ తెల్దారుపల్లిలో ఓటేసిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మునిపంపుల గ్రామంలో ఓటేశాక సిరా గుర్తు చూపుతున్న సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మికశాఖ ఆవరణలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఆయన సతీమణి, కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్ పుణ్యవతి





సిరా గుర్తు చూపుతున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ (ఎంఐఎం), సికింద్రాబాద్ ఎంపీ జీ. కిషన్‌రెడ్డి (బీజేపీ)

దండకారణ్యంలో ఆగని ఎన్‌కౌంటర్లు

- మరో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి
- ఛత్తీస్‌గఢ్‌లో 14 మంది మావోయిస్టుల అరెస్ట్
- పేలిన మందుపాతర, ఇద్దరు చిన్నారుల మృతి



వివరాలు 13లో

గురుద్వారాలో మోడీ

- పాట్నాలో లంగర్ సర్వ్ చేసిన ప్రధాని..
- ఓట్ల కోసమే రాజకీయం..ప్రతిపక్షాలు



పాట్నా: ప్రధాని మోడీ సోమవారం పాట్నాలోని తాకత్ శ్రీ హరిమందర్ జీ పట్నా సాహిబ్ గురుద్వారాను సందర్శించారు. ప్రధాని రాక సందర్భంగా అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 18వ శతాబ్దంలో మహరాజా ...13లో

మహాలక్ష్మి పథకం కింద రూ.లక్ష

- కాంగ్రెస్ గ్యారంటీలతో మహిళల జీవితాలు మారిపోతాయ్: సోనియా గాంధీ



న్యూఢిల్లీ: తమ మ్యానిఫెస్టోలో పేర్కొన్న గ్యారంటీలతో దేశంలో మహిళల స్థితిగతులు పూర్తిగా మారిపోతాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలిపారు. దేశంలో నెలకొన్న తీవ్ర సంక్షోభం ...13లో

పెండ్లి చేసుకోక తప్పేలా లేదు

- ఎన్నికల ప్రచారంలో రాహుల్ సరదా వ్యాఖ్యలు..



వివరాలు 13లో

ఏపీలో భారీగా పోలింగ్

రాత్రి 11.45 గంటలకు 76.5 శాతం

- 80శాతం దాటే అవకాశం





అమరావతి : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఏపీలో భారీగా పోలింగ్ నమోదైంది. లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. రాత్రి 11.45 గంటలకు 76.5 శాతం పోలింగ్ నమోదయినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి సుమారు 3,500 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఉన్నట్టు అధికారులు తెలిపారు. వీటిలో అనేకచోట్ల 100నుం చి200 మంది ఓటర్లు క్యూలో ఉన్నారని, కొన్ని చోట్ల అంతకన్నా ఎక్కువమంది ఉన్నారని ఏపీ సీఈఓ మీనా తెలిపారు. ఈ కేంద్రాల్లో కొన్ని చోట్ల రాత్రి 11 గంటలకు కూడా పోలింగ్ జరుగుతోంది. దీంతో ...5లో

బుర్ఖాలు తొలగించి.. ముస్లిం ఓటర్ల ఐడీ తనిఖీ

హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతపై కేసు

- నిజామాబాద్‌లోనూ అరవింద్ దుందుడుకు చర్యలు
- మహిళా ఓటర్లపై బీజేపీ నేతల దురుసు

నవతెలంగాణ-సిటీబ్యూరో/ మలక్‌పేట్/నిజామాబాద్

పోలింగ్ సందర్భంగా మహిళా ఓటర్ల పట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించారు. బీజేపీ హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత సోమవారం ఓ పోలింగ్ బూత్‌లో పలువురు ముస్లిం మహిళల బురఖాలను తొలగించాలని కోరి వారి ఓటర్ ఐడీలను వెరిఫికేషన్ చేశారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో అది వివాదాస్పదమైంది. ఈ మేరకు ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్ పాతబస్తీలోని అజాంపూరలో పోలింగ్ బూత్ నెంబర్ 122కు వచ్చిన మాధవీలత అక్కడ కూర్చున్న ముస్లిం మహిళా ఓటర్ల బుర్ఖాలు తొలగించి వారి ఐడీలను పరిశీలించారు. ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరలైంది. కాగా మాధవీలతపై ఏఐఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్.. మాధవీలతపై కేసు నమోదు చేయాలంటూ ...13లో



ముంబయిలో పెను గాలుల బీభత్సం

భారీ హోర్డింగ్ కూలి ఎనిమిది మంది మృతి

- 60 మందికి పైగా గాయాలు
- ఆరే, అంధేరీ ఈస్ట్ మెట్రో స్టేషన్ల మధ్య మెట్రో సేవల నిలిపివేత



దాదర్ : ముంబయి, ఆ పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులు, వర్షాలు సోమవారం పెను బీభత్సం సృష్టించాయి. ఘట్‌కోపర్ ప్రాంతంలోని చెద్దానగర్ జంక్షన్ వద్ద వంద అడుగుల ఎత్తయిన భారీ హోర్డింగ్ కుప్పకూలి పక్కనే వున్న పెట్రోల్ బంకు, సమీపంలోని నివాసాలపై పడింది. దీంతో, ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారు. 60 మందికి పైగా గాయపడ్డారు. చాలామంది అక్కడ చిక్కుకోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. దాదర్, కుర్లా, మాహిమ్, ఘట్కోపర్, ములుండ్, విక్రోలితోపాటు దక్షిణ ముంబైలోని అనేక ప్రాంతాల్లో వర్షంతోపాటు బలమైన గాలులు ...5లో

రఫాలో ఇజ్రాయిల్ దాడులు ఉధృతం

గడచిన 24గంటల్లో 57మంది మృతి

రఫాను వీడిన మూడున్నర లక్షల మందికి పైగా ప్రజలు

రఫాలో కుప్పకూలనున్న ఆరోగ్య వ్యవస్థ

జాబాలియా శరణార్థ శిబిరం నుంచి వందలాదిమంది తరలింపు



గాజా : గాజాలోని ఉత్తర, దక్షిణ, సెంట్రల్ ప్రాంతాల్లో రాత్రిపగలు అనే తేడా లేకుండా ఇజ్రాయిల్ బలగాలు వైమానిక దాడులు కొనసాగిస్తున్నాయి. ఉత్తర గాజాలోని జాబాలియా శరణార్థుల శిబిరం వున్న ప్రాంతంలోకి, రఫా నగరంలోకి ఇజ్రాయిల్ బలగాలు, ట్యాంకులు చొచ్చుకుపోయాయి. అక్కడ రాత్రంతా ఉధృతంగా వైమానిక దాడులు కొనసాగిన తర్వాత సోమవారం ఉదయం నుండీ మిలటరీ దాడులు మొదలయ్యాయి. గడచిన 24 గంటల్లో 57మంది మరణించగా, 82మంది గాయపడ్డారు. ఇప్పటివరకు దాదాపు 3,60,000మంది పాలస్తీనియన్లు రఫా నగరాన్ని వీడి వెళ్లిపోయారని ఐక్యరాజ్య సమితి వర్గాలు పేర్కొన్నాయి. రఫా నుంచి ఖాన్ యూనిస్ నగరానికి ప్రజలు బారులు తీరి వెళ్లడం కనిపిస్తోంది. ఏప్రిల్ 3 నుంచి మే 8 మధ్యలో ఉపగ్రహ ఛాయాచిత్రాలను పరిశీలించినట్లైతే పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థమవుతోంది. జాబాలియా శరణార్థ శిబిరంలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని పాఠశాలలు నిర్వాసితులకు నెలవుగా మారాయి. శిబిరాలు వేసుకుని కూడా వేలాదిమంది ప్రజలు నివసించేవారు సోమవారం ఉదయం ఇజ్రాయిల్ సైనిక బలగాలు అక్కడ నుంచి బలవంతంగా వందలాదిమంది నిర్వాసితులను ఖాళీ చేయించాయి. అక్కడ నుండి పశ్చిమ దిశగా వందల సంఖ్యలో కుటుంబాలు వెళ్లడం కనిపిస్తోందని ఇదంతా చిత్రీకరించిన అల్‌జజీరా మీడియా తెలిపింది. రఫా నగరంలోని కువైట్ ఆస్పత్రి నుంచి వైద్య సిబ్బందిని వెళ్లిపోవాల్సిందిగా బలగాలు ఆదేశించాయి. దాంతో మరికొద్ది గంటల్లో గాజావ్యాప్తంగా ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలడం ఖాయమని గాజా ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరించారు.

కాల్పుల విరమణే పరిష్కారం : ఐరాస

గత ఏడు మాసాలుగా జరుగుతున్న ఈ దాడుల్లో మృతుల సంఖ్య 35వేలు దాటిందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. తక్షణమే బేషరతుగా కాల్పుల విరమణ జరగడమొక్కటే ఈ సమస్యకు పరిష్కారమని ఐరాస చీఫ్ అంటానియో గుటెరస్ పేర్కొన్నారు. బందీలందరినీ విడుదల చేసి, మానవతా సాయాన్ని పెంచాలని కోరారు.

అంతర్జాతీయ వర్ణ వివక్ష సదస్సు ఖండన

ఇజ్రాయిల్ సెటిలర్ల వలసవాదాన్ని అంతర్జాతీయ వర్ణ వివక్ష సదస్సు తీవ్రంగా ఖండించింది. పాలస్తీనియన్ల కోసం జోహాన్నెస్‌బర్గ్‌లో శుక్రవారం నుండి మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సుకు దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చింది. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని, అక్రమ సెటిలర్ల వలసవాదాన్ని, ఇతర అంశాలను ప్రముఖంగా ఆ సదస్సులో ప్రస్తావించారు. 25కి పైగా దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. "ఒక శతాబ్దపు వలస వాదం, 75ఏండ్ల పాటు సాగుతున్న ప్రజల వలసలు (నక్బా), 75ఏండ్ల ఇజ్రాయిల్ ఊచకోత, వలసవాదం, వర్ణవివక్షపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ" నేతలు ఒక ప్రకటన జారీ చేశారు. భూతల, జల, వాయు మార్గాల్లో ఇజ్రాయిల్ పాశవికంగా జరిపిన దాడులను ప్రపంచం యావత్తు చూస్తోందని, మొత్తంగా గాజాను నిర్మూలనా శిబిరంగా మార్చేసిందని ఆ ప్రకటన విమర్శించింది. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మౌలిక సదుపాయాలు ఇలా గాజా ప్రజల జీవన పరిస్థితులన్నింటినీ ఇజ్రాయిల్ పూర్తిగా నాశనం చేసిందని పేర్కొంది.

ఇండోనేషియాలో క్రియాశీలంగా మౌంట్ ఇబూ అగ్నిపర్వతం

5కిలోమీటర్ల ఎత్తున బూడిద మేఘాలు

జకార్తా : ఇండోనేషియాలోని మారుమూల ద్వీపమైన హల్మాహెరాలో మౌంట్ ఇబూ అగ్నిపర్వతం సోమవారం ఉదయం కొద్ది నిముషాల పాటు క్రియాశీలంగా మారింది. ఆకాశంలోకి దాదాపు 5కిలోమీటర్ల ఎత్తున బూడిదను వెదజల్లుతోందని దేశ అగ్నిపర్వత శాస్త్ర సంస్థ వెల్లడించింది. ఈ నెల 10వ తేదీన కూడా ఇదే రీతిలో బూడిద విరజిమ్మిందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అగ్నిపర్వతానికి 5కిలోమీటర్ల పరిధిలో కార్యకలాపాలను నిషేధించారు. బూడిద వర్షంలా వెదజల్లడం ఆరంభమైతే సమీప ప్రాంతాల ప్రజలు మాస్కులు, గ్లాసులు ధరించాల్సి వుంటుందని తెలిపారు. అగ్నిపర్వతం చీలికల నుండి బూడిద రావడంతో పాటూ శబ్దాలు కూడా వస్తున్నాయని చెప్పారు. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ మీద వున్న ఇండోనేషియాలో 127 క్రియాశీలంగా వున్న అగ్నిపర్వతాలు వున్నాయి. ఇటీవలివారాల్లోనే ఉత్తరు సులవేశి ప్రాంతంలో రువాంగ్ అగ్నిపర్వతం బద్దలైంది. పెద్ద మొత్తంలో లావా, బూడిదను విరజిమ్మింది. గత డిసెంబరులో మారాపి అగ్నిపర్వతం బద్దలైన ఘటనలో 20మందికి పైగా మరణించారు.

నేపాల్ డిప్యూటీ ప్రధాని రాజీనామా

ప్రభుత్వం నుంచి బయటకు మరో మంత్రి

ఖాట్మండు : నేపాల్ డిప్యూటీ ప్రధాని, మధేషి సీనియర్ నేత ఉపేంద్ర యాదవ్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ప్రభుత్వం నుండి తమ పార్టీ బయటకు వచ్చేసిందని ప్రకటించారు. దీంతో ప్రచండ నేతృత్వంలోని ప్రభుత్వానికి పెద్ద ఎదురు దెబ్బ తగిలింది.ఆరోగ్యమంత్రిగా కూడా వున్న యాదవ్ తన రాజీనామా లేఖను ప్రచండకు అందచేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. యాదవ్‌తోపాటూ అదే పార్టీకి అటవీ శాఖ సహాయ మంత్రి దీపక్ కర్కి కూడా రాజీనామా చేశారు. యాదవ్ చైర్మన్‌గా వున్న జనతా సమాజ్‌వాదీ పార్టీ నేపాల్ (జెఎస్‌పి-నేపాల్) రెండు గ్రూపులుగా విడిపోయి సీనియర్ నేత అశోక్ రాయ్ జనతా సమాజ్‌వాదీ పార్టీ అనే పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేసిన వారం రోజుల తర్వాత యాదవ్ రాజీనామా వెలువడింది. కొత్త పార్టీని ఎన్నికల కమిషన్ కూడా గుర్తించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వానికి సహకారాన్ని కొనసాగించడం సాధ్యం కాదని యాదవ్ వ్యాఖ్యానించారు. జెఎస్‌పి-నేపాల్‌కు మొత్తంగా 12మంది సభ్యులున్నారు. చీలిక అనంతరం ఆ పార్టీ బలం 5కి పడిపోయింది. అయినా ప్రధాని ప్రచండ నేతృత్వంలోని పాలక సంకీర్ణానికి మెజారిటీ వుంది. తాజా పరిణామాలు తక్షణమే ప్రభుత్వంపై ప్రభావాన్ని చూపకపోయినా దీర్ఘకాలంలో ప్రభుత్వ సుస్థిరతపై తీవ్ర పర్యవసానాలు చూపగలవని మాజీ పర్యావరణ మంత్రి సునీల్ మనందార్ వ్యాఖ్యానించారు.



ఆ ఎన్‌కౌంటర్ బూటకం!

చనిపోయిన 12మందీ గ్రామస్తులే

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై స్థానిక ప్రజల కథనం

హైకోర్టుకు వెళతామంటున్న హక్కుల కార్యకర్తలు



న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించింది మావోయిస్టులు కాదని, స్థానికులని గ్రామస్తులు ఆదివారం తెలిపారు. భద్రతా బలగాలు 12మంది మావోయిస్టులను హతమార్చిన రెండు రోజుల తర్వాత ఈ విషయాలు వెల్లడయ్యాయి. బూటకపు ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు తమ కుటుంబ సభ్యులను చంపేశాయని ఆ మృత దేహాలను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు బీజాపూర్ జిల్లా కలెక్టరేట్ వెలుపల ధర్నా చేశారని మీడియా వార్తలు వెలువడ్డాయి. కాగా పోలీసులు మాత్రం ఈ వాదనలను కొట్టిపారేస్తున్నారు. కేవలం మావోయిస్టులు మాత్రమే ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అడవీ ప్రాంతంలో పోలీసులు వారిని చూడడంతోనే వారు స్థానికుల్లాగా బట్టలు వేసుకున్నారని చెబుతున్నారు.

గ్రామస్తుల వాదనలు

ఈ ప్రాంత వాసులనే భద్రతా బలగాలు చంపాయని, ఈ ఎన్‌కౌంటర్ బూటకమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.ఎన్‌కౌంటర్‌ను చూసిన పెడియా గ్రామవాసి గురునంద మాట్లాడుతూ, తునికాకు (బీడి ఆకులు) కోసుకోవడం కోసం కొంతమంది గ్రామస్తులు అడవికి వెళ్లారని చెప్పారు. అదే సమయంలో భద్రతా సిబ్బంది వారివైపు వచ్చారని, ఇదిచూసి భయంతో గ్రామస్తులు పారిపోవడం మొదలెట్టారని చెప్పారు. దాంతో వెంటనే భద్రతా సిబ్బంది వారిపై కాల్పులు జరిపారని గురునంద మీడియాకు చెప్పారు.

కోర్చులి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి మాట్లాడుతూ, తమ బంధువుల మృతదేహాలను తీసుకెళ్ళడానికి వచ్చామని చెప్పారు. ఈ దాడిలో మరణించిన లాలూ కుంజమ్ మావోయిస్టు కాదని, రైతు అని చెప్పారు. అతడు ఇంటివద్దే వున్నాడని, పోలీసులను కూసి పారిపోతుంటే కాల్చి చంపేశారని తెలిపారు.

పెడియా గ్రామానికి చెందిన మరో వ్యక్తి రాకేష్ అల్వమ్ మాట్లాడుతూ, తన తమ్ముడు మోటో అల్వమ్‌ను కూడా కాల్చేశారని, అతడు కూడా బీడి ఆకులు కోసుకోవడానికే అడవికి వెళ్లాడని చెప్పారు. పెడియా, ఇటావర్ గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. నా తమ్ముడు అడవిలో వున్నాడు, పోలీసుల బుల్లెట్ తగిలి చనిపోయాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయినవారందరూ గ్రామస్తులే, మావోయిస్టులు కాదని చెప్పారు. రెండు గ్రామాల నుండి వారిని తీసుకువచ్చి మరీ చంపేశారని తెలిపారు.

బీజాపూర్ పోలీసులు జారీ చేసి పత్రికా ప్రకటనలో పేర్కొన్న వారందరినీ తాను గుర్తించానని రాకేష్ అల్వమ్ చెప్పారు. మృతి చెందినవారందరూ ఇటావర్, పెడియా గ్రామస్తులేనన్నారు.

పోలీసు స్టేట్‌మెంట్

నిషేధిత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) ఆర్మీ కంపెనీ నెంబర్ టూ సభ్యులైన బుద్ధు ఒయామ్, కల్లూ పూనమ్‌లతో సహా 12మంది మావోయిస్టులు చనిపోయినట్లు శుక్రవారం భద్రతా బలగాలు ప్రకటించాయి. వీరిద్దరిని పట్టుకుంటే చెరో రూ.8లక్షలు చొప్పున బహుమతి ఇస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఇతరుల్లో లాఖే కుంజమ్ గంగలూర్ ఏరియా కమిటీ సభ్యుడని, భీమా కరమ్ ఆర్మీ ప్లాటూన్ నెం.12 సభ్యుడని అధికారులు తెలిపారు. వీరిపై కూడా చెరో రూ.5లక్షలు రివార్డు ప్రకటించారు. బీజాపూర్ జిల్లా ఎస్‌పి జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్లాటూన్ కమాండర్ సన్నూ లకోమ్, జంతన సర్కార్ ఉపాధ్యక్షుడు అల్వమ్‌లపై కూడా రెండేసి లక్షల చొప్పున రివార్డు ఇప్పటికే ప్రకటించినట్లు చెప్పారు.

కోర్టుకు వెళ్ళనున్న హక్కుల కార్యకర్తలు

ఈ సంఘటనపై తాము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మానవ హక్కుల కార్యకర్తలు తెలిపారు. బస్తర్ ప్రాంతంలో పనిచేస్తున్న గిరిజన హక్కుల కార్యకర్త సోని సోరి మాట్లాడుతూ, బీడి ఆకులు కోసుకోవడానికి అడవిలోకి వెళ్ళిన వారిపై కాల్పులు జరిపి చంపడమే కాకుండా కొంతమంది గ్రామస్తులను ఇళ్ల నుండి తీసుకెళ్ళి మరీ అడవిలో చంపేశారని తెలిపారు.

"పోలీసులు అమాయకులైన గ్రామస్తులను చంపేశారు, అందువల్లే హై కోర్టులో పిటిషన్ వేయాలనుకుంటున్నాం." అని ఆమె చెప్పారు. కాగా చనిపోయింది మావోయిస్టులేనని పోలీసులు కూడా ధృఢంగా చెబుతున్నారు.దక్షిణ బస్తర్ ప్రాంత డిఐజి కామ్‌లోచన్ కాశ్యప్ మాట్లాడుతూ, "మావోయిస్టులు దుస్తులు మార్చుకుని గ్రామస్తులతో కలిసి పోయారు. మరణించిన వారందరూ మావోయిస్టులే, గ్రామస్తులు కాదు. తమ బంధువులైన మావోయిస్టుల మృత దేహాలను తీసుకెళ్ళడానికి గ్రామస్తులు వచ్చారు. ప్రశ్నించడం కోసం మొత్తంగా 70మందిని గంగలూరు పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చాం. వారిలో దాదాపు 9మంది కరడుగట్టిన మావోయిస్టులు. ఈ 9మంది కూడా మృతి చెందిన మావోయిస్టులను తమ కార్యకర్తలుగా గుర్తించారు." అని చెప్పారు.

ప్రాంతీయ పార్టీలదే కీలకపాత్ర

చింతమడకలో ఓటు హక్కు వినియోగించుకున్న కేసీఆర్



నవతెలంగాణ- సిద్దిపేట రూరల్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఆశించిన మేర మెజారిటీ రాదని ఈ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలక పాత్ర వహిస్తాయని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆయన సోమవారం తన సొంత గ్రామమైన సిద్దిపేట జిల్లా రూరల్ మండలంలోని చింతమడకలో కుటుంబ సభ్యులతో కలసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎర్రవల్లి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 11:30 గంటలకు చింతమడకకు చేరుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 13వ బూత్‌లో ఓటు వేసి ప్రజలకు అభివాదం చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ సుడా చైర్మెన్ రవీందర్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీహరి గౌడ్, ఎంపీపీ శ్రీదేవి రామచంద్రరావు, సర్పంచ్ హంసకేతన్ రెడ్డి, ఉప సర్పంచ్ మోత్కు రవి, నాయకులు తదితరులు ఉన్నారు.



జగన్ నాకు సోదరుడిలాంటోడు

- ఈ ఎన్నికల్లో ఆయనే గెలుస్తారు
- పోలింగ్ స్టేషన్ల వద్ద జనరేటర్లు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు సోదరుడి లాంటోడనీ, ఈ ఎన్నికల్లో ఆయనే గెలుస్తాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని జీహెచ్ఎంసీ హాల్‌లో ఓటేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అనేక సవాళ్లతో కూడుకున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తు చేశారు. పోయిన లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన సీట్ల కన్నా ఎక్కువ సాధిస్తామనే నమ్మకముందన్నారు. పోటీ చేసిన ప్రతిపార్టీ తామే గెలుస్తామంటుంది, కానీ.. ఆ గెలుపును ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. పోలింగ్ స్టేషన్ల దగ్గర కరెంటు కోతలు లేకుండా జనరేటర్లు పెట్టి ముగ్గురేసి చొప్పున అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం కష్టపడుతోందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల్లో ప్రభుత్వం ఒక్క గ్యారెంటీనే సగం సగం అమలు చేసిందని దెప్పిపొడిచారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తాను సీఎంనని గుర్తించాలని హితవు పలికారు. ప్రభుత్వ పనితీరుపై ఆయన దృష్టి పెట్టాలని సూచించారు. కరెంటు కోతలు, నీటి కొరతల వంటి అసలైన సమస్యలపైన దృష్టి సారించాలన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పైన ప్రభుత్వం పని చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మోడీ శ్రీరామచంద్ర ప్రభువుకు చెప్పినట్టు రాజా ధర్మాన్ని పాటించాలన్నారు.నిధులు, ప్రాజెక్టుల కేటాయింపుల్లో ఆయన రాష్ట్రాలకు మధ్య వివక్ష చూపారని విమర్శించారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. ఇన్వర్టర్లు, జనరేటర్లు, క్యాండిల్స్, పవర్ బ్యాంకులు, చార్జింగ్ లైట్లు, ఇవే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలని ఎద్దేవా చేశారు.

రాష్ట్రానికి బీజేపీ ప్రమాదకరం

- కాంగ్రెస్ వందరోజుల పరిపాలన పార్లమెంట్ ఎన్నికలకు రెఫరెండం
- తెలంగాణకు పెట్టుబడులు తగ్గించేందుకు బీజేపీ కుట్ర
- రాష్ట్రంలో మరో పదేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం



నవతెలంగాణ-కొడంగల్

తెలంగాణకు బీజేపీ అత్యంత ప్రమాదకరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వందరోజుల పాలనకు ఈ పార్లమెంటు ఎన్నికలు రెఫరెండమని చెప్పారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో కుటుంబ సమేతం గా సీఎం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేశామని, మిగతా గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే పదేండ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు సంక్షేమ రాష్ట్రంగా నడిపించే బాధ్యత తమదేనన్నారు. బీజేపీ శాంతి భద్రతలను దెబ్బతీసి రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసి, ఇక్కడికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు తరలించాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి మత ప్రాతిపదికన విడదీయడంతో అక్కడ ఎవరూ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం లేదన్నారు. అలాంటి పరిస్థితే తెలంగాణాలోనూ సృష్టించేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. బీజేపీకి పడే ప్రతి ఓటూ తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం కావడానికి దారితీస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 39.5 శాతం ఓట్లు వచ్చాయని, పార్లమెంట్ ఎన్నికల్లో అంతకుమించి వస్తాయని భరోసా వ్యక్తం చేశారు. దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. బీజేపీ 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తుందని 400 సీట్లు ఏ విధంగా వస్తాయని ప్రశ్నించారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవని, సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. దేశ ప్రజలకు మోడీ మాయమాటలు చెబుతున్నారన్నారు. ఇండియా కూటమి పేరుతో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుంటే బీజేపీ మాత్రం నరేంద్ర మోడీ పేరుతో ఓట్లు అడుగుతుందని తెలిపారు. మోడీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడినా, నవనీత్‌కౌర్ 15 సెకండ్ల కామెంట్స్‌పైనా ఎలక్షన్ కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. రాష్ట్రంలో రైతు భరోసా ఎలా ఇచ్చామో పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టంచేశారు. కేసీఆర్‌పై తనకు సానుభూతి ఉందని, మానసిక ఒత్తిడి, నిరాశ, భావోద్వేగంతో ఆయన ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వంశీ చందర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్ముఖ్, శ్రీరాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, టీపీసీసీ ప్రతినిధి ఎండీ యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.



ఓటు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు

రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి సి.పార్థ సారధి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాస్వామ్యానికి ఓటు ఆయువుపట్టులాంటిదని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి సి పార్థసారధి అన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ .. ఐదేండ్ల మన భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమేనని గుర్తు చేశారు. ప్రస్తుతం యువతకు వివిధ కారణాలవల్ల ఓటు పట్ల ఆసక్తి తగ్గుతోందని చెప్పారు. "నేను ఒక్కణ్నీ ఓటు వెయ్యకపోతే ఏమవుతుంది... ఏం కాదులే" అని చాలా మంది భావిస్తున్నారన్నారు. నీటి చుక్కలన్నీ కలిస్తేనే సముద్రం అవుతుంది కదా.. అలాగే అందరూ ఓటు వేసినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యం అవుతుందని గుర్తు చేశారు. ఎన్నికల రోజు అంటే ఎంజాయ్ చేయడానికి ఇచ్చే సెలవు కాదనీ, విలువైన ఓటు వేయడానికి వచ్చిన ఒక సువర్ణావకాశమని తెలిపారు.

కుప్పకూలి...గుండెపోటుతో.. ఓటేయ్యడానికి వచ్చి ఇద్దరు..
పోలింగ్ విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగి మృతి







నవతెలంగాణ - అశ్వారావుపేట/ఉప్పల్

పోలింగ్ రోజు సోమవారం పలుచోట్ల విషాద సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఓటేయ్యడానికి వచ్చి కుప్పకూలి గుండెపోటుతో ఇద్దరు ఓటర్లు మృతిచెందారు. ఒక ఉద్యోగి విధులు నిర్వర్తిస్తూ చనిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ కార్యాలయంలో మృతుడు పోలూరు శ్రీకృష్ణ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఎన్నికల విధుల్లో బాగంగా అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని అశ్వారావుపేట మండలం, పేరాయిగూడెం పంచాయతీ, నెహ్రూ నగర్ పోలింగ్ బూత్ 165లో పోలింగ్ ఆఫీసర్‌గా వచ్చాడు. సోమవారం విధులు నిర్వహిస్తూ ఉదయం 10.30 గంటలకు అకస్మాత్తుగా కుప్పకూలి పడిపోయాడు. స్పందించిన సిబ్బంది హుటాహుటిన సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రికి చేరే లోపే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేదు. మాయోకార్డియో ఇస్కీమియా కారణంతో మృతి చెంది ఉంటారని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. భద్రాద్రి జెడ్పీ చైర్మెన్ కే.చంద్రశేఖర్ సంతాపం తెలిపారు.

నడుస్తూనే...

అశ్వారావుపేట మండలం వేదాంత పురం పంచాయతీకి చెందిన కాశీ నాగేశ్వర రావు (55) వాగొడ్డుగూడెంలోని 173 పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ఇంటి నుండి బయలు దేరాడు. అదే గ్రామాల్లోని ఓ దేవాలయం దగ్గరకు రాగానే ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. గమనించిన మాజీ సర్పంచ్ సోనీ శివశంకర్ ప్రసాద్ హుటాహుటిన ఆటోలో అశ్వారావుపేట ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చూసి మార్గం మధ్యలోనే మృతి చెంది ఉంటాడని తెలియజేయడంతో భౌతిక కాయాన్ని అదే ఆటోలో ఆయన ఇంటికి తరలించారు.

పోలింగ్ కేంద్రంలో గుండె పోటుతో వృద్దురాలు మృతి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో ఓటు వేయడానికి వచ్చిన ఓ వృద్దురాలు పోలింగ్ కేంద్రంలోనే గుండెపోటుతో మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ఓల్డ్ భరత్‌నగర్‌కు చెందిన గట్టు విజయలక్ష్మి (65) సోమవారం ఓటు వేసేందుకు కాలనీలోని మసీదు వద్ద ఉన్న బూతు నెంబర్ 349 వద్దకు వచ్చింది. అక్కడ ఆమె ఓటు వేసి బయటకు వస్తుండగా ఎండవేడిమికి తట్టుకోలేక అకస్మాత్తుగా గుండెపోటు కుప్పకూలి స్పృహ కోల్పోయింది. దాంతో విజయలక్ష్మిని హుటాహుటిన స్థానికులు, పోలీసులు స్థానిక టీఎక్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ విషయమై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అయితే పోలింగ్ కేంద్రం వద్ద ఆమె తనకు దాహం వేస్తుందని పోలీస్, ఎన్నికల సిబ్బందికి చెప్పినా వారు తాగునీరు అందించలేదని, అందుకే ఎండ వేడిమికి తాళ లేక మృతి చెందిందని బాధిత బంధువులు, స్థాని కులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండా రి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్ రెడ్డి సంఘటన స్థలానికి రావాలని డిమాండ్ చేశారు. మహిళ మృతికి పోలీస్, ఎన్నికల అధికారులు బాధ్యత వహించాలని, బాధితురాలు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పార్లమెంటు ఎన్నికల్లో గొప్ప ఫలితాలు

- విశ్వాసం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు, ప్రజలకు ధన్యవాదాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో అద్భుతమైన పోరాటపటిమను ప్రదర్శించిన క్షేత్రస్థాయి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు, ప్రజలందరికీ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎదురుదెబ్బలు ఎన్ని కొట్టావు అన్నది కాకుండా ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా సవాళ్లు ఎదుర్కొని తిరిగి నిలబడి పోరాటం చేశామన్నదే ముఖ్యం అన్న నానుడిని నిజం చేసినందుకు ఆయన అభినందనలు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత తిరిగి బలంగా నిలబడి కొట్లాడడం ఆషామాషి వ్యవహారం కాదనీ, పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుతమైన నిబద్ధతతో పార్టీ అధ్యక్షులు కేసీఆర్ వెంట నడిచి, ఎన్నికల్లో ప్రజామోదం కోసం కొట్లాడిన తీరు అద్భుతమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదు నెలలుగా సామాజిక మాధ్యమాల్లో పార్టీ కోసం పని చేసిన, ప్రతి ఒక్క సోషల్ మీడియా వారియర్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ సోషల్ మీడియా వారియర్లకు, కార్యకర్తలకు ఇతర పార్టీల మాదిరి ఎలాంటి చెల్లింపులు చేయకుండా పార్టీ మీద, తెలంగాణ మీద ప్రేమతో పనిచేశారని కొనియాడారు. కేవలం తెలంగాణ మీద ఉన్న ప్రేమ కేసీఆర్‌పైన ఉన్న అచంచలమైన విశ్వాసంతో తమ పార్టీ కార్య కర్తలు ఈ ఎన్నికల్లో తమ వాణిని బలంగా విని పించి, అద్భుతంగా కొట్లాడారని పేర్కొన్నారు. తమ పార్టీ శ్రేణులు చేసిన ఈ పోరాటంతో పార్లమెంటు ఎన్నికల్లో గొప్ప ఫలితాలు వస్తాయంటూ ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతోపాటు తమ వెంట నిలిచిన రాష్ట్ర ప్రజలందరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.



నవతెలంగాణ-ములుగు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. అలాంటి ఓటు హక్కును వినియోగించుకోని వారు కొందరు న్నారు. వారికి ఆదర్శమే ములుగు జిల్లా వాజేడు మండలం

ఓటు వేయనివారికి పెనుగోలు ఓటర్లే ఆదర్శం

అడవిలో 16 కి.మీ కాలినడకన వచ్చి ఓటేసిన గ్రామం

పెనుగోలు గ్రామస్తులు. వారున్న గ్రామంలో పోలింగ్ బూత్ లేకపోవడంతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు 16 కిలో మీటర్లు అటవీ గుండా కాలినడకన వాజేడులో ఉన్న పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సౌకర్యం లేక అనారోగ్యంతో వాజేడుకు వచ్చే క్రమంలో అడవి మార్గంలోనే చనిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయని వాపోయారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఇప్పుడైనా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి తమ బతుకులు మార్చాలని కోరారు.

పోలింగ్ బూత్ లేక గిరిజనుల అవస్థలు

- రోడ్డుపై బైటాయించి ధర్నా
- అధికారుల జోక్యంతో ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లు

నవతెలంగాణ-కొత్తూరు

పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలంటూ గిరిజనులు మెరుపు ధర్నాకు దిగారు. గ్రామ పంచాయతీగా ఏర్పడినా పోలింగ్ బూత్ లేక ఎన్నికల సమయంలో తండావాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ తండాలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకపోవడంతో సోమవారం గిరిజనులు రోడ్డుపై బైటాయించి తమ నిరసన తెలిపారు.

ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని కొడిచర్ల తాండ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగింది. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 500 జనాభా గలిగిన తండాలను, ఆమ్లెట్ గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. గ్రామపంచాయతీ పరిధిలోని కొడిచెర్లతండా, ఖాజాగూడ తండాలను కలిపి అప్పటి ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీని ఏర్పాటు చేసింది. ఐదేండ్లు పూర్తయినా ఆ తండాలో నేటికీ పోలింగ్ బూత్ లేక నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. గ్రామంలో కనీస అవసరాలను సైతం ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, రేషన్ తీసుకోవాలన్నా 4కి.మీ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.



సమస్య పరిష్కరిస్తా : తహసీల్దార్ రవీందర్ రెడ్డి

పోలింగ్ కేంద్రం లేక ఎన్నికల సమయంలో అనేక అవస్థలు పడుతున్నామని కొడిచర్ల తండా గిరిజనులు రోడ్డుపై మెరుపు ధర్నాకు దిగడంతో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సీఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకొని గిరిజనులతో మాట్లాడారు. ఎన్నికల అనంతరం నెల రోజుల్లోగా రేషన్ దుకాణం ఏర్పాటుతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల లోపు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో గిరిజనులు శాంతించి ఓటింగ్‌లో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అందుకే పోలింగ్ శాతం తక్కువ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో నివసించే వారిలో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కావడం, అక్కడ ఓటు వేసేందుకు వారు తరలి వెళ్లడంతో ఇక్కడ పోలింగ్ శాతం తగ్గిందని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో మార్పు మొదలైందనీ, మోడీ నాయకత్వాన్ని తెలంగాణ కోరుకుంటున్నదని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా ఈ దఫా ఎన్నికల్లో గ్రామాల్లో కూడా బీజేపీకి భారీగా ఓట్లు పడ్డాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా సీఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మలేదని విమర్శించారు. మెజార్టీ ఓటర్లు మోడీవైపే మొగ్గు చూపారన్నారు.

షేక్‌పేట్ డివిజన్ పరిధిలో దాదాపు 3 వేల ఓట్లను డిలీట్ చేశారనీ, ఒక వర్గానికి చెందిన ఓట్లను మాత్రమే డిలీట్ చేయడం దుర్మార్గమని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు గల్లంతైన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజవర్గంలో కొంతమంది అధికారులు ఒక పథకం ప్రకారం ఒక వర్గం వారి ఓట్లను డిలీట్ చేశారని ఆరోపించారు. డిలీట్ అయిన వారందరూ అనేక సంవత్సరాలుగా ఇక్కడే ఓటింగ్‌లో పాల్గొంటున్నారనీ, ఇక్కడే సొంత ఇండ్లు ఉన్నాయని తెలిపారు. కొందరు ఉద్యోగస్తులు కూడా ఉన్నారని గుర్తుచేశారు. దీనిపై ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారికి, సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని, వారు దర్యాప్తు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. పట్టణ ఓటర్లను సంస్కరించాల్సిన అవసరముందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మరణించిన వారి పేర్లను జాబితా నుంచి మున్సిపల్ అధికారులు తొలగించడం లేదని ఆరోపించారు. తన కుటుంబంలోనే తన ఓటు, తన కుమారుని ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఉన్నాయని చెప్పారు. ప్రధాని మోడీని విమర్శించే ముందు సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయి తెలుసుకుని మాట్లాడాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. గ్యారంటీలు అమలు చేయకుండా మాట్లాడటం ఆయనకే చెల్లిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎంత రెచ్చగొట్టినా తమ కార్యకర్తలు ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. రాబోయే ఫలితాల్లో రాష్ట్రంలో బీజేపీ కొత్త శక్తిగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చాలా చోట్ల బీఆర్ఎస్‌కు ఏజెంట్లు లేరనీ, ఉన్నచోట ఏజెన్సీకి చెందిన వారిని ఏజెంట్లుగా పెట్టుకున్నారని తెలిపారు. చాలా చోట్ల మజ్లిస్ కార్యకర్తలు కాంగ్రెస్ కోసం పని చేశారన్నారు.



సంపాదకీయం

నాయకులు బహుపరాక్!

'పురుషులందు పుణ్య పురుషులు వేరని వేమన చెప్పినదానికి లింగబేధాల్లేవు. వేమన అర్థంలో పురుషులంటే మనుషులేనని శాస్త్రకారులు ఎప్పుడో ఖరారు చేసేశారు. కాని ప్రస్తుత సందర్భం వేరు. పాలక పార్టీల నాయకులుగా ఉన్న పురుష పుంగవులు ప్రస్తుత ఎన్నికల్లో తమ తమ పార్టీలను సంక్షోభం నుండి బయట పడేసేందుకు చేస్తున్న విన్యాసాలు చూస్తే వేమన చెప్పిన పుణ్య పురుషులు వీరు కారని మాత్రం ఘంటాపథంగా చెప్పచ్చు.

మొదటి మూడు దశల్లోనే బీజేపీ అడుగు జారినట్టు స్పష్టమైన సంకేతాలొచ్చాయి. నిన్నటి నాలుగో దశతో 378 పూర్తయ్యాయి. దాదాపు బీజేపీ ఆశలు ఆవిరయ్యాయి.ఏ పార్టీ అయినా తమ కేడర్‌లో ఊపు నింపడానికి కొన్ని ప్రత్యేక డైలాగులు కొట్టడం కద్దు. దాన్ని తప్పుపట్టలేం. కాని అడ్డదారులు తొక్కి మరీ మాట్లాడుతున్న విషయాలు ఇరవై ఒకటో శతాబ్దపు జోకులుగా పేలుతున్నాయి. జనం నవ్వుకుంటున్నారు. గెలిచిన 303 మందిలో 110 మందిని ఈసారి మార్చాల్సిన దౌర్భాగ్యం బీజేపీది. సరిగా పనిచేయలేదని కాదు సుమా! ఈడిలు, సీబీఐల ద్వారా వెంటాడి, వేటాడి తమ వాషింగ్ మెషిన్లో శుభ్రం చేసుకున్న 105 మంది ఇతర పార్టీల జంప్‌జిలానీలకు టికెట్లివ్వడం కోసం. ఇదేంటని బీజేపీలోనే కుంపటి రగుల్తోంది. గుజరాత్, యూపీల్లో పోలింగ్ 57-58 శాతం మధ్య అఘోరించడమే మోడీ భవిష్యత్తును సీల్ చేసేసింది. తాజాగా పది సీట్లున్న హర్యానా సంక్షోభం అదనం. మొన్న మన రాష్ట్రానికొచ్చిన అమిత్‌షా ఈసారి దక్షిణాదిన తుడిచి పెట్టేస్తామని ఊదరగొట్టడం చూసి జనం పక్కున నవ్వుకున్నారు. హత్రాస్ ఘటన వంటివి, రగులుతున్న రైతు ఉద్యమం, కేజ్రీవాల్ అరెస్టు, ఉత్తర భారత దేశంలోనే కాదు, చివరికి ఉత్తరప్రదేశ్‌లో సైతం బీజేపీకి నూకలు చెల్లేట్టున్నాయి. ఇక దక్షిణాదిన స్వీప్ చేయడమేంటని బీజేపీ కార్యకర్తలే ముక్కున వేలేసుకుంటున్నారు.

ఏ ప్రాంతీయ పార్టీల గురించి కేసీఆర్ చెప్పేది? చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల గురించా? బీజేపీతో రహస్యంగా బాదరాయణ సంబంధం నెరుపుతున్న జగన్మోహన్ రెడ్డితో కేసీఆర్ ఉంటాడా? ఊసరవెల్లిగా రుజువైన నితీష్‌తోనా? ఆప్, డీఎంకేలు, సమాజ్‌వాద్ పార్టీ, ఆర్జేడీలు 'ఇండియా' కూటమిలో నుండి బయటికి దూకి కేసీఆర్ చంకనెక్కుతారనుకుంటున్నారా?

ఈ ఫ్రస్ట్రేషన్ అంతా బీజేపీ నేతల ఉపన్యాసాల్లో కనపడుతోంది. పచ్చిహిందూ మతోన్మాదుల్లా మాట్లాడుతున్నారు. ఇరవైకోట్ల ఉద్యోగాల గిన్నె బోర్లించేశారు, రైతుల ఆదాయం రెట్టింపు హామీ మట్టిలో కలిసిపోయింది. ప్రభుత్వ రంగాన్ని చంపేస్తానన్న వాగ్దానం మాత్రం



విజయవంతంగా అమలైపోయింది. దాంతో పాటు ప్రభుత్వ విద్య, వైద్య రంగాలు కూడా నాశనమై సామాన్యులు అప్పుల పాలౌతున్నారు. లేదా వారి పొదుపు తగ్గిపోయింది. ఇదే తాజా (2022-23) హౌస్‌హోల్డ్ కన్‌జంప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే బహిర్గతం చేసింది. ఇలాంటి ఆర్థికాంశాల వైతరణిని దాటడానికే రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ జరిపింది మోడీ సర్కార్. అయినా ఓట్ల వర్షం కురిసేలా లేదు. పాపం! ఏం చేస్తారు? తెలుగు రాష్ట్రాల్లో కాషాయ జెండాకు ఎదురు లేదని మోడీ, అమిత్‌షాలు పల్లవిలంకించుకున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ బుట్ట ఖాళీ అవుతూనే ఉంది. కొందరు బీజేపీలోకి, మరెందరో కాంగ్రెస్‌లోకి సర్దుకుంటున్నారు. పదవుల ఆశచూపి పోగేసిన జనం ఆపదవే లేకుండా పోయిన తర్వాత ఎందుకుంటారు? అధికారంలో ఉన్నప్పుడు ఫెడరల్ ఫ్రంట్ అన్నారు. ఆ తర్వాత ఏ ప్రత్యామ్నాయ విధానాలూ లేకుం డానే' తృతీయ ప్రత్యామ్నాయం' అన్నారు. తెలంగాణ అస్థిత్వం మీద ఆధారపడ్డ పార్టీని ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి చేశారు. దాని కోసం రెండు, మూడు రాష్ట్రాల్లో ఉమ్మాయ్, జక్కాయ్ లాంటి ఊడగొట్టిన నాగటి దుంపల్ని పోగేశారు. బీఆర్ఎస్ అధినేతను దగ్గరగా చూసినవారు ఇదంతా క్యాడర్‌ను నిలబెట్టుకోవడానికే గాక తనను తాను శక్తివంతునిగా చూపడానికేనంటారు. ఆయన పార్టీ ఆయనిష్టం అని కొందరు వాదించచ్చు. దాన్ని కాసేపు ఒప్పు కుందాం.

మొదటి మూడు దశల పోలింగు అయిపోగానే బీజేపీ హవాలేదని అర్థమై, రానున్నది ప్రాంతీయ పార్టీల కూటమి ప్రభుత్వమేననీ, "దేవుడు మేలుచేస్తే" తానూ ప్రధాని రేసులో ఉన్నానని ఉద్ఘాటించి నవ్వుల పాలైనాడు కేసీఆర్. ఎందుకు నగుబాటుకు గురైనాడో ఆయనకు అర్థం కాకున్నా నాలుగు కోట్ల తెలంగాణ వాసులకు తెలియాలి. 37 ప్రాంతీయ, జాతీయ పార్టీలు కాంగ్రెస్‌తో కలిసి 'ఇండియా' కూటమిలో ఉన్నాయి. మరో 40 దాకా ఎన్డీయేలో భాగస్వాములై బీజేపీతో కలిసున్నాయి. ఏ ప్రాంతీయ పార్టీల గురించి కేసీఆర్ చెప్పేది? చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల గురించా? బీజేపీతో రహస్యంగా బాదరాయణ సంబంధం నెరుపు తున్న జగన్మోహన్ రెడ్డితో కేసీఆర్ ఉంటాడా? ఊసరవెల్లిగా రుజువైన నితీష్‌తోనా? ఆప్, డీఎంకేలు, సమాజ్‌వాద్ పార్టీ, ఆర్జేడీలు 'ఇండియా' కూటమిలో నుండి బయటికి దూకి కేసీఆర్ చంకనెక్కుతారనుకుంటున్నారా? అసలు ఇప్పటికీ ఫలానా పార్టీని వ్యతిరేకించాలనే చిత్తశుద్ధి కేసీఆర్‌కుందా?

తాను ప్రధాని అవడం సంగతి ఎలా ఉన్నా.. తాడో లేదో గాని కనీసం బీఆర్ఎస్‌ను ఒక పార్టీగానైనా మిగల్చాలంటే 'అడ్ హాకిజం' కాకుండా నికరంగా బీజేపీ వ్యతిరేక కూటమిలో నిలబడితే అయింత పరువైనా మిగులుతుంది. మన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కేరళకుపోయి విజయన్‌పై అవాకులు చెవాకులు పేలినా రాష్ట్ర సీపీఐ(ఎం) మాత్రం తాము పోటీ చేసే భువనగిరి తప్ప మిగిలిన పదహారింటా కాంగ్రెస్‌నే బలపరుస్తామనడం లక్ష్యం నుండి తమ కన్ను తిప్పకపోవడానికి సంకేతం.

ఉదారవాదపు సంక్షోభం



ప్రభాత్ పట్నాయక్

ప్రతీ రాజకీయ కార్యాచరణ ప్రక్రియా ఏదో ఒక ఒక రాజకీయ తాత్విక సిద్ధాంతం చూపే వెలుగులో కొనసాగుతూ వుంటుంది. ప్రత్యేకించి ప్రస్తుత ఆధునిక కాలంలో ప్రతీ రాజకీయ తాత్విక సిద్ధాంతమూ ప్రపంచంలో వ్యక్తమౌతున్న ఆర్థిక ధోరణులను విశ్లేషిస్తుంది. ఆ విశ్లేషణ ఆధారంగా ఆ తాత్విక సిద్ధాంతం కొన్ని లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఆ లక్ష్యాలను సాధించడానికి పోరాడవలసి వుంటుంది. ఆ పోరాటాన్ని సంబంధిత రాజకీయ కార్యాచరణ ప్రక్రియ ద్వారా నిర్వహిస్తారు. అలా నిర్దేశించిన లక్ష్యాలు సాధించడం కష్టతరం కావచ్చు. కొన్ని పరిస్థితుల్లో చాలా కష్టం కూడా కావచ్చు. ఆ కష్టాలు ఆ రాజకీయ కార్యాచరణ ప్రక్రియకు ఆటంకంగా ఉంటాయి. కాని ఆ ఆటంకాలను బట్టి ఆ రాజకీయ తాత్విక సిద్ధాంతం సంక్షోభంలో పడింది అన్న నిర్ధారణకు రాలేము. ఒకానొక లక్ష్యాన్ని సాధించడంలో ఉండే కష్టాలను బట్టి ఆ సిద్ధాంతం సంక్షోభంలో ఉందని చెప్పలేం. ఆ రాజకీయ తాత్విక సిద్ధాంతంలోనే పరిష్కరించలేని అంతర్గత వైరుధ్యం తలెత్తినప్పుడు, ఆ వైరుధ్యాన్ని పరిష్క రించడం కోసం ఆ సిద్ధాంతం ప్రతిపాదించే మార్గం అదే సిద్ధాంతంలోని మరో అంశానికి భిన్నంగా ఉన్నప్పుడు మాత్రమే ఆ రాజకీయ తాత్విక సిద్ధాంతం సంక్షోభంలో ఉందని అంటాం.

మార్క్సిజం ముందుకు తెచ్చిన రాజకీయ తాత్విక సిద్ధాంతం నిర్దేశించిన సోషలిజం లక్ష్యాన్ని సాధించడం ప్రస్తుత పరిస్థితులలో మరింత కష్టతరంగా మారింది. వామపక్ష శక్తుల బలహీనపడ్డాయి. కాని ఈ ఆటంకాలను బట్టి మార్క్సిజం ఒక సిద్ధాంతంగా సంక్షోభంలో చిక్కుకుంది అని నిర్ధారించడానికి లేదు. కాని ఉదారవాదం అనే రాజకీయ సిద్ధాంతం మాత్రం ఒక సంక్షోభాన్ని ఎదు ర్కొంటోంది. ఉదారవాదం మానవ స్వేచ్ఛ అనే లక్ష్యాన్ని నిర్దేశించి దానిని సాధించడానికి మార్గాన్ని ప్రతిపాదించింది. కాని ఆ మానవ స్వేచ్ఛను ఉదారవాదం తనకు ప్రాణప్రదం అయిన ప్రస్తుత వ్యవస్థ కొనసాగుతుండగా సాధించడం అసాధ్యంగా పరిణమించింది. ఈ ఆర్థిక వ్యవస్థ పరిణామం చెందే క్రమంలోనే తలెత్తిన ఈ వైరుధ్యానికి ఉదారవాదం దగ్గర సమాధానం ఏదీ లేదు. ఇదే ఉదారవాద సిద్ధాంతం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సిద్ధాంత సంక్షోభపు సారం.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆ కాలంలో బోల్షివిక్ విప్లవం విజయవంతమైంది. దీనికి ప్రతిస్పందనగా ఆధునిక ఉదారవాదం ఒక సిద్ధాంతంగా ముందుకొచ్చింది. ఆ కాలంలో తలెత్తిన సంక్షోభాలకు గాని, భవిష్యత్తులో తలెత్తబోయే సంక్షోభాలకు గాని, ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిని దాటకుండానే ఏవిధంగా పరిష్కరించవ చ్చునో మార్గం చూపిన సిద్ధాంతంగా ఈ ఆధునిక ఉదారవాదం ముందు కొచ్చింది. పాశ్చాత్య దేశాలలో ఉనికిలో ఉన్న ఉదార ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం-ఈ రెండింటికీ తోడు రాజ్యం జోక్యం చేసుకుంటే అప్పుడు అది మానవ స్వేచ్ఛను సాధించగల అత్యుత్తమ చట్రమౌతుంది అని అది విశ్వసించింది. పాశ్చాత్య దేశాలలో అమలౌతున్న ఉదార ప్రజాస్వామ్యంలోని వ్యవస్థలలో రాజ్యం అనేది ఒక 'వర్గ' రాజ్యంగా ఉండదని, అది ఒక సామాజిక హేతుబద్ధతను వ్యక్తం చేసే రూపంగా ఉంటుందని, మరే ఇతర సామాజిక వ్యవస్థలలో కన్నా ఇందులోనే ఆ హేతుబద్ధత బాగా వ్యక్తం ఔతుందని ఉదారవాదం భావించింది. అందుచేత అటువంటి ఉదారవాద ప్రజాస్వామ్య రాజ్య వ్యవస్థ దేశ ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోగలుగుతుందని, ఆ విధమైన జోక్యం ద్వారా పెట్టుబడి దారీ వ్యవస్థలో అప్రయత్నంగా దొర్లే లోపాలను అది సరిచేయగలుగుతుందని భావించింది. అంతేకాక, అటువంటి లోపాలు ఏవీ ఒకవేళ తలెత్తకపోయినా, సామాజిక హేతుబద్ధత కోరుకునే విధంగా అందుకు కట్టుబడి వ్యవహరించేలా పెట్టుబడిదారీ వ్యవస్థను కట్టడి చేయగలుగుతుందని భావించింది. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవాడు జాన్ మేనార్డ్ కీన్స్. ఈ ఆంగ్లేయ ఆర్థికవేత్త ఈ సిద్ధాంతానికి నయా ఉదారవాదం అని నామకరణం చేశాడు. అంతకుముందు కాలంలో ఉదారవాదం అనే సిద్ధాంతం ఉనికిలో ఉంది. ఆ పాత ఉదారవాదానికి ఈ కొత్త ఉదారవాదం భిన్నంగా ఉంటుంది. పాత ఉదారవాద సిద్ధాంతాలన్నీ ఆర్థిక వ్యవస్థలో రాజ్యం వీలైనంత పరిమితంగానే జోక్యం కల్పించుకోవాలని చెప్పాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడూ "దాదాపు పూర్తిస్థాయి"లో ఉపాధి కల్పన కల్పిస్తూ ఉంటుందన్న పొరపాటు అభిప్రాయంతో ఆ పాత సిద్ధాంతాలు ఉండేవి.

ఉదారవాదపు ప్రస్తుత కొత్త రూపం ఎంతవరకూ సహేతుకమైనది అని గాని, ఈ వాదం పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రం లోపల చెల్లుతుందా లేదా అన్నది కాని నేనిప్పుడు చర్చించబోవడం లేదు (నిజానికి ఈ నయా ఉదారవాదం ఇప్పుడు ఎంత మాత్రమూ చెల్లదు. ఎందుకంటే ఈ నయా ఉదారవాదం సామ్రాజ్యవాదం అనే ఒక పెట్టుబడిదారీ దశను ఏ మాత్రమూ పరిగణనలోకి తీసు కోలేదు, దానిని గుర్తించలేదు, ఊహించనూ లేదు.). కాని ద్రవ్య పెట్టుబడితో సహా పెట్టుబడి యావత్తూ ప్రపంచీకరించబడ్డాక ఈ సిద్ధాంతం ఏ మాత్రమూ చెల్లదు. నయా ఉదారవాదం ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థలో రాజ్యం జోక్యం చేసుకోవాలి. ఈ రాజ్యం ఎప్పుడూ జాతి రాజ్యంగానే ఉంటుంది. ఏ దేశానికి ఆదేశం ఒక రాజ్య వ్యవస్థను కలిగి వుంటుంది.

ఒకసారి ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరించబడిన తర్వాత ఈ పెట్టుబడి చెప్పినట్టు దానికి లోబడి ఆయా జాతి రాజ్యాలు వ్యవహ రించాలే తప్ప ఆ రాజ్యాల నియంత్రణకు ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి లోబడి నడుచుకోదు. ఒకవేళ ఏ రాజ్యం అయినా నియంత్రించడానికి పూనుకుంటే, ద్రవ్య పెట్టుబడి అక్కడి నుంచి పలాయనం చిత్తగిస్తుంది. అందుచేత రాజ్యం ఇంకెంత మాత్రమూ సామాజిక హేతుబద్ధతకు ప్రతిరూపంగా వ్యవహరించలేదు.

నయా ఉదారవాదం ప్రతిపాదించబడినప్పుడు ఆయా దేశాల పరిధుల్లోనే అక్కడి పెట్టుబడి కార్యకలాపాలు ప్రధానంగా కొనసాగేవి. కీన్స్ తన సిద్ధాంతాన్ని గురించి చర్చిస్తున్న కాలంలో ఈ విషయాన్నే ప్రత్యేకించి చెప్పేవాడు. కాని పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా సంచరించడం పెరిగాక ఈ ప్రాతిపదిక ఇంకెంత మాత్రమూ పనికిరాకుండా పోయింది. ఇప్పుడు ఒకవేళ దేశంలో ప్రజలందరూ కోరుతున్నారు గనుక సామాజిక హేతుబద్ధత ప్రాతిపదికన మన దేశం వరకూ ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని నియంత్రిద్దాం అని ప్రభుత్వం భావించినా, అందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒప్పుకోదు.



ఉదారవాద సిద్ధాంతపు ప్రస్తుత సంక్షోభపు మూలాలు ప్రపంచీకరణ అనే ప్రక్రియలో ఉన్నాయి. అయితే నయా ఉదారవాద సంక్షోభం ఫలితంగా భారీ స్థాయిలో నిరుద్యోగం తలెత్తినప్పుడే ఈ సిద్ధాంతమూ సంక్షోభంలో చిక్కుకుందన్న సంగతి స్పష్టంగా బయటపడింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆయువుపట్టు అంతా ఈ నిరుద్యోగ సమస్య దగ్గరే ఉంటుందని కీన్స్ కూడా భావించాడు. రాజ్యం జోక్యం చేసుకుని దానిని గనుక పరిష్కరించకపోతే బోల్షివిక్ విప్లవం తరహాలో మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలో విప్లవాలు సంభవిస్తాయని హెచ్చరించాడు.

అందుచేత ఉదారవాద సిద్ధాంతపు ప్రస్తుత సంక్షోభపు మూలాలు ప్రపంచీకరణ అనే ప్రక్రియలో ఉన్నాయి. అయితే నయా ఉదారవాద సంక్షోభం ఫలితంగా భారీ స్థాయిలో నిరుద్యోగం తలెత్తినప్పుడే ఈ సిద్ధాంతమూ సంక్షోభంలో చిక్కుకుందన్న సంగతి స్పష్టంగా బయటపడింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆయువుపట్టు అంతా ఈ నిరుద్యోగ సమస్య దగ్గరే ఉంటుందని కీన్స్ కూడా భావించాడు. రాజ్యం జోక్యం చేసుకుని దానిని గనుక పరిష్కరించకపోతే బోల్షివిక్ విప్లవం తరహాలో మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలో విప్లవాలు సంభవిస్తాయని హెచ్చరించాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు మించి జరిగే అధికోత్పత్తి ఫలితంగా ఏర్పడే సంక్షోభానికి పరిష్కారంగా డిమాండ్‌ను పెంచాలని కీన్స్ సూచించాడు. డిమాండ్‌ను పెంచే విధంగా రాజ్యం జోక్యం ఉండాలని ప్రతిపాదించాడు. అందుకోసం రాజ్యం తన ఖర్చును పెంచాలని, ఆ ఖర్చుల కోసం అవసరమైన ఆదాయాన్ని పన్నులను పెంచడం ద్వారా రాబట్టాలని చెప్పాడు. సంపన్నుల మీద అదనంగా పన్నులను వేయడం సాధ్యం కాకపోతే ప్రభుత్వం లోటు బడ్జెట్ ద్వారా ఖర్చు పెంచాలని చెప్పాడు. శ్రామిక ప్రజల మీద అదనంగా పన్నులను విధిస్తే వారు మామూలుగా సరుకులను కొనుగోలు చేయడానికి వినియోగించే సొమ్ము నుంచే ఆ పన్నులు చెల్లించవలసి వస్తుంది. అప్పుడు మార్కెట్‌లో డిమాండ్ తగ్గుతుంది. అందుచేత శ్రామిక ప్రజల మీద అదనపు పన్నులను విధించడం వలన డిమాండ్ పెరగదు. సంక్షోభమూ నివారించబడదు.

అయితే రాజ్యం డిమాండ్‌ను పెంచడం కోసం చేయవలసిన అదనపు ఖర్చుకు సరిపడా ఆర్థిక వనరులను సమీకరించడానికి కీన్స్ ప్రతిపాదించిన రెండు మార్గాలూ ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి అంగీకారం కావు. అది సంపన్నుల మీద అదనపు పన్నులను విధించడానికీ ఒప్పుకోదు, బడ్జెట్‌లో ద్రవ్య లోటు పెంచడానికీ ఒప్పుకోదు. అంటే సంక్షోభ నివారణకు రాజ్యం ఏ విధంగానూ జోక్యం చేసుకోరాదన్నదే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి భావిస్తుంది. అందుచేత కీన్స్ ప్రతిపాదించిన నయా ఉదారవాదం పెట్టుబడి ప్రపంచీకరణ జరిగిన ప్రస్తుత కాలంలో పనికి రాకుండా పోయింది. నయా ఉదారవాద విధానాలు కొనసాగడానికి ముందు దారిలేకుండా మూసుకుపోయింది. ఇది నయా ఉదారవాద రాజకీయ, తాత్విక సిద్ధాంతానికి పట్టిన సంక్షోభం.

ఈ ఆర్థిక సంక్షోభం ఏవిధంగా పరిణమిస్తోందో యూరప్‌ను పరిశీలిస్తే బాగా బోధపడుతుంది. 1970 దశకం మధ్య కాలం వరకూ (అంటే సుమారు 1975 వరకూ) యూరోపియన్ యూనియన్ దేశాలలో నిరుద్యోగం 3 శాతంగా చాలా కాలంపాటు కొనసాగింది. 1970 దశకం చివరినుండీ, 1980 దశకం అంతా ఈ నిరుద్యోగం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ కాలంలోనే అక్కడ ప్రపంచీకరణ క్రమం అమలు మొదలైంది. అలా పెరిగి 7 శాతానికి నిరుద్యోగం చేరింది. (ప్రస్తుతం ఇది 15 శాతంగా ఉంది) అక్కడి ప్రభుత్వాలు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించినా, నిరుద్యోగం తగ్గలేదు.

ప్రపంచీకరణ అమలులో ఉన్నాక, ఏ ఒక్క ప్రభుత్వమో విడిగా తన దేశంలో నిరుద్యోగాన్ని తగ్గించడానికి జోక్యం చేసుకునేందుకు పూనుకుంటే అది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో తల పడవలసి వస్తుంది. అప్పుడు ఆ ద్రవ్య పెట్టుబడి సదరు దేశాన్ని విడిచిపెట్టి బయటకు పోతుంది. దానివలన ఆ దేశ ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడుతుంది. ఇలా జరగకుండా ఉండడానికి అన్ని దేశాలూ ఒక దగ్గరకు వచ్చి ఒకే విధమైన విధానాన్ని అమలు చేస్తే అప్పుడు ద్రవ్య పెట్టుబడి బయటకు పోయే అవకాశాలకు చెక్ పెట్టవచ్చు. అన్ని దేశాలూ తమ ఆర్థిక వ్యవస్థల్లో జోక్యం పెంచుకుని నిరుద్యోగాన్ని తగ్గించేందుకు పూనుకోవచ్చు.

ఈ విధంగా చేయాలంటే కాస్త ముందో, వెనుకో, ఆ దేశాలు తమ వాణిజ్యం మీద కూడా నియంత్రణ చర్యలు చేపట్టాలి. కొన్ని ఆంక్షలు విధించాలి. ఈ విధంగా చేయడమంటే అది పెట్టుబడి తన ఇష్టం వచ్చినట్టు సంచరించగల పరిస్థితి లేకుండా చేయడమే అవుతుంది. దీనిని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి మొత్తంగా వ్యతిరేకిస్తుంది. అయినా లెక్క చేయకుండా ప్రభుత్వాలు ముందుకు సాగాలంటే, ఆ ప్రభుత్వాలు అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా తక్కిన వర్గాలను కూడగట్టి ప్రత్యామ్నాయాన్ని రూపొందించాల్సి ఉంటుంది.

ఆ విధంగా ప్రపంచ దేశాల నడుమ ఒక నిజమైన సమన్వయం ఏర్పడి ఆయా ప్రభుత్వాలు తమ తమ ఆర్థిక వ్యవస్థల్లో బలంగా జోక్యం కల్పించుకోవాలంటే ఒకవిధమైన అంతర్జాతీయత అవసరం. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒక స్వతఃసిద్ధమైన లక్షణం ఉంది. ముందుగా అభివృద్ధి చెందిన దేశాలు తమకన్నా వెనుకబడిన దేశాల మీద ఆధిపత్యాన్ని చెలాయిస్తాయి. ఈ మాదిరి ఆధిపత్యం కొనసాగు తున్నంత కాలమూ పెట్టుబడిదారీ విధానంలో అంతర్జాతీయ సమన్వయం, సహకారం నిజమైన అర్థంలో సాధ్యం కాదు.

మహా అయితే, సంపన్న పెట్టుబడిదారీ దేశాల వరకూ తమలో తాము ఒకమేరకు సహకరించుకుంటూ, రెండోపక్క వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలలో తాము నిర్దేశిం చిన ద్రవ్య నియంత్రణ చర్యలు కొనసాగేట్టు చేయ గలుగుతాయి. అంటే సామ్రాజ్య వాదం మూడో ప్రపంచ దేశాల మీద తన పట్టును మరింత బిగిస్తుంది. మరి ఆవిధంగా కొన్ని దేశాల మీద సామ్రాజ్యవాదపు పట్టు బిగించడం అంటే ఉదారవాదం ప్రబోధించే మానవ స్వేచ్ఛకు విఘాతం కాదా? అంటే ఉదారవాదం ప్రబోధించే మానవ స్వేచ్ఛకు, పెట్టుబడిదారీ విధానం కొనసాగడానికి నడుమ పొంతన లేకుండా పోవడమే కదా?

ఇలా ఎటూ తేల్చుకోలేకుండా ఉన్న పరిస్థితి ఉదారవాద సిద్ధాంత సంక్షోభపు సారాంశం. నిరుద్యోగం విపరీతంగా పెరుగుతూ వున్నప్పుడు, దాని ఫలితంగా శ్రామికుల వేతనాలు కూడా తగ్గి పోతూ వున్నప్పుడు, ఇదంతా కలిసి శ్రమజీవుల జీవితాలను అంతకంతకూ దుర్భరం చేస్తూన్నప్పుడు మానవ స్వేచ్ఛ వర్ధిల్లుతోందని ఉదారవాదం చెప్పుకోలేదు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే నయా ఉదారవాద చట్రం పరిధి నుండి బైటపడి ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థను రూపొందించాలి. అంటే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను దాటి సమాజాన్ని ఒక కొత్త దశ వైపు నడిపించే ప్రత్యామ్నాయ శక్తుల కలయిక జరగాలి (అలా కాకుండా మళ్ళీ నయా ఉదారవాద దశకు ముందు ఉన్న దశవైపు వెనక్కి పోవాలనే వాదన కూడా ఉంది. కాని అలా వెనక్కిపోవడం అంటే మళ్ళీ స్వేచ్ఛాయుత పోటీ నెలకొన్న పెట్టుబడిదారీ దశకు పోవాలని అర్థం. మరి ఆ పోటీ లోంచే కదా గుత్త పెట్టుబడిదారీ దశ వచ్చింది? అక్కడి నుండే కదా ప్రస్తుత సమస్యలన్నీ వచ్చాయి? అందుచేత అది పరిష్కారం కాజాలదు. పోనీ, వెనుకబడ్డ దేశాలను మినహాయించి సంపన్న దేశాల వరకూ సహకరించుకుంటూ నిరుద్యోగాన్ని అదుపు చేయాలనుకుంటే, అది ఉదారవాద ఆదర్శాలకే భిన్నం కదా?

గతంలో మహా మాంద్యం నెలకొన్నప్పుడు సాంప్రదాయ ఉదారవాదం దిక్కుతోచని స్థితిలో నిస్సహాయంగా ఉండిపోయింది. మళ్ళీ ప్రస్తుతం నెలకొన్న మహా మాంద్యంలో నయా ఉదారవాదం అదే మాదిరిగా నిస్సహాయంగా ఉంది. మరి వేరే ఇతర ఉదారవాదమూ పరిష్కారం చూపడానికి ముందడుగు వేయడం లేదు. అది సాధ్యం కూడా కాదు. ఈ పెట్టుబడిదారీ చట్రాన్ని యథాతథంగా కొనసాగిస్తూ ప్రస్తుత సంక్షోభానికి పరిష్కారం చూపగలిగే మందు ఎక్కడా లేదు.

(స్వేచ్ఛానుసరణ)

మెయిల్ @ నవతెలంగాణ

'ఇండియా' గెలవాలి

తెలంగాణ అమరవీరుల త్యాగానికి, బలిదానాలకు చలించి సోనియమ్మ నాడు తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం ఇచ్చిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఆమె అఖిలపక్ష పార్టీలను ఒప్పించి, తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరించింది కనుకే రాష్ట్రం కల సాకారమైంది. ఇంకెన్ని ప్రాణాలు పోయినా, ఇంకెంత కాలం పోరాటం చేసినా తెలంగాణ వచ్చేది కాదు.అయితే తెలంగాణ వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి జరిగిన నష్టం పూడ్చలేనిది. ఆమెను కలిసి మనోధైర్యాన్ని నింపేందుకు తెలంగాణ ఇచ్చిన సోనియమ్మను ఉద్యమకారుల ఫోరం తరఫున పోర్ట్రైట్ పై "సేవియర్ ఆఫ్ తెలంగాణ సోల్స్" అని నా దస్తూరితో రాసి ఆమెను కలిసి బహుమానంగా అందజేశాను. దీనికి బదులుగా తమనుంచి గానీ, పార్టీ నుంచి ఏదైనా కావాలా? అని ఆమె అడిగారు. 'వస్తుందో, రాదో అనుకున్న తెలంగాణను ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పడానికే వచ్చాను, సమయం వచ్చిన ప్పుడు నేను, తెలంగాణ ప్రజలుగా మీ రుణం తీర్చుకోవడమే ఇంకా బాకీ ఉన్నది' అని చెప్పాను. అప్పుడు ఆమెకు నేనిచ్చిన మాటలు ఈ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గుర్తుచేసుకున్నాను. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని పార్టీలను కలుపుకుపోతూ 'హస్తం' హవా చూపుతోంది. అయితే ఎంపీ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలు గెలుస్తుందనే నమ్మకమైతే ఉన్నది. ప్రజలు ఇండియా కూటమివైపు మొగ్గుచూపారనేది పోలింగ్‌బట్టి తెలుస్తోంది. ప్రజా స్వామ్యం పరిరక్షించబడాలన్నా, రాజ్యాంగం యథావిధిగా కొనసా గాలన్నా కాంగ్రెస్ ఆధ్వర్యంలోని 'ఇండియా' కూటమి అధికారంలోకి రావాలి. తెలంగాణలో ఎలాగైతే దొరల పాలనకు స్వస్తి పలికామో, దేశంలోనూ మతతత్వపార్టీని ఓడించే అవకాశం ఇప్పుడొచ్చింది. రాష్ట్రంలో నిన్నటితో ఎన్నికల సరళి ముగిసినా దేశంలో ఈ నెలాఖరు వరకు పోలింగ్ జరగనుంది. మన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే 'చెయ్యెత్తి' జైకొట్టాల్సిందే.

- సయ్యద్ రఫీ

మోడీ మహా కుబేర సామ్రాజ్యం

ఏప్రిల్ 21న రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో నరేంద్రమోడీ చేసిన ప్రసంగంలో ముస్లింలపై విషపూరతమైన రీతిలో దాడిచేశారు. సంపద పునఃపంపిణీ కోసం జరిగే ఎలాంటి ప్రయత్నమైనా సరే హిందువుల బంగారాన్ని ఆస్తినీ 'చొరబాటుదారుల'కు అప్పగించడమే అవుతుందన్నట్టు భయానకంగా చిత్రించారు. ఈ ప్రసంగంలో ప్రదర్శితమైన మూఢద్వేషం సహజంగానే విస్తారమైన ఖండనలకు గురికావడాన్ని మనం అర్థం చేసుకోదగిందే.కాని ఆ ప్రసంగంలో మరో పార్శ్వం వుంది. మోడీకి, బీజేపీకి ఎంత కరుడుగట్టిన అభివృద్ధి నిరోధక భావజాలం వుందో ఆ ప్రసంగం తేటతెల్లం చేసింది. విపరీతమైన అససమానతలకు నిలయంగా వున్న భారతదేశంలో సంపదనూ ఆదాయాలను పునఃపంపిణీ చేయాలనే ఏ కాస్త ప్రతిపాదన వచ్చినా వారెంతో విద్వేషం వెళ్లగక్కుతున్నారు.

దోచిపెట్టిన మోడీ సర్కార్

కాంగ్రెస్ మద్దతుదారుడైన శ్యామ్ పిట్రోడా ఎప్పుడో చేసిన కొన్ని వ్యాఖ్యలను మోడీ బీజేపీ ఈ సందర్భంలో ముందుకు తెచ్చారు. అమెరికాలో వున్నట్టుగా భారత దేశంలోనూ వారసత్వ (సంక్రమణ) పన్నును ప్రవేశపెట్టాల్సిన ప్రతిపాదనను పరిశీలించాలని ఆయన అన్నారు. వారసత్వ పన్ను అనే భావనను ప్రస్తావించడమే మోడీకి, ఆయన మితవాద పాలక పార్టీకి ఎక్కడలేని కోపం తెప్పించింది. ఇది గత పదేండ్లుగా మోడీ ప్రభుత్వం సంపన్న వర్గాల అనుకూల విధానాలను అనుసరించడమే అంతరాలు ఇంతగా పెరగడానికి కారణమైంది. కార్పొరేట్లకు పన్ను రాయితీలు గుప్పించడం, సంపద పన్ను రద్దు చేయడం, అత్యధిక ఆదాయం వచ్చే వర్గాలపై ఆదాయ పన్ను తగ్గింపు, ఆశ్రిత పెట్టుబడి దారుల పట్ల అమితమైన అనుకూలత ప్రదర్శించడం..ఇవే అసమానతలకు ఆజ్యం పోశాయి. ప్రపంచంలోనే ఇండియాను అత్యధిక అసమానతల దేశంగా మార్చాయి.

అగాధమైన ఈ అసమానతల స్వరూపం ఏంటో కండ్లకు కట్టే సంఖ్యా వివరాలు పుష్కలంగా అందుబాటులో వున్నాయి. ప్రపంచ అసమానతల ప్రయోగశాల లెక్కల ప్రకారం 2022-23లో దేశంలో సంపదలలో 65 శాతం, ఆదాయాలలో 57 శాతం అత్యగ్ర స్థానంలో వుండే పది శాతం మంది మహా కుబేరుల చేతుల్లో వున్నాయి. ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం అందరికన్నా పైన వున్న ఒక శాతం మంది 47 శాతం సంపద అనుభవిస్తుంటే దిగువన వున్న 60 శాతం మంది చేతుల్లో వున్న సంపద కేవలం 4.7 మాత్రమే. బాగా పైనున్న ఆ ఒక్క శాతం మంది చేతిలోని అక్రమ ధనాన్ని కూడా లెక్కలోకి తీసుకుంటే ఇది ఘోరంగా వుంటుంది. భారత రాజ్యాంగం మన ప్రజల్లో విస్తారమైన భాగం ప్రత్యేకించి సామాజికంగా అణచివేయబడిన వారలు ఎలాంటి భౌతిక వనరుల నుంచి దూరం చేయబడిన స్థితిలో వున్నారనే వాస్తవాన్ని భారత రాజ్యాంగం గుర్తించింది. ఆర్థిక, సామాజిక రంగాల్లో వారు అన్యాయమైన పరిస్థితి లోకి నెట్టబడ్డారనే సామాజిక వాస్తవాన్ని గుర్తించింది. అందుకే దీనికి సంబంధించి రాజ్యాంగం నాలుగోభాగంలో ప్రభుత్వ విధానాలకు ఆదేశిక సూత్రాలను కొన్నిటిని పొందుపర్చింది. ఆ భాగంలోని 39 (బి) అధికరణం ఇలా పేర్కొంది: దేశంలోని భౌతిక వనరుల యాజమాన్యం, నియంత్రణ అందరి శ్రేయస్సు కోసం ఉపయోగపడే విధంగా పునఃపంపిణీ జరగాలి. ఉమ్మడి శ్రేయస్సుకు హాని కలిగించే రీతిలో సంపదలు ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ జరగని రీతిలో ఆర్థిక వ్యవస్థను నిర్వహించాలని ఉప నిబంధన(సి) ఆదేశించింది.

అసమానతల తగ్గింపెలా?

కాని గత మూడు దశాబ్దాలుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు ఈ ఆదేశిక సూత్రాలకు విరుద్ధమైన దిశలో పని చేశాయి. ఒక చిన్న దొంతరగా వున్న కుబేర వర్గాల చేతిలో సంపదలు పోగుపడి పోయాయి. 90 శాతం మంది ప్రజలు గౌరవ ప్రదమైన రీతిలో మెరుగైన జీవితం గడిపేందుకు అవసరమైన భౌతిక వనరులు హరించివేయబడ్డాయి. నయా ఉదారవాద విధానం ప్రపంచవ్యాపితంగా అసమానతలకు దారి తీస్తే ఇందులో భారత దేశం మరీ అసమానతల మహా సముద్రంగా



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

మారిపోయింది. ఇంకా ఇంకా లోతుల్లోకి దిగిపోయింది. ఆయా దేశాల్లో అసమానతలను తగ్గించడమెలా? అలాగే సుసంపన్నమైన పారిశ్రామిక దేశాలకు వర్ధమాన దేశాలకూ మధ్య గండి పూడ్చడమెలాగనే దానిపై మరోసారి ఆలోచనలు మొదలయ్యాయి. ఈ అసమానతలు తగ్గించేందుకు పేదరికాన్ని తగ్గించి భౌతిక వనరులను అందుకోసం ఉపయోగించేలా రాజ్యం జోక్యం చేసుకోవడానికి ఒక మార్గం పన్ను విధానం, దాన్ని సంపద పునఃపంపిణీకి వీలుగా రూపొందించడం అందుకో మార్గం. సంపద పన్ను అంటే బడా కుబేరులపై పన్ను, వారసత్వ పన్ను, బహుమతి పన్ను అందులో కొన్ని. వీటిపై బడా పెట్టుబడి దారీ దేశాల్లో ఎప్పటి నుంచో ఆలోచనలు సాగుతున్నాయి. వారసత్వంగా సంక్రమించే సంపదపై పన్ను వేయడం, ఈ సంపదను ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించడం అన్నది వీటిలో బాగా పాతుకుపోయిన ఒక ప్రతిపాదన. ఇందులో మళ్లీ రెండు రకాలుంటాయి. ఎస్టేట్ (ఆస్తి) పన్ను, వారసత్వ పన్ను. మొదటిది- మరణించిన వ్యక్తి ఎస్టేట్‌ను అర్హులైన వారికి ధారాదత్తం చేసేముందే ఎస్టేట్ పన్ను విధించబడుతుంది. అలాగాక ఆ ఆస్తి వారసత్వంగా పొందిన భాగస్వామి లేక కుటుంబ సభ్యులపై వారసత్వ పన్ను విధించడం రెండో పద్ధతి. యూరోపియన్ యూనియన్‌లోని 19 దేశాలలో ఈ మూడు రకాలైన ఎస్టేట్ పన్ను, వారసత్వ పన్ను, బహుమతి పన్నులలో ఏదో ఒకటి వుంది. ఉదాహరణకు బ్రిటన్‌లో వారసత్వ పన్ను 40 శాతం వుంటుంది. ఫ్రాన్స్‌లో 45 శాతం, నెదర్లాండ్స్‌లో 40 శాతం వరకూ వుంది. యూరోపియన్ యూనియన్ వెలుపల జపాన్‌లో వారసత్వ పన్ను 55 శాతం వుంది. అమెరికాలోని వివిధ రాష్ట్రాలు 20 నుంచి 55 శాతం వరకూ వారసత్వ ఆస్తి పన్ను విధిస్తున్నాయి.

ఎవరిపై ప్రభావం?

భారత దేశం విషయానికొస్తే వారసత్వ పన్నును 1985లోనూ సంపద పన్నును 2015 లోనూ ఎత్తివేశారు. ఈ పన్నుల వల్ల వచ్చే ఆదాయం అత్యల్పంగా వుందనీ, వచ్చేదాని కన్నా వసూలు చేయడానికి, నిర్వహణకు ఎక్కువ ఖర్చు అవుతోందని కారణం చెప్పారు. దేశంలో కొందరు భారతీయుల భోగభాగ్యాలు జుగుప్సాకరమైన స్థాయికి పరుగు పెడుతున్న ఈ దశలో వారి సంపదపై పన్ను వేయడం న్యాయం సమ ధర్మం కూడా. అంతర్జాతీయంగా కార్పొరేట్ పన్ను సంస్కరణల కోసం పని చేసిన స్వతంత్ర కమిషన్ సహాధ్యక్షురాలుగా పని చేసిన జయతీ ఘోష్ కొన్ని సూచనలు చేశారు. 2023 హురున్ ప్రపంచ జాబితాలోని 187 బిలియన్ డాలర్లు గల మహా కుబేరులపై సంపద పన్ను వేయాలని సూచించారామె. ఈ ప్రకారం చేయడమంటే జనాభాలో 99.99 శాతం మందిపై ఎలాంటి ప్రభావం పడదన్న మాట. వారి సంపదలపై కేవలం 4 శాతం పన్ను విధించినా ప్రజారోగ్యానికి, విద్యకు గణనీయమైన ఆదాయం వస్తుంది. అదే విధంగా సంపద పన్ను అనేది కేవలం బాగా పైన వున్న వారిపైనే విధించబడుతుంది. చిన్న, మధ్య తరహా స్థాయి ఆదాయాలు, ఆస్తులపై ఎలాంటి వారసత్వ పన్ను వుండదు.

ఉదాహరణకు రూ.వంద కోట్ల పైన ఆస్తి గలవారికే ఇది వర్తిస్తుంది. అది కూడా దశల వారీగా. అందువల్ల మంగళ సూత్రాలు, ఇతర ఆస్తులు జప్తు చేయడం వంటి మాటలతో మోడీ చేసింది కేవలం హడలగొట్టే ప్రయత్నం మాత్రమే. పన్ను రాయితీలతో కార్పొరేట్లను తెగ మోసిన మోడీ ప్రభుత్వం వారి బాకీలను కూడా అన్ని రకాలుగా రద్దు చేసింది. అలాంటి సర్కారుకు కుబేరులపై పన్ను పెంచడమనే ఆలోచనే మింగుడు పడటం లేదు. అది అర్బన్ నక్సల్ ఆలోచన అని మోడీ అభివర్ణించారు. కనుకనే వారసత్వ పన్ను గురించి మాట్లాడగానే వారు విషపూరిత మైన దాడికి దిగారు. ఆ ప్రతిపాదనకు పచ్చి మతోన్మాదరంగు పులిమారు. మోడీ రాజ్యపు మతతత్వ కార్పొరేట్ లక్షణాలకు అనుగుణంగానే ఇలా చేశారన్నమాట.

సంపదల పునఃపంపిణీ విధానాలకు సంబంధించి కాంగ్రెస్ ఆత్మ రక్షణలో పడిపోయింది. అలా కావలసిన అవసరమేమీ లేదు. తన ప్రణాళికలో అది పొందుపరచిన ఆర్థిక సామాజిక న్యాయం సాధించాలంటే ఆర్థిక అసమానతలు తగ్గించే సామాజిక సమతకు దారి చూపే కొన్ని చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో సీపీఐ(ఎం) తన వైఖరి స్పష్టంగా ప్రకటించింది. మహా కుబేరులపై తన ప్రణాళికలో సీపీఐ(ఎం) సంపద పన్ను, వారసత్వ పన్ను వేయాలని ప్రతిపాదించింది. కార్పొరేట్ లాభాలపై పన్ను పెంచాలని చెప్పింది. మహా సంపన్నులు బడా కార్పొరేట్ల కోసమే పని చేస్తున్న మోడీ రాజ్‌కు స్వస్తి పలకాలంటే ఈ చర్యలు తప్పనిసరి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

తిరుపతిలో గాల్లోకి కాల్పులు

పల్నాడులో రబ్బరు బుల్లెట్ల ప్రయోగం



అమరావతి : పోలింగ్ సందర్భంగా రాష్ట్రంలో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం బ్రాహ్మణపల్లి కాలనీలో సిఆర్‌పిఎఫ్ పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. పల్నాడు జిల్లా నర్సరావుపేట లో పోలీసులు లాఠీఛార్జి చేసి రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. ప్రకాశం జిల్లా పుల్లలచెరువులో కూడా అల్లరిమూకలను చెదరగొట్టడానికి పోలీసులు రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. అయితే, ఎటువంటి ప్రాణనష్టమూ లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం బ్రాహ్మణపల్లి కాలనీలో ఘర్షణ పడిన టిడిపి, వైసిపి కార్యకర్తలను అదుపు చేయడానికి ఎన్నికల బందోబస్తులో ఉన్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు గాలిలోకి కాల్పులు జరిగారు. రావిళ్లవారిపల్లి, బ్రాహ్మణ కాలనీ దళితవాడ వారిని ఓట్లేయనీకుండా టిడిపి వారు అడ్డుకున్నారనేది వైసిపి వారి ఆరోపణ. ఈ నేపథ్యంలో ఇరు గ్రూపుల వారు ఒకరిపై ఒకరు రాళ్ల రువ్వుకున్నారు. దీంతో సిఆర్‌పిఎఫ్ పోలీసులు జోక్యం చేసుకున్నారు. అదే జిల్లా సదుం, సోమల గ్రామాల్లో తమ ఏజెంట్లు ఐదుగురిని వైసిపి నాయకులు కిడ్నాప్ చేశారంటూ ఎస్‌ఐకు టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందన లేకపోవడంతో జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏజెంట్లను అధికారులు వారిని వెతికి బూత్‌ల వద్దకు తీసుకొచ్చారు. ఈ వ్యవహారంలో ఎస్‌ఐ షేక్షావలిని ఇసి సస్పెండ్ చేసింది.పల్నాడు జిల్లా నర్సరావుపేటలో టిడిపి, వైసిపి మధ్య పరస్పర దాడులు జరిగాయి. పలు పోలింగ్ బూత్‌ల్లో ఏజెంట్ల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దాడులను నివారించేందుకు నర్సరావుపేటలో పోలీసులు లాఠీఛార్జి చేసి రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారు. ఈ ఘటన నేపథ్యంలో నర్సరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గృహనిర్బంధంలో ఉంచాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు వైసిపి, టిడిపి గ్రూపులు రాళ్ల రువ్వుకోవడంతో వైసిపికి చెందిన కిలారి కృష్ణతోపాటు మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు ఇరు గ్రూపులనూ చెదరగొట్టే క్రమంలో పోలింగ్ కేంద్రంలోనే రెండు రౌండ్లు కిందకు కాల్పులు జరిపారు. బుల్లెట్ల ధాటికి కింద పెచ్చులూడి టిడిపికి చెందిన బండారు కృష్ణయ్యతోపాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి.. తెనాలిలో ఓటరుపై దాడి చేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. మాచర్లలో జరిగిన ఘర్షణలకు సంబంధించి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, ఆయన సోదరుడిని, టిడిపి అభ్యర్థి బ్రహ్మారెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దాచేపల్లి మండలం తంగెడ, కేశానుపల్లి గ్రామాల్లో భారీగా ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మాచర్లలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. టిడిపి నాయకుడు కేశవరెడ్డి ఇంటిపై వైసిపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఆయన ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో ఇంట్లోని సామగ్రి, వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడిలో పరుగులు పెడుతున్న టిడిపి కార్యకర్తలపై వైసిపి కార్యకర్తలు కార్లతో వెంటపడితొక్కించే ప్రయత్నం చేయడంతో ఇరువురు టిడిపి కార్యకర్తలకు కాళ్లు విరిగిపోయాయి. రెంటచింతల మండలం రెంటాలలో వైసిపి వారు పోలింగ్ కేంద్రాలను ఆక్రమిస్తున్నారనే ఆరోపణ నేపథ్యంలో టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అక్కడికి వెళ్లగా ఆయన వాహనాలపై వైసిపి వారు రాళ్లతో దాడులు చేశారు. పోలీసుల జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. బ్రహ్మారెడ్డి అదే గ్రామంలో పోలింగ్ పరిశీలనకు వెళ్లగా మరోసారి ఆయన వాహనాలను వైసిపి వారు ధ్వంసం చేసి వాటికి నిప్పంటించడంతో అవి పూర్తిగా దగ్ధమైంది. రెంటచింతల మండలం పాల్వాయ్ గేటు వద్ద ఎమ్మెల్యేపైనా, ఆయన అనుచరులపైనా రాళ్ల దాడి జరిగింది. కెపి గూడెంలో వైసిపి వారి దాడిలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు యరమల రామచంద్రారెడ్డి తలకు, చేతికి గాయాలయ్యాయి. వెల్దుర్తి మండలంలో వైసిపి, టిడిపి వారి మధ్య ఘర్షణలో పోలీసులు, సెక్టార్ అధికారి గాయపడ్డారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలో నాటు బాంబులు విసురుకున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఓంశాంతినగర్, ట్రైలర్స్ కాలనీలో మాజీ ఎమ్మెల్యేలు జెసి.ప్రభాకర్‌రెడ్డి, వైసిపి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలు ఒకేసారి చేరుకోవడంతో ఇరుగ్రూపులు పరస్పరం రాళ్ల రువ్వుకున్నాయి. ఈ దాడుల్లో పెద్దారెడ్డి కారు ధ్వంసమైంది. ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్ల గాయపడ్డారు. ఎస్‌పి అమిత్‌బర్దర్ తాడిపత్రికి వచ్చి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఎస్‌పి వాహనంపై కూడా రాళు రువ్వారు. దీంతో, ఆయన కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామంలో టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో పోలీసులు స్వల్ప లాఠీఛార్జి చేసి పరిస్థితిని చక్కదిద్దారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య ఘర్షణను అదుపు చేయడానికి ఎస్‌ఐ గోపీనాథ్ వారిపై లాఠీఛార్జి చేశారు. ఆ సమయంలో ఇంటి బయట కూర్చుని ఉన్న వృద్ధురాలు ఎస్‌కె జులేఖాబికి లాఠీ తగలడంతో ఆమె తలపై బలమైన గాయమైంది. అన్నమయ్య జిల్లాలో రైల్వే కోడూరు నియోజకవర్గంలోని దలవాయిలో జనసేన ఏజెంట్ రాజారెడ్డిని వైసిపి నాయకులు కిడ్నాప్ చేయడంతో పోలింగ్ ఆగిపోయింది. ఈ క్రమంలో ఇవిఎంలను ధ్వంసం చేశారు. ఇక్కడ 11 గంటలకు తిరిగి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం కొండూరు పోలింగ్ బూత్ వద్ద మాజీ ఎమ్మెల్సీ బత్యాల కారుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడిలో ఆయన కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. వైఎస్‌ఆర్ జిల్లా మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలంలోని చిన్నగులవలూరులో వైసిపి నాయకుల దాడిలో టిడిపి ఏజెంట్లు ఉగ్ర నరసింహ, వినోద్‌లను తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం బేతంచర్లలో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి పిఎస్ బాబుపై ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన అనుచరుల దాడిలో బాబు కారు ధ్వంసమైంది. దీనిపై బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

నలుగురు మృత్యువాత

వడదెబ్బతో ముగ్గురు, గుండెపోటుతో ఒకరు మొత్తం నలుగురు మృత్యువాత పడ్డాడు. ఓటు వేయడానికి వచ్చి క్యూలో ఉన్న ఇద్దరు, ఓటు వేశాక ఇంటికి వెళ్లాక ఒకరు మృతి చెందారు. వారిలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి గ్రామానికి చెందిన పాలూరి పెంటమ్మ (65), పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురానికి చెందిన హిక్రా బిడ్డిక రాజారావు (55) ఉన్నారు. వీరు క్యూలైనులోనే ప్రాణాలు విడిచారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన మండ్ల నరసింహుడు (70) ఓటు వేసి ఇంటికి వెళ్లాక మృతి చెందారు. గుండెపోటులో మరణించిన వారిలో భీమవరం మండలం యనమదుర్రు గ్రామపంచాయతీ దేగాపురం ప్రాంతానికి చెందిన పిల్లి సువర్ణరాజు (70) ఉన్నారు.

ఏపీలో భారీగా పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

పోలింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. 80 శాతం దాటుతుందని అంచనా వేస్తున్నారు. కచ్చితమైన సమాచారాన్ని మంగళవారం వెల్లడిస్తామని ఏపీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. ఓటర్లను ప్రలోభ పెట్టారన్న ఫిర్యాదులు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సోమవారం నాడుకూడా వినిపించాయి. పోలింగ్ కేంద్రాల వద్ద కూడా ఈ విషయం చర్చనీయాంశమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తాజా ఎన్నికల్లో పెద్ద ఎత్తున నగదు పంపిణీ జరిగిన సంగతి తెలిసిందే. అధికార వైసీపీతోపాటు, ఎన్‌డీఏ కూటమిలోని టీడీపీ,జనసేన, బీజేపీలు భారీగా నగదు పందారంచేశాయి.

బారులు తీరిన మహిళలు..వృద్ధులు

సోమవారం ఉదయం 6.30 గంటల నుండే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి కనిపించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు ఓటువేయడానికి తరలివచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల కనిపించిన ఈ దృశ్యాలు చర్చనీయాంశమైనాయి. యువత కూడా ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. మహిళలు, వృద్ధులు, యువత ఈ స్థాయిలో కదలడం ఎవరికి లాభిస్తుందన్న అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ 9 గంటలకు 9.05శాతం నమోదమయింది. 11 గంటలకు 23.10శాతం, మధ్యాహ్నం 1 గంటకు 40.26శాతం, 3కు 55.49శాతం, 5 గంటలకు 68.04శాతం చొప్పున నమోదయింది.

గతంలో ఇలా

2014 సార్వత్రిక ఎన్నికల్లో 78.41శాతం ఓటింగ్ నమోదు కాగా, 2019 ఎన్నికల్లో 79.84శాతం ఓటింగ్ నమోదైంది. 2019లో సాయంత్రం 5గంటలకు 61.16శాతం పోలింగ్‌శాతం నమోదవ్వగా ఈ సారి 68.04శాతం నమోదయింది. దీంతో ఈ సారి పోలింగ్ 80శాతం మించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు

రాష్ట్రంలో ఎక్కడా రీ పోలింగ్ అవసరం లేదన్న అభిప్రాయం ఎన్నికల వర్గాల్లో వ్యక్తమవుతోంది. మీడియాతో మాట్లాడిన సీఈఓ కూడా ఇదే విషయం చెప్పారు. అయితే, పొద్దుపోయేంత వరకు పోలింగ్ జరుగుతుండటంతో మంగళవారం ఈ విషయమై అధికారికంగా ప్రకటన చేయనున్నారు. ఇవిఎంలను రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టి సీల్ చేస్తారు. సీఏపీఎఫ్ బలగాలకు స్ట్రాంగ్ రూమ్ బాధ్యతల భద్రతను అప్పగించారు. నిరంతరం సిసి కెమెరాల నిఘాతో పటిష్టమైన భద్రతను కల్పించడంతో పాటు, ఏజెంట్లకు కూడా ఈ రూమ్‌ల వద్ద ఉండవచ్చునని ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

సమస్యలపై ఓటర్ల నిరసన

- పోలింగ్‌ను బహిష్కరించిన పలు గ్రామాల ప్రజలు
- చివరికి అధికారుల హామీతో విరమణ
- మైలారంలో ఓటేసిన ఆరుగురు
- మైనింగ్ తవ్వకాలను నిరసిస్తూ గ్రామస్తుల ఎన్నికల బహిష్కరణ

నవతెలంగాణ -బల్మూరు/ఇల్లందు/ఏన్కూర్

సమస్యలపై ఓటర్లు ఎక్కుపెట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని, తాము పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకోవాలని ఎన్నోసార్లు విన్నవించుకున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన పలు గ్రామాల ప్రజలు సోమవారం పోలింగ్‌ను బహిష్కరించారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడం లేదని ఓటింగ్ స్లిప్పులతో నిరసన తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు నచ్చచెప్పినా ససేమిరా అంగీకరించలేదు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో కొన్ని గ్రామాల ప్రజలు విరమించారు. మరికొన్నిచోట్ల ఆందోళనను విరమించినా కొంతమంది ఓటేసేందుకు ససేమిరా అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని మైలారం గ్రామంలోని 179 పోలింగ్ కేంద్రంలో ఆరుగురు ఓటర్లు మాత్రమే ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలను నిరసిస్తూ గత కొన్ని రోజులుగా ఎన్నికలను బహిష్కరిస్తామంటూ గ్రామస్తులు ఏకగ్రీవంగా పట్టుబట్టారు. అధికారులు నచ్చ చెప్పినప్పటికీ ఓటింగ్ రోజు ఎవరూ ఓటింగ్‌లో పాల్గొనకుండా ఇండ్లల్లోనే ఉండిపోయారు. 785 ఓటర్లకు గాను ఆరుగురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని పీఠ ఆంజనేయులు తెలిపారు. ఓటింగ్ ప్రారంభంలోనే ఆర్డీవో మాధవి డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు అక్కడికి వచ్చి గ్రామస్తులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరినప్పటికీ ఓటింగ్‌లో పాల్గొనలేదు. సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో ముగ్గురు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోగా.. ఐదు గంటల సమయంలో మరో ముగ్గురు వచ్చి ఓటు వేశారు. కొత్తూరు మండలంలోని కొడిచర్ల తండా గ్రామపంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, సరైన సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఓటు వేసే ప్రసక్తే లేదని ఆందోళన చేశారు. అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పడంతో ఓటు వేశారు.

సీసీ రోడ్లు.. డ్రయినేజీ లేదని ఓటింగ్ బహిష్కరణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలోని లచ్చగూడెం బూత్ నెంబర్ 51, బూత్ నెంబర్ 52, కొమ్ముగూడెం గ్రామాల ప్రజలు ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రయినేజీలు, తాగు, సాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై గ్రామస్తులంతా చర్చించుకుని పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్‌ను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య గ్రామాలకు వెళ్లినచ్చ చెప్పారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కాశయ్య, తహసీల్దార్ రవికుమార్, సీఐ కరుణాకర్ గ్రామస్తులను కలుసుకొని సమస్యలపై చర్చించారు. గ్రామస్తులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు తప్పకుండా పరిష్కారం అవుతాయని ఓట్లు వేయకుండా బహిష్కరించడం సరికాదని అధికారులు నచ్చచెప్పారు. ఓటింగ్‌లో పాల్గొనాలని చేసిన విజ్ఞప్తితో గ్రామస్తులంతా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ఎన్‌ఎస్పీ కాలువపై వంతెన నిర్మించలేదంటూ..

ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రాయమాదారంలో గ్రామస్తులు పోలింగ్ బహిష్కరించారు. ఎన్‌ఎస్పీ కాలువపై వంతెన నిర్మించలేదంటూ పోలింగ్ బహిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఎన్నో ఏండ్లుగా తాము వంతెన కోసం ఆందోళన చేస్తున్నామని అయినా ఎవరూ తమ గోడు పట్టించుకోవడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి వచ్చి ఓటర్లకు నచ్చజెప్పడంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్ పూర్ పంచాయతీ బోరిగాంకు రహదారి సౌకర్యంలేదని ఎన్నికలను బహిష్కరించిన ఓటర్లు... నాయకులు, అధికారుల హామీతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. కడెం మండలం అల్లంపల్లి, బజార్‌హత్నూర్ మండలం మాన్కా పూర్, దేగామ, ఇచ్చోడ మండలం బాబ్జిపేట, కాసిపేట మండలం వరిపేటలో గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించగా.. అధికారులు, ప్రజాప్రతినిధుల జోక్యంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తడిసిన ధాన్యం బస్తాలతో పోలింగ్‌కు..

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం కనుముక్కలలో గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. తడిసిన ధాన్యం బస్తాలతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన రైతులు ధర్నాకు దిగారు. ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ ఇస్తేనే ఓటు వేస్తామని పోలింగ్ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలింగ్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రైతులకు అధికారులు నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు.

ఓటర్లపై తేనెటీగల దాడి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని జెబిఎస్ ఉన్నత పాఠశాలలో 95, 98, 115 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పాఠశాలలో పురాతన మర్రిచెట్లకు తేనెటీగల తుట్టెలు ఉన్నాయి. ఓటర్లు పోలింగ్ బూత్‌లోకి వస్తుండగా ఓటర్లపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఒక వృద్ధుడి కనురెప్పపై తీవ్రంగా కుట్టాయి. మరో ఐదుగురిని కూడా తేనెటీగలు కుట్టడంతో విపరీతంగా దద్దులు వచ్చాయి. పత్రికా విలేఖరి సలీం న్యూస్ కవరేజీ కోసం వెళ్లగా ఆయనను కందిరీగలు కుట్టాయి. విషయం తెలుసుకున్న రిటర్నింగ్ అధికారి కాశయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించారు. పోలింగ్ బూతులకు వెళ్లే దారిలో తేనెటీగల తుట్టెలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని ఓటర్లు చెప్పారు. తేనెటీగలు కుట్టడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.



జనన నమోదుకు ముందే మరణ ధ్రువీకరణ పత్రాలు

గాజాలో ప్రతి 10 నిమిషాలకు ఒక బిడ్డ మృతి

రఫా: గాజాలో నేడు ఎటు చూసినా బాంబు దాడుల్లో చనిపోయిన తల్లుల సమాధులు, ఆ పక్కనే నవజాత శిశువుల సమాధులు వెలుస్తున్న హృదయవిదారక దృశ్యాలే. ఎవరిని కదిపినా కన్నీటి గాథలే. గాజాలో ఇజ్రాయిల్ ఇటీవల జరిపిన వైమానిక దాడిలో ఓ కుటుంబం యావత్తూ చనిపోయారు. మరణించిన తల్లి గర్భం నుండి నెలలు నిండకుండానే డెలివరీ అయిన పసికందు సబ్రీన్ ఉదంతం ఇజ్రాయిల్ అమానుషత్వానికి తిరుగులేని తార్కాణం. ఆ పసికందు తల్లి పాలకు నోచుకునే అవకాశం లేదు. బయటి పాలుపడదామంటే గాజాకు పాలు, నీరు, ఆహారం, మందుల సరఫరాను ఇజ్రాయిల్ పూర్తిగా అడ్డుకోవడంతో ఆ అవకాశమూ లేకపోయింది. దీంతో ఆ నవజాత శిశువు కొద్ది రోజులకే కన్నుమూసింది. ఆ శిశువు మృతదేహాన్ని తల్లి పక్కనే ఖననం చేశారు. గాజాలో మానవ హక్కులను ఇజ్రాయిల్ ఎంతగా కాలరాస్తున్నదో తెలుసుకోడానికి ఈ ఉదంతం ఒక మచ్చుతునక మాత్రమే. ఆసుపత్రులపై ఇజ్రాయిల్ హింసాత్మక దాడులకు తెగబడుతుండడం వల్ల ప్రసూతి వార్డులు పూర్తిగా నేలమట్టమయ్యాయి. దుర్భరమైన పరిస్థితుల్లో కాన్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల మాతా, శిశు మరణాలు అసాధారణమైన రీతిలో పెరిగిపోయాయి.. అక్టోబర్ 7 నుండి ఇప్పటివరకు గాజాలో దాదాపు 20 లక్షల మంది పాలస్తీనియన్లను ఇళ్ల నుండి ఇజ్రాయిల్ బలవంతంగా తరిమేసినట్లు ఐక్యరాజ్యసమితి నివేదికలే చెబుతున్నాయి. బాంబు దాడుల్లో దాదాపు 62 శాతం ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఒక చోట నుంచి మరో చోటికి పాలస్తీనీయులను జాత్యహంకార నెతన్యాహు ప్రభుత్వం తరిమేస్తుండడంతో ఎలాంటి వసతులు లేని తాత్కాలిక గుడారాల్లో జీవనం సాగిస్తున్నారు. ప్రతి పది నిమిషాలకు ఒక బిడ్డ చనిపోతున్నారు. కొంతమంది నవజాత శిశువులు వారి జననాలను నమోదు చేయకముందే మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసే దౌర్భాగ్యకర పరిస్థితి నేడు అక్కడ నెలకొంది.

నాల్గో విడత పోలింగ్ 67శాతానికి పైనే..



నాలుగు విడతల్లో పోలింగ్ తీరు

దశల వారీగా	2019	2024
1	69.96	66.14
2	70.09	66.71
3	66.89	65.68
4	69.12	67.25

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన నాల్గవ విడత పోలింగ్‌లో 67శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 75.91శాతం పోలింగ్ నమోదు కాగా, తర్వాత స్థానంలో మధ్య ప్రదేశ్ (68.48) వుంది. జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్రలు వరుసగా 36.58శాతం, 52.63శాతాలతో వెనుకబడ్డాయి. ఇక ఇతర రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 68.12, బీహార్‌లో 55.90, జార్ఖండ్‌లో 63.37, ఒరిస్సాలో 63.85, తెలంగాణాలో 61.29, ఉత్తరప్రదేశ్‌లో 57.76శాతం పోలింగ్‌లు నమోదయ్యాయి. ఇది తాత్కాలికమైన డేటానే అయినా మొత్తమ్మీద పోలింగ్ శాతం ఇంకా పెరిగే అవకాశాలు వున్నాయి. మొత్తమ్మీద పోలింగ్ ప్రశాంతంగానే సాగినా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో అక్కడక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పశ్చిమ బెంగాల్, ఒరిస్సాల్లో కొన్ని బూత్‌ల్లో ఇవిఎంలు పనిచేయలేదని వార్తలు కూడా అందాయి. పరుష పదజాలంతో కూడిన ప్రచార హోరు పెరుగుతుండడం, తక్కువ పోలింగ్ నమోదవుతుందనే ఆందోళనల మధ్య శ్రీనగర్‌లో ఓటింగ్ జరిగింది. కాశ్మీర్ ప్రాంతంలో ముస్లిం మెజారిటీకి చెందిన శ్రీనగర్ లోక్‌సభ సీటుకు లేదా రెండు ఇతర పార్లమెంటరీ నియోజకవర్గాల్లో పాలక బీజేపీ పోటీ చేయడం లేదు. జమ్మూలో నిర్వాసితులైన అనేకమంది కాశ్మీరీ పండిట్ల పేర్లు ఓటర్ల జాబితాలో గల్లంతవడంతో వారు తమ ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. ఇప్పటివరకు జరిగిన మూడు దశల ఎన్నికల్లో వరుసగా 66.14శాతం, 66.71శాతం, 65.68శాతం నమోదయ్యాయి. నాల్గవ దశలో మొత్తంగా 1717 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 17.70కోట్ల మంది అర్హులైన ఓటర్లు వుండగా, వారిలో 8.73కోట్ల మంది మహిళలే. తెలంగాణాలో 17, ఆంధ్రప్రదేశ్‌లోని 25, యూపీలో 13, బీహార్‌లో ఐదు, జార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఒడిశాలో 4, పశ్చిమ బెంగాల్‌లో 8, జమ్మూ కాశ్మీర్‌లో ఒక స్థానానికి ఓటింగ్ జరిగింది. ఇప్పటివరకు నాలుగు దశల్లో 379 సీట్లకు పోలింగ్ ముగిసింది. ఇక మే 20, మే 25, జూన్ 1 తేదీల్లో మరో మూడు దశల్లో పోలింగ్ జరగాల్సి వుంది. జూన్ 4 ఓట్ల లెక్కింపు జరగనుంది.

నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- 27న పోలింగ్, జూన్ 5న ఓట్ల లెక్కింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. ఈ స్థానానికి సంబంధించి ఈనెల 27న పోలింగ్, జూన్ 5న ఓట్ల లెక్కింపు జరుగనుంది. 12 జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ నియోజక వర్గంలో 4,61,806 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. ఇక్కడినుంచి గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్నారు.

ఐదో దశలో అతివలు అంతంతే..

- మహిళా అభ్యర్థులు 12 శాతం మందే
- మొత్తం 695 మందిలో వారు 82 మంది : ఏడీఆర్



న్యూఢిల్లీ : ఈనెల 20న జరిగే ఐదో దశలో మొత్తం 695 మంది అభ్యర్థుల్లో 82 మంది మాత్రమే మహిళలు ఉన్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం.. ప్రకారం ఐదో దశలో బరిలోకి దిగిన అభ్యర్థుల్లో కేవలం 12 శాతం మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా కొనసాగుతున్నది. దాదాపు 23 శాతం మంది తమపై క్రిమినల్ కేసులను ప్రకటించుకున్నారనీ, 18 శాతం మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మొదటి దశ ఎన్నికలలో 135 (8 శాతం మంది) మహిళా అభ్యర్థులు పోటీ చేయగా, రెండో దశలో 100 (8 శాతం) మహిళా అభ్యర్థులు పోటీ చేశారు. అదేవిధంగా, మూడో దశ ఎన్నికలలో 123 (9 శాతం) మహిళా అభ్యర్థులు పోటీ చేయగా, నాలుగో దశలో 170 (10 శాతం) మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

ఐదో దశలో పరిశీలనలో ఉన్న 695 మంది అభ్యర్థులలో.. 18 శాతం మంది(122 మంది అభ్యర్థులు)పై హత్య, హత్యాయత్నం, మహిళలపై నేరాలు, ద్వేషపూరిత ప్రసంగాలతో సహా తీవ్రమైన క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పార్టీల వారీగా క్రిమినల్ కేసులను చూస్తే.. ప్రధాన పార్టీలలో ఏఐఎంఐఎం నుంచి నలుగురు అభ్యర్థులలో ఇద్దరు (50 శాతం), ఎస్పీ నుంచి 10 మంది అభ్యర్థులలో నలుగురు (40 శాతం), కాంగ్రెస్ నుంచి 18 మంది అభ్యర్థులలో ఏడుగురు (39 శాతం), శివసేన నుంచి ఆరుగురిలో ఇద్దరు (33 శాతం), బీజేపీ నుంచి నుంచి 40 మంది అభ్యర్థులలో 12 మంది (30 శాతం), తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నుంచి ఏడుగురిలో ఇద్దరు (29 శాతం), ఆర్జేడీ నుంచి నలుగురిలో ఒకరు (25 శాతం), శివసేన (యూబీటీ) నుంచి ఎనిమిది మందిలో ఒకరు (13 శాతం) తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు కలిగి ఉన్నారు. 29 మంది అభ్యర్థులు మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ప్రకటించారు. 29 మంది అభ్యర్థుల్లో ఒకరు లైంగికదాడికి సంబంధించిన అభియోగాలు (ఐపీసీ సెక్షన్ 376), 10 మంది తమపై ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించిన కేసులను వెల్లడించారు.

ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తి రూ.3.56 కోట్లు

33 శాతం మంది అభ్యర్థులు 'కోటీశ్వరులు' (రూ. 1 కోటి కంటే ఎక్కువ ఆస్తులు కలిగిన వారు)గా ఉన్నారు. ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తి రూ.3.56 కోట్లుగా ఉన్నది. 47 శాతం మంది అభ్యర్థులు తమ అప్పులను ప్రకటించారు. కొంతమందికి పదుల కోట్ల రూపాయల వరకు అధిక రుణ భారం ఉండటం గమనార్హం. అయితే, అభ్యర్థుల విద్యార్హతలు ఆందోళన కలిగిస్తున్నాయి. 42 శాతం మంది 5 నుంచి 12వ తరగతి మధ్య విద్యార్హతలు కలిగి ఉన్నారు. కేవలం 50 శాతం మంది గ్రాడ్యుయేట్లు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్నారు. 26 మంది అభ్యర్థులు డిప్లొమా హెూల్డర్లు, 20 మంది కేవలం అక్షరాస్యులు, ఐదుగురు నిరక్షరాస్యులు కావటం గమనార్హం.

ముంబయిలో పెను గాలుల బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)



వీచాయి. థానే, అంబర్‌నాథ్, బద్లాపూర్, కళ్యాణ్ మరియు ఉల్హాస్‌నగర్‌లలో కూడా ఈదురు గాలులతో మోస్తరు వర్షాలు పడ్డాయి. హోర్డింగ్ కుప్పకూలిన ఘటనలో గాయపడిన అనేక మందిని ఆసుపత్రులకు తరలించి వైద్యసేవలందించినట్లు బృహన్ ముంబై అధికారులు తెలిపారు. మెట్రో, లోకల్ రైలు సేవలకు అంతరాయం కలిగింది. థానే, పాల్ఘర్, ముంబైలలో మెరుపులతో కూడిన ఉరుములు, మోస్తరు నుంచి తీవ్రమైన వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తూ భారత వాతావరణ విభాగం (ఐఎండి) "నౌకాస్ట్ హెచ్చరిక" జారీ చేసింది. ముంబైలోని శ్రీ జీ టవర్, వడాలా (తూర్పు) సమీపంలో సాయంత్రం 4:22 గంటలకు బర్కత్ అలీ నాకాలోని ఒక మెటల్ స్టీల్ పార్కింగ్ కూలిపోయింది. శ్రీ జీ టవర్ దగ్గర ఉన్న మెటల్ స్టీల్ పార్కింగ్ మొత్తం కూలిపోయిందని, ఆ సమయంలో సమీపంలో ఉన్న దాదాపు 10 వాహనాలు సమీపంలోని రోడ్డు పక్కన నిలిపివేశారని అధికారులు తెలిపారు. ఒక వ్యక్తి కారులో చిక్కుకున్నాడని, అతనిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఈదురు గాలులతో అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాల కారణంగా మెయిన్‌లైన్, హార్బర్‌లైన్ సబర్బన్ సర్వీసులు నిర్ణీత సమయానికి ఆలస్యంగా నడుస్తున్నాయి. బలమైన గాలుల కారణంగా థానే, ములుండ్ స్టేషన్‌ల మధ్య ఉన్న ఓవర్‌హెడ్ పరికరాల స్తంభం వంగిపోవడంతో సెంట్రల్ రైల్వేలోని సబర్బన్ సర్వీసులు నిలిపివేసినట్లు సంబంధిత అధికారి తెలిపారు.థానే జిల్లాలోని కాల్వా, మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నగరంలో ప్రతికూల వాతావరణం కారణంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దాదాపు 66 నిమిషాల పాటు విమాన కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసింది. 15 విమాన సర్వీసులను మళ్లించింది.

ఉదయం ఎండ..సాయంత్రం ఓటరు క్యూ

- 17 పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 4 గంటలకే ముగింపు
- మొరాయించిన ఈవీఎంలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- పలు చోట్ల బీజేపీ నేతల అత్యుత్సాహం
- మహిళల కోసం ప్రత్యేక కేంద్రాలు
- సెల్ఫీ తీసుకునేందుకు పోలింగ్ కేంద్రాల అలంకరణ





నవతెలంగాణ-విలేకరులు

రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ కూడా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు వరకు కొనసాగింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. సాయంత్రం పూట ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఉదయం 7 గంటల నుంచే జనం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాలేదు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీజేపీ అభ్యర్థులు, శ్రేణులు ఘర్షణలు సృష్టించే ప్రయత్నాలు చేశారు. పలు గ్రామాల్లో తమ స్థానిక సమస్యలను పరిష్కరించడం లేదని గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. అధికారుల చర్చలతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో సాంకేతిక లోపాలతో ఈవీఎంలు మొరాయించగా, అధికారులు సరిచేయడంతో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. అంతేకాదు, ఈ సారి పలు చోట్ల మహిళలకు ప్రత్యేక క్యూ లైన్లు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఓటేసిన అనంతరం సెల్ఫీలు తీసుకోవడానికి వీలుగా పోలింగ్ కేంద్రాలను వైవిధ్యభరితంగా ముగ్గులు, పూలతో అలంకరించారు.

హైదరాబాద్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ ఎంపీ స్థానాలతో పాటు, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. షేక్‌పేట్‌లో ఓట్లు గల్లంతయ్యాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగింది. ఓటు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. గంట గంటకూ పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని నాదర్‌గూల్‌లో మహిళా పోలింగ్ కేంద్రానికి ఏర్పాట్లు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గచ్చిబౌలిలోనూ మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ త్రిముఖ పోటీ జరగడంతో పోటీపడి ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించారు. ఒకటి రెండు చోట్ల చెదురుమదురు సంఘటనలు జరిగాయి. నారాయణఖేడ్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య తోపులాట జరిగింది. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. జనగామలోని ధర్మకంచలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధంతో ఉద్రిక్తత చోటు చేసుకోగా, పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది.

పోలింగ్ ప్రశాంతంగా జరగడం.. కొన్ని చోట్ల భారీగా పోలింగ్ శాతం నమోదు కావడంతో ప్రధాన పార్టీలు ఎవరికీ వారే అనుకూలంగా లెక్కలు వేసుకుంటున్నారు. అయితే, హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్లలో ఓటింగ్ శాతం తక్కువ రావడంతో పార్టీల నాయకులు ఢీలాపడ్డారు. ప్రచారంలో చెప్పుకున్న విధంగా గెలుస్తామనే ధీమాను వ్యక్తం చేయలేకపోతున్నారు. అయితే క్రాస్ ఓటింగ్ జరిగినట్టు ప్రారంభంలో ప్రచారం జరిగింది. క్రాస్ అయితే ఓట్లు ఎవరికి పడ్డాయనేది చర్చనీయాంశంగా మారింది.

100 శాతం ఓటింగ్‌తో ఆదర్శంగా సంగాయిపేట

మెదక్ జిల్లాలోని సంగాయిపేట తండాలోని ఓటర్లంతా ఓటేసి ఆదర్శంగా నిలిచారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కొల్చారం మండలం సంగాయి పేట తండాలో మొత్తం 210 ఓట్లు ఉన్నాయి. అందులో 95మంది పురుషులు, 115 మంది మహిళలు ఉన్నారు. వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకొని 100శాతం పోలింగ్‌ను నమోదుచేశారు. దీంతో ఆ తండా ప్రజలను జిల్లా కలెక్టర్ అభినందించారు.

ఈవీఎంల మొరాయింపు..

యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని 32వ పోలింగ్ కేంద్రంలో 40 నిమిషాలు ఈవీఎంలు మొరాయించాయి. వెల్లంకి గ్రామంలో 9వ పోలింగ్ బూత్ ఈవీఎంలో సాంకేతిక లోపం తలెత్తడంతో గంటల తరబడి ఓటర్లు బారులు తీరారు. ఎన్నారం గ్రామంలో 54, 55 పోలింగ్ బూత్‌లలో అరగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని మంగల్‌తండా గ్రామంలో ఈవీఎం మొరాయించింది.

మహబూబ్‌నగర్ జిల్లాలోని మహ్మదాబాద్ మండల పరిధిలోని గాదిర్యాల్‌లో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం వరకు 110 బూత్‌లు 30 నిమిషాలు మొరాయించాయి. దీంతో పోలింగ్ కేంద్రాల దగ్గర ఓటర్లు బారులు తీరారు. వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్ 228లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల దాకా ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లకు ఇబ్బంది కలిగింది. పోలింగ్ స్టేషన్ ప్రిసైడింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు తక్షణమే టెక్నికల్ ఆఫీసర్‌తో చూయించగా ఈవీఎం బ్యాటరీ లోపం వల్ల ఆగిపోయిందని తెలిపారు.

దొంగిలించిన ఓటు

వికారాబాద్ జిల్లా బంట్వారం మండల కేంద్రానికి చెందిన దొరేటి సుధాకర్ ఓటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బూత్ నంబర్ 253లో సీరియల్ నెంబర్ 198లో ఓటు ఉంది. అతను పోలింగ్ బూత్‌లోకి వెళ్లి చూస్తే తన ఓటు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు. దాంతో ఆయన ఆందోళనకు దిగారు. తాను ప్రభుత్వ ఉద్యోగి కానప్పటికీ తన ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎలా వినియోగించుకున్నారో సమాధానం చెప్పాలని అధికారులను నిలదీశారు. ఎన్నికల అధికారులు కుమ్మక్కై తన ఓటును దొంగిలించారని ఆందోళన వ్యక్తం చేశారు. తనకు ఓటు వేసేందుకు అవకాశం ఇవ్వాలని, లేదంటే ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో వెంటనే అధికారులు స్పందించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అక్కడి అధికారులతో మాట్లాడి ఆ వ్యక్తి ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల ఓవరాక్షన్..

చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో శంకర్‌పల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తన సిబ్బందితో మధ్యాహ్నం 3 గంటలకు పోలింగ్ కేంద్రానికి చేరుకొని హల్‌చల్ చేశారు. ఓటేసేందుకు వెళు తున్న ఓటర్లను చెదరగొడుతూ లాఠీచార్జీ చేశారు. దాంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ప్రజలంతా భయాందోళనతో పరుగులు తీశారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. గ్రామస్తులు ధర్నాకు దిగారు. పోలీసులు గ్రామస్తులకు క్షమాపణ చెప్పడంతో వారంతా శాంతించారు.

కరీంనగర్‌లో బీజేపీ అత్యుత్సాహం

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఫొటోతో కూడిన పోల్ చిట్టీలను రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో కొందరు ఓటర్లకు పంపిణీ చేశారు. కొందరు తెలియక అవే చిట్టీలను తీసుకుని ఓటేసేందుకు పోలింగ్‌బూత్‌కు వెళ్లడంతో అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల నడుమ స్వల్ప వివాదం చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలో బీజేపీ నేత నేతుల మల్లేశం పోలింగ్‌బూత్ వద్ద ప్రచారం చేస్తుండగా.. బీఆర్ఎస్ శ్రేణులు దాడి చేశారు. అతని కాలుపైకి టాటా ఏసీ వాహనం ఎక్కించడంతో మల్లేశంకు గాయాలు కాగా వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇరుగ్రూపులు తోపులాట చేసుకోగా.. పోలీసులు చెదరగొట్టారు. జమ్మికుంట పక్క మండలం వీణవంకలోని చల్లూరు గ్రామంలో బీజేపీ నాయకు లు ఆదిరెడ్డి, ఎల్బాక మాజీ సర్పంచ్ ఓదయ్యల డబ్బులు పంచు తుండగా పోలీసులు పట్టుకుని రూ.25 వేలు సీజ్ చేశారు.

సిరిసిల్లలో మద్యం సీజ్..

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ ఇంట్లో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.25వేల మద్యాన్ని సీజ్ చేశారు. కౌన్సిలర్‌పై కేసు నమోదు చేశారు. ఆయా పార్టీలకు సంబంధించిన నాయకులు, ప్రజాప్రతినిధుల ఇండ్లలో అధికారులు సోదాలు నిర్వహించారు.

సెల్ఫీ తీసుకున్న వ్యక్తిపై కేసు నమోదు..

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములపల్లి గ్రామంలో రెడ్డవేణి జయరాజ్ తన ఓటు హక్కు వినియోగించుకుంటున్న క్రమంలో ఫోన్‌లో సెల్ఫీ తీసుకున్నాడు. గమనించిన అధికారులు ఫోన్ లాక్కుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పుట్టెడు దు:ఖంలోనూ ఓటేసిన కుటుంబం

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో ఇంట్లో తల్లి చనిపోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న ఓ కుటుంబం అంత్యక్రియలు ముగించుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేయడానికి వెళుతూ..
రోడ్డు ప్రమాదం

ముగ్గురు మృతి..మరో ఇద్దరికి తీవ్ర గాయాలు..



నవతెలంగాణ-జనగామ

ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెళ్తూ రోడ్డు మీద టిఫిన్ చేస్తున్న వారిపైకి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండల కేంద్రం సమీపంలో సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, తండ్రి, కుమారుడు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ బీటీనగర్‌లో రోజువారీ కూలీ చేసుకొని బతుకుతున్న వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన తెలకలపల్లి రవీంద్ర (35), తెలకలపల్లి జ్యోతి (32), తెలకలపల్లి భవిష్ (10) ద్విచక్ర వాహనం మీద వరంగల్‌కు వెళ్తూ రఘునాథ్ పల్లి సమీపంలో జాతీయ రహదారి ఆనుకొని ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద ఆగి టిఫిన్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుండి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ గరుడ బస్సు రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి మొబైల్ టిఫిన్ వాహనం మీదకి దూసుకెళ్లింది. దాంతో టిఫిన్ చేస్తున్న కుటుంబంలో జ్యోతి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందారు. క్యాంటీన్ నిర్వాహకులు రఘునాథపల్లి మండలం సోమయ్యకుంట తండా చెందిన నునావత్ శ్రీకాంత్, నునావత్ సంతోష్ తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దూదిమెట్ల నరేష్ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.8 లక్షలకు టోకరా

మోసపోయానని ఆవేదనతో యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-లింగంపేట్

ఉద్యోగం ఇప్పిస్తానని 8 లక్షలు తీసుకొని.. ఇంకా ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, స్థానికుల వివరాల ప్రకారం.. లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి ప్రవీణ్ (28) 2019లో చిట్యాలకు చెందిన ఆరిఫ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో గ్రూప్ 4 స్థాయి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నిజామాబాద్‌కు చెందిన రామకృష్ణారెడ్డి అలియాస్ ఆర్కే రెడ్డి వద్దకు కమ్మరి ప్రవీణ్‌ను తీసుకెళ్లారు. ఉద్యోగం తప్పకుండా ఇస్తామని నమ్మబలికి లక్ష రూపాయలు రామకృష్ణారెడ్డికి, రూ.6 లక్షలు ఆరిఫ్‌కి ఇచ్చేటట్టు ప్రవీణ్ కుమార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందస్తుగా ఆరిఫ్ రూ.2 లక్షలు ప్రవీణ్ వద్ద తీసుకున్నాడు. మరో రూ.5 లక్షలు రామకృష్ణారెడ్డి తీసుకున్నాడు. డబ్బులు తీసుకుని నాలుగేండ్లు అవుతున్నప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో వారి చుట్టూ తిరిగి తిరిగి ప్రవీణ్ అలసిపోయాడు. సరైన సమాధానం చెప్పకుండా ఉద్యోగం ఇస్తామని ఆలస్యమవుతుందని నమ్మబలికారు. అయినప్పటికీ ఉద్యోగం ఇవ్వకపోవడంతో ప్రవీణ్.. ఆరిఫ్, రామకృష్ణారెడ్డిని గట్టిగా నిలదీశారు. దాంతో వారిద్దరూ మరో లక్ష రూపాయలు ఇస్తే ఆర్డర్ కాపీ, అపాయింట్‌మెంట్ లెటర్ ఇస్తామని చెప్పడంతో ప్రవీణ్ మరో లక్ష రూపాయలు తీసుకొచ్చి ఇవ్వగా మెదక్ మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం వచ్చిందని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌ను చేతిలో పెట్టారు. లెటర్ తీసుకొని సదరు బాధితుడు ఇటీవల మెదక్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఉద్యోగం విషయంలో ఎంక్వయిరీ చేయగా అక్కడ నకిలీ అని తేలింది. దీంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీనికి తోడు అప్పులిచ్చిన వారు డబ్బుల కోసం అడుతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దాంతో ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని పోలేరమ్మ ఆలయ సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి సత్యనారాయణ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. తల్లీ కొడుకు ఇద్దరూ కూలి పని చేసుకుంటూ ఇంటి వద్ద ఉంటున్నారు. ప్రవీణ్‌కు గతేడాది వివాహం జరగగా.. విడాకులు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

నిజాయితీ లేని పాలకుల నుంచి దేశాన్ని కాపాడాలి : అఖిలేశ్ యాదవ్

లక్నో : నిజాయితీ లేని పాలకుల నుంచి దేశాని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలు ఓటేయాలని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. యూపీలోని కన్నౌజ్ బరిలో నిలిచిన అఖిలేష్ యాదవ్ నాలుగోదశ పోలింగ్‌లో భాగంగా సోమవారం ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

బాలికలదే పైచేయి

సీబిఎస్ఇ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) 10, 12వ తరగతుల్లో బాలికలు పైచేయి సాధించారు. సోమవారం ఫలితాలు విడుదల చేసిన సిబిఎస్ఇ టాపర్ల జాబితాను విడుదల చేయలేదు. టాప్ 0.1 శాతం మంది విద్యార్థులకు మెరిట్ జాబితాను విడుదల చేయనున్నట్టు బోర్డు తెలిపింది. పదవ తరగతి పరీక్షల్లో 94.75 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే 0.48 శాతం ఎక్కువ ఫలితాలు వచ్చాయి. బాలుర కంటే బాలికలు 2.04 శాతం పాయింట్లతో పైచేయి సాధించారు. 12వ తరగతి బోర్డు పరీక్షల్లో 87.98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత శాతం 91.52. కాగా బాలుర ఉత్తీర్ణత శాతం 85.12 శాతంగా ఉంది. బాలుర కంటే 6.40 శాతం అధికంగా బాలికలు ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది కంటే 0.65 శాతం పెరుగుదల నమోదైంది.

12వ తరగతిలో తిరువనంతపురం టాప్

12వ తరగతి పరీక్షల్లో తిరువనంతపురం 99.91 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో ఉంది. ఆ తరువాత స్థానాల్లో విజయవాడ (99.04), చెన్నై (98.47), బెంగళూరు (96.95) ఉన్నాయి. 77.94 శాతంతో గువహటి అత్యల్పంగా నిలిచింది. సిబిఎస్ఇ 10వ, 12వ ఫలితాలు రెండింటినీ అధికారిక వెబ్‌సైట్‌లు cbseresults.nic.in, results.cbse.nic.in, cbse.gov.in, cbse.nic.in వెబ్ సైట్లలో చెక్ చేసుకోవచ్చని తెలిపింది. డిజిలాకర్ నుండి కూడా ఫలితాలను తనిఖీ చేయవచ్చు. ఈ ఏడాది సిబిఎస్ఇ పదవ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15, మార్చి 13 మధ్య, 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2వ తేదీల మధ్య జరిగాయి. సుమారు 39 లక్షల మంది విద్యార్థులు బోర్డు పరీక్షలకు హాజరయ్యారు.

ఆదర్శం...ఈ వికలాంగుడు

రెండు చేతులు లేకున్నా ఓటు హక్కు వినియోగించుకున్న జాకీర్‌పాషా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అన్ని అవయవాలు సక్రమంగా ఉండీ కూడా ఓటు హక్కు వినియోగించుకోలేని వారు ఎందరో ఉన్నారు. 'నేను ఒక్కన్ని ఓటు వేయకుంటే ఏమవుతుందిలే' అనే భావనలో ఎందరో ఓటర్లుంటారు. కాని ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఉన్న విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలంటాడు కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన వికలాంగుడు జాకీర్‌పాషా. రెండు చేతులు లేని జాకీర్‌పాషా మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయం(బూత్ నెం.81)లో తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. కాళ్లతోనే ఆయన తన ఓటును వేసి ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటి చెప్పాడు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన షేక్‌బాబా-మెహ్రాజ్ బేగం దంపతుల కుమారుడు జాకీర్‌పాషాకు పుట్టుకతోనే రెండు చేతులు లేవు. అయినా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా పీజీ వరకు చదివాడు. ఇప్పటికే ఆయన 2018, 2013 అసెంబ్లీ ఎన్నికలలో, 2019, 2024 లోక్‌సభ ఎన్నికలలో కాళ్లతో ఓటు వేసి పలువురి మన్ననలు అందుకున్నాడు. ప్రస్తుతం ఇతను కాగజ్‌నగర్ మండలం బోరిగాం పంచాయతీ పరిధిలోని చారిగాం రోడ్‌లో నివాసం ఉంటున్నాడు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల వికలాంగులు అందరికంటే ముందుగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉత్సాహంగా ఓటేసిన వృద్ధులు..ట్రాన్స్‌జెండర్స్

ఓటు వేయడానికి కొంతమంది నిరాసక్తత చూపుతుంటారు. తాము వేయకుంటే ఏమవుతుంది..ప్రపంచం ఆగిపోతుందా..అంటూ కబుర్లతో కాలయాపన చేస్తుంటారు. ఎండ, చలి, వర్షం, దూరం, సమయం ఉంది కదా వేద్దాంలే అంటూ ఓటేయ్యకుండా కారణాలు చెబుతుంటారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేంది ఎన్నికలేనని, ఆ రోజు తప్పకుండా ఓటు వేయాలసిందేనని వృద్ధులు ఉత్సాహంగా ఓటేయడం గమనార్హం. వంద సంవత్సరాలు దాటినా లెక్కచేయకుండా ఓటుకు ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 80 సంవత్సరాలు పైబడిన వారంతా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఖమ్మంలోని లక్ష్మి హైమవతి (110) సంవత్సరాలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు కూడా ఓటేసేందుకు క్యూలో నిల్చున్నారు. రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్స్ తమ ఓటు హక్కును ఉపయోగించుకొని ఆదర్శంగా నిలిచారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో పలువురు ట్రాన్స్‌జెండర్స్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మంలో రాజేంద్రనగర్ జెడ్పి హైస్కూల్ లోని పోలింగ్ కేంద్రంలో ట్రాన్సజెండర్లు ఓటేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును విజ్ఞతతో ఆలోచించి వేయాలన్నారు. ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.

సూటు..బూటు సర్కార్

ఇది అదానీ-అంబానీల ప్రభుత్వం | **మోడీ సర్కారుపై వ్యాపారుల అసంతృప్తి**

- వారిద్దరికే కొమ్ము కాస్తోందని ఆరోపణ
- కార్మిక, వ్యాపార వర్గాల్లో పెరుగుతున్న వ్యతిరేకత
- దూరమవుతున్న దిగువ మధ్యతరగతి ప్రజలు

నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గతంలో సూటు బూటు సర్కారుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో అమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఈ రాజకీయ వ్యంగ్యోక్తిని అందిపుచ్చుకున్నారు. రాజధానిలో నివసించే కార్మికులు అత్యధిక సంఖ్యలో అమ్‌ఆద్మీ పార్టీకి మద్దతు తెలపడం వెనుక ఈ వ్యాఖ్య ప్రభావం ఎంతైనా ఉంది. గత శాసనసభ ఎన్నికల్లో ఢిల్లీలోని కార్మిక వర్గం అందించిన మద్దతుతో అమ్‌ఆద్మీ పార్టీ విజయం సాధించింది. 2015 శాసనసభ ఎన్నికల్లో మోడీ, కేజ్రీవాల్ మధ్య జరిగిన ప్రచార పోరులో కూడా కార్మికుల సమస్యలే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. చివరికి వారు కేజ్రీవాల్‌ను హీరోను చేశారు. ఆ ఓటమిని మోడీ ఇంకా మరచిపోలేదు. ఆప్‌పై, కేజ్రీవాల్‌పై విమర్శల దాడి కొనసాగిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆయన్ని అరెస్టు చేయించి, జైలులో పెట్టించారు.





న్యూఢిల్లీ : కేజ్రీవాల్‌కు కొద్ది రోజుల క్రితమే సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. విడుదలైన వెంటనే ఆయన ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. ఈసారి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని బరిలో దిగారు. విద్యార్థి నేత కన్హయ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థిగా పోటీకి నిలిపింది. ఎన్నికల్లో కులమే ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ రాజధానిలో మాత్రం అందుకు భిన్నంగా వర్గ సమీకరణలు అభ్యర్థుల తలరాతలు మారుస్తున్నాయి. సంపన్నులు, ఎగువ మధ్యతరగతి ప్రజలు బీజేపీ వైపు నిలబడగా కార్మికులు, దిగువ మధ్యతరగతి ప్రజలు ఆప్ పక్షాన నిలిచారు.

మోడీకి ప్రజాదరణ తగ్గుతోంది

దేశ రాజకీయాల్లో కుల విధేయతల కంటే ఆర్థిక ప్రయోజనాలు, ప్రజా సమస్యలే కీలక పాత్ర పోషిస్తాయని సెఫాలజిస్ట్‌గా మారిన ఆర్థికవేత్త సుర్జిత్ భల్లా అభిప్రాయపడ్డారు. 1980వ దశకం నుండి ఆయన ఓటింగ్ తీరును విశ్లేషిస్తున్నారు. నిరుద్యోగం, అసమానతలు వంటి సమస్యల కారణంగా మధ్యతరగతి ప్రజలు కష్టాలు అనుభవిస్తున్నారని, ఈ నేపథ్యంలో మోడీకి ప్రజాదరణ తగ్గిపోతోందని విమర్శకులు తెలిపారు.


ఈ ఎన్నికల్లో కులాలు...ముఖ్యంగా వెనుకబడిన తరగతులు, ఎస్సీల మద్దతు కీలక పాత్ర పోషిస్తుందా లేక జీవనోపాధి వంటి వర్గ కారకాలు కీలక పాత్ర పోషిస్తాయా అనేది చూడాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రచారంలో అటు కుల, ఇటు వర్గ సంబంధమైన అంశాలను ప్రస్తావిస్తోంది. అగ్రకులాలు, వారి మద్దతు గురించి పెద్దగా ఆందోళన చెందడం లేదు. బడా వ్యాపారవేత్తలు గౌతమ్ అదానీ, ముకేష్ అంబానీలపై ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను ఈ కోణం నుండే చూడాల్సి ఉంటుంది.

ఎంఎస్ఎంఈల కినుక

మోడీ సహా బీజేపీ నేతలు ఓ వైపు ముస్లిం వ్యతిరేక సెంటిమెంటును రెచ్చగొడుతూ హిందూ ఓట్లను సమీకరించేందుకు ప్రయత్నిస్తూనే మరోవైపు కులం, వర్గం కార్డులు ప్రయోగిస్తూ ద్విముఖ వ్యూహాన్ని తఅమలు చేస్తున్నారు. అందులో భాగంగానే తన వ్యాపార సన్నిహితులకు దూరం జరిగినట్లు ప్రధాని నటిస్తున్నారు. అదానీ, అంబానీలు అక్రమ సంపాదన, నల్లధనాన్ని పోగేసి అందులో కొంత భాగాన్ని కాంగ్రెస్ పార్టీకి అప్పగించారని మోడీ ఇటీవల ఆరోపించారు. మోడీ వ్యాఖ్య వెనుక రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది...ఎన్నికల బాండ్ల పథకం ఆర్థికపరంగా బీజేపీకి లబ్ది చేకూర్చి ఉండవచ్చు కానీ రాజకీయంగా నష్టం కలిగించింది. వ్యాపారవేత్తల నుండి ఇతర పార్టీలకు కూడా విరాళాలు అందాయని చెప్పేందుకు మోడీ ప్రయత్నించారు. ఇక రెండోది...సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు) బీజేపీకి పెద్దగా విధేయత చూపవు. మోడీ ప్రభుత్వం బడా వ్యాపారవేత్తలకే ప్రయోజనం కలిగిస్తోందని, తమను పట్టించుకోవడం లేదని అవి భావిస్తున్నాయి.

వ్యాపార వర్గంలో విభజన

వీటిలో రెండో అంశంతో రాజకీయ విశ్లేషకులు పెద్దగా ఏకీభవించరు. మోడీ, అదానీ మధ్య ఉన్న సంబంధాన్ని సాధారణ ప్రజలు సరిగా అర్థం చేసుకోలేదు. కానీ ఎంఎస్ఎంఈలకు ఆ విషయం బాగా బోధపడింది. పెద్ద నోట్లను రద్దు చేయడం, జీఎస్టీని ప్రవేశపెట్టడం, ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడుల్లో స్తబ్దత ఏర్పడడం వంటి పరిణామాలు ఎంఎస్ఎంఈ రంగాన్ని దెబ్బతీశాయి. మరోవైపు బడా కార్పొరేట్ సంస్థలు, లిస్టెడ్ కంపెనీలు బాగా కూడబెట్టుకుంటున్నాయి. వాటి పనితీరు బాగానే ఉంది. ఈ వైరుధ్యాల కారణంగా వ్యాపార వర్గం అంతర్గతంగా విడిపోయింది.





వారిలోనూ అసంతృప్తి

మోడీ ప్రభుత్వ పనితీరుపై వ్యాపార వర్గాల్లో ఎప్పుడు చర్చ జరిగినా కచ్చితంగా అదానీ ప్రస్తావన వస్తుంది. ఈ విషయంలో వ్యాపారులు కేంద్ర ప్రభుత్వాన్ని...ముఖ్యంగా మోడీ, ఆయన మంత్రులను విమర్శిస్తుంటారు. అదానీ విషయంలో మోడీ సానుకూలంగా వ్యవహరిస్తారని వారి ఆరోపణ. ఢిల్లీలో అదానీ తన పలుకుబడిని ఉపయోగించి ముంబయి విమానాశ్రయం నుండి జీవీకే గ్రూపును ఎలా తప్పించారో హైదరాబాదులో ఉన్న వ్యాపారవేత్తలందరికీ తెలుసు. 'సూటు బూటు సర్కారు' అనే ఆరోపణ ఇప్పుడు పాతబడిపోయింది. నెహ్రూ-ఇందిర కాలంలో కమ్యూనిస్టులు ఇచ్చిన నినాదం (టాటా బిర్లాల ప్రభుత్వం) ఇప్పుడు గుర్తుకు వస్తోంది. ప్రస్తుతం మోడీది 'అదానీ-అంబానీల ప్రభుత్వం' అనే వ్యాఖ్యే ఎక్కువగా విన్పిస్తోంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com



ఓటేసిన కోట శ్రీనివాస్



ఓటేసిన హీరో మోహన్‌బాబు, మంచు విష్ణు

ఓటు హక్కు వినియోగించుకున్న నేతలు

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

నవతెలంగాణ-సంతోష్‌నగర్

చంపాపేట కంచన్ భాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మిథానీ డిపో సమీపంలోని గుడిసెల్లో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న మద్యాన్ని వేర్వేరుగా పట్టుకున్నట్టు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. గుడిసెల్లో కిరాణాషాప్ నిర్వహిస్తున్న జ్యోతి(38) దుకాణంలో నిల్వ ఉంచిన రూ.80,190 విలువైన 72.90లీటర్ల మద్యం, మరో మహిళ కేతావత్ జ్యోతి(35), నేనావత్ తిరుపతి(30) ఇంటి నుంచి రూ.3412 విలువైన 13.65లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు.

చేవెళ్ల కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌దే



నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఘనవిజయం సాధిస్తారని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ను ఆర్కేపురం డివిజన్‌లో ఉదయం నుంచి పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ అయిపోయిన తర్వాత ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఓటింగ్ శాతం పెరగవచ్చని అన్నారు. ఓటర్లు స్పష్టమైన మెజార్టీ ఇవ్వబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాలా కొండ శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న కార్పొరేటర్ వంగ మధు సూదన్‌రెడ్డి



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన గొప్ప సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్దలు కార్యకర్తలు సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సామ స్వప్న సుందర్ రెడ్డి



నవతెలంగాణ-సంతోష్ నగర్

యాకుత్ పురా నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న కుటుంబ సభ్యులతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం యాకుత్‌పురా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కొడుకు తీగల హరినాథ్ రెడ్డిలు మీర్‌పేట్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.
నవతెలంగాణ - మీర్ పేట్



భార్య, కూతురుతో కలిసి ఓటేసిన చిరంజీవి



కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన హీరో జూనియర్ ఎన్టీఆర్



నవతెలంగాణ -ఎల్బీనగర్

కరోనా కష్టకాలం లో పేదల కు ఉచితంగా బియ్యం, కూరగాయలు, బట్టలు పంపిణీ చేసిన సామాజిక సేవకురాలు యశస్విని జొన్నలగడ్డ తన ఓటును కొత్తపేట డివిజన్‌లో వేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు.



ఓటు హక్కు వినియోగించుకున్న డీసీసీబీ చైర్మన్ దంపతులు కొత్తకుర్మ సత్తయ్య కళమ్మ.
- నవతెలంగాణ,తుర్కయంజాల్



తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలో ఓటుహక్కు వినియోగించుకున్న కౌన్సిలర్ కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, లక్ష్మీ మేఘా టౌన్ షిప్ అధ్యక్షుడు బొగ్గు శ్రీను, కార్యదర్శి మెండే కొండల్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేప సందీప్ రెడ్డి, గడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు. - నవతెలంగాణ,తుర్కయంజాల్



ఉద్యమకారుడు, మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జగన్మోహన్ రెడ్డి తన ఓటు హక్కును ఆర్కేపురం డివిజన్లో వినియోగించుకున్నాడు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకొని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశాన్ని కోల్పోవద్దని అన్నారు.

-నవతెలంగాణ,చైతన్యపురి



తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలో మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకున్న యువతులు

ఆర్‌కే పురంలో ఓటేసిన సురేఖ భాస్కర్‌రెడ్డి



నవతెలంగాణ-చైతన్యపురి

పార్లమెంట్ ఎన్నికల్లో రామకృష్ణపురం డివిజన్ మాజీ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి, రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేతలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశంలో ప్రజలందరికీ ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చారని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజలు తమ ఓటు తీర్పుతో నిర్ణయిస్తారని ఆయన పేర్కొన్నారు. పనిచేయని ప్రభుత్వాలను, ప్రజా ప్రతినిధులను మార్చి వేసే శక్తి ఓటు ఉందని.. ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు.



కొత్తపేట్‌లో కాంగ్రెస్ నాయకులు వజీర్, ప్రకాష్‌గౌడ్ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలన చేస్తూ ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి కోరారు. కొత్త పేట్ డివిజన్‌లో ప్రకాష్ గౌడ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న మలక్ పేట్ ఎమ్మెల్యే బలాల -నవతెలంగాణ,మలక్‌పేట్



మలక్ పేట్ ముషారంభాగ్ సలీం నగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి
-నవతెలంగాణ,మలక్‌పేట్

నాగోల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న నాయకులు

నవతెలంగాణ-నాగోల్

సోమవారం జరిగిన 18వ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాగోల్ డివిజన్ లో కార్పొరేటర్ తో పాటు పలువురు రాజకీయ నేతలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ స్టేషన్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్పొరేటర్ చింతల్ అరుణ సురేంద్రనాథ్ యాదవ్ ,రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ,టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ,బీ ఆర్ ఎస్ పార్టీ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణలు కుటుంబ సభ్యులతో కలిసి తమ తమ నివాస ప్రాంతాలలోని పోలింగ్ బూత్ లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటింగ్లో పాల్గొని ఓటు హక్కు ను వినియోగించుకోవాలని కోరారు.







ఓటు వేసిన గోవింద్ సాగర్



నవతెలంగాణ-సంతోష్‌నగర్

యాకుత్‌పురా హైదరాబాద్ నియోజకవర్గం సంతోష్ నగర్, ఐఎస్ సదన్, మాదన్నపేట్ పోలీస్ స్టేషన్ జోన్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ గీత గోవింద్ సాగర్, కుర్మగూడ డివిజన్ ఉపాధ్యక్షులు ఆర్. బ్రహ్మచారి, జనరల్ సెక్రెటరీ నాగరాజు గుప్త చిక్కోటి, సీనియర్ నాయకులు రాములు చిక్కోటి, అశోక్ యాదవ్, సోనీ, స్థానిక నాయకులు కుటుంబ సభ్యులతో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం యాకుత్ పురా నియోజకవర్గంలో చంద్రయన్న హాట్స్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు కుటుంబ సభ్యులతో ఇతర ప్రజాప్రతినిధులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పార్టీ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు సభ్యులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్త తన ఓటు హక్కును చైతన్యపురిలోని సాయి నగర్ సీనియర్ సిటిజన్ భవనంలో వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటును తప్పకుండా వేయాలని కోరారు.

-నవతెలంగాణ,చైతన్యపురి



హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ యాదయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి మన్సూరాబాద్ డివిజన్‌లో తన ఓటు హక్కు ను ఉపయోగించుకున్నారు.
- నవతెలంగాణ,ఎల్బీనగర్

ఓటు హక్కు వినియోగించుకున్న సంరెడ్డి సురేందర్ రెడ్డి



నవతెలంగాణ-సంతోష్ నగర్

మలక్ పేట్ హైదరాబాద్ జిల్లా ఎంపీ ఎన్నికల భారతీయ జనతా పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం మలక్ పేట్ నియోజకవర్గంలో సైదాబాద్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలుర అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, సతీమణి శైలజ రెడ్డి, కుమారుడు ఎస్. నిలీష్ రెడ్డి తో ఇతర ప్రజాప్రతినిధులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు పార్టీ శ్రేణులు పెద్దలు, కార్యకర్తలు సభ్యులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

ఓటు హక్కు వినియోగించుకున్న కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి కుటుంబ సభ్యులతో తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. సోమవారం యాకుత్ పురా నియోజకవర్గంలో డివిజన్ పరిధిలో సైదాబాద్ చంపాపేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన నాగార్జున కాలనీ లైబ్రరీ హాల్‌లో పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్దలు కార్యకర్తలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ సరళిని పరిశీలించిన నాయకులు



నవతెలంగాణ-మేడ్చల్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు మేడ్చల్ మున్సిపాలిటీలో పర్యటించి పలు పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. కాగా ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఎదురుపడగా మీరందరూ కాంగ్రెస్‌లో ఉన్నా, దుబాయ్‌లో ఉన్నా, సింగపూర్‌లో ఉన్నా తనవారే అంటూ చమత్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, గ్రంథాల సంస్థ మాజీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ అలీ, మల్లికార్జున స్వామి, నాగార్జున్‌రెడ్డి, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌లను సందర్శించిన ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటింగ్ సరళిని బూత్ ఏజెంట్లను, బీఆర్ఎస్ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమాలలో కార్పొరేటర్లు మేకల సునీత రాము యాదవ్, జవహర్ నగర్ కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, నాయకులు బద్దం పరశురాం రెడ్డి, రావుల అంజయ్య జేఏసీ వెంకన్న, లడ్డు నరేందర్ , డోలి రమేష్ ,ఢిల్లీ పరమేష్, లక్ష్మణ్ యాదవ్ వెంకటేష్ యాదవ్, అనీల్ కిషోర్ గౌడ్, జీకే. హనుమంతరావు, మధుసూదన్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అమీనుద్దీన్, భాగ్యానంద్, ఉస్మాన్ ఇబ్రహీం, చిన్న యాదవ్, ఖలీల్ భాయ్, సతీష్, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట , మూడుచింతలపల్లి మండలాల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కాగా మూడుచింతలపల్లిలో 108 పోలింగ్ బూత్‌లో ఈవీఎం 30 నిమిషాలు మొరాయించింది. వెంటనే స్పందించి కొత్త ఈవీఎంను ఏర్పాటు చేశారు. తూంకుంట మున్సిపాలిటీలో మొత్తం 24002 ఓటర్లుండగా 59.58శాతం ఓట్లు నమోదు అయ్యాయి. మూడుచింతలపల్లి మండలంలో 20602 ఓటర్లుండగా 80.87శాతం పోలయ్యాయి. శామీర్‌పేట మండలంలో 68.54 శాతం ఓట్లు నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేటలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ శామీర్‌పేట పోలింగ్ బూత్‌ను సందర్శించి ఓటింగ్ సరళి ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ ఉమ్మడి శామీర్‌పేట మండల వ్యాప్తంగా తిరిగి పోలింగ్ బూత్‌లను సందర్శించారు.



ఘట్కేసర్‌లో పోలింగ్ ప్రశాంతం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఉమ్మడి మండల వ్యాప్తంగా వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలో ఉన్నారు. వృద్ధులు ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు ఉత్సాహంగా తరలి వచ్చారు. 18 ఏండ్లు నిండి ఇటీవల ఓటు హక్కును పొందిన యువతీ, యువకులు మొదటి సారి తమ ఓటు హక్కును వినినియోగించుకుని ఆనందం వ్యక్తం చేశారు.

ఘట్కేసర్ మున్సిపాలిటీలో 17,348 మంది,58.12 శాతం పోలయ్యాయి. ఘట్కేసర్ మండలంలో 24,268, 57.84 శాతం పోలయ్యాయి. పోచారం మున్సిపాలిటీలో16,648 మంది55 శాతం ఓటింగ్ నమోదైంది. ఏదులాబాద్‌లో పోలింగ్ కేంద్రాన్ని రాచకొండ సీపీ పరిశీలించారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఓటేసిన సినీ తారలు










ఓటు కోసం పోటెత్తిన జనం

- ఓటు వినియోగించుకున్న రాజకీయ నాయకులు
- పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టెంట్ సౌకర్యాలు ఏర్పాటు
- పలు చోట్ల పోలింగ్ సరళిని పరిశీలించిన నేతలు



కీసరలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్



కీసరలో ఓటు వేసేందుకు క్యూ లైన్ లో వేచి ఉన్న మహిళలు

నవతెలంగాణ-కీసర

కీసర మండలంలో పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కీసర మండలం, నాగారం మున్సిపాలిటీలో పురుషులు 14889 మంది, మహిళలు 13220 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 53.03 శాతం ఓటింగ్ నమోదైంది. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పురుషులు 12965, మహిళలు 11809 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 53.02 శాతం నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు ఓటు వేసేందుకు అధికారులు వీల్ చైర్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు ఎండ తగలకుండా టెంట్, మంచి నీటి సౌకర్యం కల్పించారు. చీర్యాలలో కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీ నారాయణ, నాగారంలో మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



చీర్యాలలో ఓటు హక్కు వినియోగించుకున్న కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ



రాంపల్లిలో ఓటు వినియోగించుకున్న వివిధ పార్టీల నేతలు



నాగారంలో వృద్ధుడిని వీల్ చైర్‌లో తీసుకెళ్తున్న అధికారులు



నాగారంలో ఓటు వేసిన మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి



కాప్రా డివిజన్ ఆదిత్య నగర్‌లోని విజయ హై స్కూల్ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం బూత్ నంబర్ 43లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ఓటు హక్కును వినియోగించు కున్నారు.

-నవతెలంగాణ,కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని రెడ్డినగర్‌లో ఉన్న ప్రగతి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంత శ్రీదేవియాదవ్ ఓటు హక్కు వినియోగించు కున్నారు. వారి వెంట కార్యకర్తలు ఉన్నారు.

-నవతెలంగాణ,కాప్రా





పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలోని ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన బూత్ నంబర్ 76లో నీరుకొండ సతీష్ బాబు, బాలనరసింహ, రాజేంద్ర కుమార్, సందీప్ గౌడ్‌లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

-నవతెలంగాణ,కాప్రా


మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ మంగాపురం వసుంధర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, నాగలక్ష్మి దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

-నవతెలంగాణ,కాప్రా



ఉప్పల్ నియోజకవర్గంలోని మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని తిరుమలానగర్‌లో ఉన్న మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

-నవతెలంగాణ,కాప్రా





నాచారంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్‌శేఖర్‌లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

-నవతెలంగాణ,కాప్రా

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లోని ఏపీఐఐసీ కాలనీలోని నవ జీవన్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రంలో ఏఎస్‌రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష, బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

-నవతెలంగాణ,కాప్రా



మాజీ కార్పొరేటర్ పావనీ మణిపాల్‌రెడ్డి సోమవారం తన కూతురుతో కలిసి కమలానగర్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వారు అవుతారని పేర్కొన్నారు. ప్రజలకు రాజ్యాంగం వజ్రాయుధంలాంటి ఓటు హక్కును కల్పించి సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం కల్పించిందని చెప్పారు.



-నవతెలంగాణ,కాప్రా

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలోని 368 పోలింగ్ కేంద్రంలో కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

-నవతెలంగాణ,ఉప్పల్



ఓటు హక్కు వినియోగించుకున్న ఈటల రాజేందర్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలోని జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 30లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, ఆయన భార్య జమున, కొడుకు నితిన్, కోడలు క్షమిత ఓటు వేశారు. పోలింగ్ కేంద్రం 28లో కుమార్తె నీత, అల్లుడు అనూప్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ డబ్బులు, మద్యం పంచడం సరైనది కాదన్నారు. నాయకులకు వెల కట్టడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. త్వరలోనే స్వేచ్ఛగా ప్రజాస్వామ్యయుతంగా ఓటు హక్కును వినియోగించుకునే రోజులు వస్తాయన్నారు. ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఈటల వెంట మాజీ వైస్ ఎంపీపీ ఎస్. నర్సింహ రెడ్డి, యువ నాయకుడు సామిత్‌రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు కృష్ణప్రియ మల్లారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, శ్రీమన్, పుట్నాల రాజు, నీరుడి దేవేందర్ ముదిరాజ్ తదిరులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి



గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు సోమవారం మున్సిపల్ పరిధిలోని మైసమ్మ గూడలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకుడు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ సీహెచ్ పెంటయ్య ఉన్నారు.

మేడ్చల్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించిన వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి



మేడ్చల్ మున్సిపాలిటీ, మండలంలో సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలు పర్యటించి స్థానిక కాంగ్రెస్ నాయకులను కలిసి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర గౌడ్, కౌన్సిలర్లు మణికంఠ గౌడ్, చాపరాజు, కౌడే మహేష్, నరసింహస్వామి వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు రమణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సత్యనారాయణ, జిల్లా సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, రంజిత్ తదితరులు ఉన్నారు.



ఓటేసిన మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ ఐటీఐలో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆయన సతీమణి వాణితో కలిసి 363 పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి విస్తోందని, 12 ఎంపీ సీట్లు గెలుబోతున్నామన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 25వేల మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలి

మేయర్ శాంతి కోటేష్ గౌడ్

నవతెలంగాణ - జవహర్ నగర్

ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్‌లో హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పలు పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.



గౌతమ్ నగర్‌లో ఓటు వినియోగించుకున్న సునీతా రాము యాదవ్

నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధార్థ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ బూత్ నంబర్ 69లో ఓటు హక్కు వినియోగించుకున్న గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ దంపతులు.





శామీర్‌పేట్ మండలంలోని లక్ష్మాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న యువత

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

కుత్బుల్లాపూర్‌లో పోలింగ్ బూతుల పరిశీలన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్
మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గంలోని పోలింగ్ బూతులను సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. జగద్గిరిగుట్ట, గాజులరామారం, బహదూర్ పల్లి, బౌరంపేట్, నిజాంపేట్, ప్రగతి నగర్, చింతల్‌ల్లో పలు పోలింగ్ బూత్‌లని పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, కోలన్ గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, రాము గౌడ్, ఆగం పాండు, బొంగునూరి కిషోర్ రెడ్డి తదితర నేతలు ఉన్నారు.

పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 128 - చింతల్ డివిజన్, 130 - సుభాష్ నగర్ డివిజన్, 131 - కుత్బుల్లాపూర్ డివిజన్, 132 - జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పోలింగ్ సెంటర్లను సోమవారం ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి , ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రాగిణి లక్ష్మారెడ్డి పోలింగ్ సెంటర్లలో ఓటర్లకు అందుతున్న వసతులను, పోలింగ్ నిర్వహణను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల నిర్వహణ తీరుపై చర్చించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కుత్బుల్లాపూర్‌లోని 507 - సత్ జ్ఞాన్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో సోమవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకనంద్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుల, మత, వర్గ, లింగ, వర్ణాలకతీతంగా సరైన పాలకులను ఎంచుకునేందుకు భారత రాజ్యాంగం ప్రతీ ఒక్కరికి కల్పించిన అవకాశం ఓటు హక్కు అన్నారు. కాబట్టి ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న కార్పొరేటర్ తార చంద్ర రెడ్డి ..
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరిగిన ఎన్నికలలో జీడిమెట్ల 132 డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తార చంద్ర రెడ్డి, తనయుడు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి కుత్బుల్లాపూర్ సిద్ధార్థ హై స్కూల్ పోలింగ్ కేంద్రం 493 లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతీ ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు అనేది సామాన్యుల స్వరమని పాలకులని ప్రశ్నించేందుకు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



ఓటు హక్కును వినియోగించుకుని కె.యం. ప్రతాప్, విశాల్ గౌడ్..
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో, సత్ జ్ఞాన్ హైస్కూల్లో,బూత్ నంబర్ 504లో రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి.విశాల్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే గాంధీ
కూకట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా, వివేకానంద నగర్‌లోని సొసైటీ ఆఫీస్ పోలింగ్ కేంద్రంలో, స్థానిక కార్పొరేటర్ రోజాదేవి రంగరావు, పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి, కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆయన సతీమణి శ్యామలదేవి, కొడుకు పృథ్వీ గాంధీ, కోడలు భార్గవి, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, నాయి నేనీ చంద్రకాంత్ రావు, కార్తిక్ రావు, రాంచందర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్, ఫతేనగర్ డివిజన్‌లలో ప్రశాంతంగా పోలింగ్



నవతెలంగాణ-బాలానగర్
మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్, ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఓటింగ్ పోలింగ్ శాతం కడపటి సమాచారం మేరకు... మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఓవరాల్‌గా 45 శాతం నమోదు కాగా, బాలానగర్ డివిజన్ పరిధిలో 56 శాతం నమోదు కాగా, బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్ కుష్ నగర్‌లో 57.7 గా నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. బాలానగర్, ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7గం: నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరిగింది. ఈ మేరకు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరాతో పాటు తగిన ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ జరుగుతున్న నేపథ్యంలో నగరంలోని అనేకమంది నగరం నుండి భారీ ఎత్తున తరలి వెళ్లడంతో కూకట్‌పల్లి నియోజకవర్గం, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం తగ్గినట్లు పలువురు తెలుపుతున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న మధుయాష్కి గౌడ్



నవతెలంగాణ-హాయత్ నగర్
పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌ను టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ సోమవారం ఉదయం హయత్ నగర్ ఓల్డ్ విలేజ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశంలోని సామాన్యుల నుంచి కోటీశ్వరుల వరకు ప్రజలందరికీ సమానంగా ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చారని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజలు తమ ఓటు తీర్పుతో నిర్ణయిస్తారని ఆయన పేర్కొన్నారు. పనిచేయని ప్రభుత్వాలను, ప్రజా ప్రతినిధులను మార్చి వేసే శక్తి ఓటు ఉందని, ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సునీత మహేందర్ రెడ్డి, మధుయాష్కి గౌడ్...
ఎల్బీనగర్ నియోజకవర్గంలోని హయత్ నగర్, బి.ఎన్.రెడ్డి నగర్, వనస్థలిపురం, లింగోజిగూడ, చైతన్యపురి తదితర డివిజన్‌ల్లో పోలింగ్ కేంద్రాలను మధుయాష్కి గౌడ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ ఎలక్షన్ చీఫ్ ఏజెంట్ హరి వర్ధన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లను మధుయాష్కి గౌడ్ ఆప్యాయంగా పలకరించారు. మధ్యాహ్నం మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి శ్రీమతి పట్నం సునీత మహేందర్ రెడ్డి, మధుయాష్కి గౌడ్‌తో కలిసి నాగోల్, ఉప్పల్ ప్రాంతాలలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న తీరును గమనించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలతో మాట్లాడి ఓటింగ్ శాతాన్ని పెంచేలా చూడాలని సూచనలు చేశారు.

మన్సూరాబాద్ పోలింగ్ కేంద్రం వద్ద ఈటెల జమున..
మన్సూరాబాద్ పరిధిలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ సతీమణి ఈటెల జమున పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆమె వెంట మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ నేతలు కళ్లెం రవీందర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, జగన్, హరీష్, సిద్ధు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న 89సంవత్సరాల వృద్ధురాలు..
ఓటు వేయడానికి ఆసక్తి చూపని యువతకు బుద్ధి వచ్చే విధంగా 89సంవత్సరాల వృద్ధురాలు అయిన రుక్మిణి, ఇంత వేసవిలో కూడా హాయత్ నగర్‌లో ఉన్న పద్మావతి కాలనీ వృద్ధురాలు ఓటు వేసి, అందరికి ఆదర్శంగా నిలిచింది.



అయ్యో.. ఓటు..!

- పోటీ ఓ చోట.. ఓటు మరో చోట..!
- హైదరాబాద్, మల్కాజిగిరి అభ్యర్థులకు వింత అనుభవం
- ఎవరి ఓటు వారు వేసుకోలేని పరిస్థితి





నవతెలంగాణ-సిటీబ్యూరో
ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులెవరైనా.. మీ అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకుని తమను గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తూ ఉంటారు. పంచాయతీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దిగిన అభ్యర్థులెవరూ.. ఇందుకు మినహాయింపు కాదన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఓటర్ల వద్దకు వచ్చి తనను గెలిపించండంటూ అభ్యర్థించిన అభ్యర్థులే.. తాము బరిలో దిగిన నియోజకవర్గంలో వారికే ఓటు లేకపోవడం కొసమెరుపు. ఇందుకు ఉదాహరణే హైదరాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్లు. ఇక్కడి నుంచి బరిలో నిలిచిన కొందరు అభ్యర్థులకు వింత పరిస్థితి ఎదురైంది. వారు పోటీ చేసింది ఒక నియోజకవర్గమైతే.. ఓటు హక్కు వినియోగించుకున్నది మరో నియోజకవర్గంలో. రాష్ట్రంలో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులందరూ దాదాపుగా తమ నియోజకవర్గాల్లో తమ విజయం కోసం ఓటు వేసుకుంటే.. అసదుద్దీన్ ఓవైసీ, మాధవీలత, పట్నం సునితా మహేందర్‌రెడ్డి మాత్రం తమ గెలుపునకు తామే ఓటు వేసుకునే పరిస్థితి లేకపోవడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఎందుకిలా..?
కొంపెల్లి మాధవీ లత, అసదుద్దీన్ ఓవైసీ, పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, ఈ ముగ్గురూ సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బరిలో దిగినా.. తమ గెలుపు కోసం వారికి వారు ఓటు వేసుకోలేదు. కొంపల్లి మాధవీలత హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు. సికింద్రాబాద్ ఈస్ట్ మారెడుపల్లిలోని మహేంద్రహిల్స్‌లో ఆమె నివసిస్తున్నారు. ఈ ప్రాంతం మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. దీంతో మాధవీ లత తన కోసం.. తన ఓటును వినియోగించుకోలేకపోయారు. ఇక హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంఐఎం తరుపున పోటీలో ఉన్న అసదుద్దీన్ ఓవైసీది సైతం ఇదే పరిస్థితి. ఆయన నివాసం రాజేంద్రనగర్ పరిధిలో ఉంది. ఈ ప్రాంతం చేవెళ్ల లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. అదీకాక చేవెళ్లలో ఎంఐఎం తరఫున ఎవరూ బరిలో నిలవలేదు. దీంతో ఆయన ఏదో పార్టీకి, ఎవరో ఒక అభ్యర్థికి ఓటేయాల్సి వచ్చింది. ఇక మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న సునితా మహేంద్‌రెడ్డి ఓటు తాండూరు పరిధిలో ఉంది. ఈ ప్రాంతం చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆమె సైతం తన ఓటు తనకు కాకుండా.. ఇతరులకు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కుత్బుల్లాపూర్‌లో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



నవతెలంగాణ-దుండిగల్
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచే ఎన్నికల అధికారులు, సిబ్బంది తమ విధుల్లో భాగంగా మున్సిపల్, కార్పొరేషన్, కమిషనర్ల ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు. ఓటర్లకు, వికలాంగులకు, వృద్ధులకు పోలింగ్ బూత్‌లలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దుండిగల్ కమిషనర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు ప్రతీ స్కూళ్లలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఓటర్లు సైతం ఎన్నికల పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది తీరుపై ప్రశంసిస్తూ, అలాగే అన్ని శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో చర్యలు, సౌకర్యాలు కల్పించారు. ఓటర్లు సంతృప్తి కరంగా ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఈటెల



నవతెలంగాణ-దుండిగల్
దుండిగల్ పురపాలక పరిధిలో డి పోచంపల్లి బౌరంపేట్ దుండిగల్ మల్లంపేట్, బహదూర్ గాగిలాపూర్, సర్కిల్ పరిధిలో మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్ పలు పోలింగ్ కేంద్రాలను బీజేపీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్‌తో కలిసి పరిశీలించారు.

సరూర్‌నగర్ ఎస్సై దురుసు ప్రవర్తన..!

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-చైతన్యపురి
ఓటు వేయడానికి తన కుటుంబంతో సహా వచ్చిన వ్యక్తిపై దురుసుగా ప్రవర్తించి తన సెల్ ఫోన్, కారు తాళాలు లాక్కున్నాడని ఓ బాధితుడు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌లోని వివిఎం హెూం పాఠశాలలో ఓటు వేయడానికి రామకృష్ణ చౌదరి అనే వ్యక్తి కుటుంబం తో కలిసి ఓటు వేయడానికి పాఠశాలకు చేరుకున్నాడు. అతనితో పాటు భార్య, అత్త, మామ కూడా ఆ కార్‌లో ఉన్నారు. వారి మామ వయస్సు 83, అత్త వయస్సు 79 సంవత్సరాలు ఉన్నాయని గేటు ముందు ఉన్న సిబ్బందిని రిక్వెస్ట్ చేసుకొని లోపలికి వెళ్ళాడు. అక్కడ విధుల్లో ఉన్న ఎస్ఐ వి.లక్ష్మయ్య, కాని స్టేబుల్ కారు లోపటికి తీసుకురావద్దు అంటూ దురుసుగా ప్రవర్తించి, కారు తాళాలు,సెల్ ఫోన్ లాక్కున్నారని రామకృష్ణ చౌదరి తెలిపారు. ఇదే విషయంపై సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిసారి తమ ఓటు హక్కును వియోగించుకున్న ఏనుగుల గాయత్రి యాదవ్, ఎనుగుల చేతన యాదవ్ తన కూతుర్లతో జిల్లెలగూడ మాజీ ఎంపీటీసీ ఏనుగుల అనిత అనిల్ కుమార్ యాదవ్...
నవతెలంగాణ-మీర్‌పేట్

యువత పైనే దేశ భవిష్యత్తు..

- ఉమాదేవి నగరలో ఓటు హక్కును వినియోగించుకున్న యువకులు
- ఓటు హక్కు వినియోగించేలా యువతను ప్రోత్సహిస్తున్న యూత్ ఐకాన్ కూరపాటి కరుణాకర్ రాజు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని మల్కాజగిరి పార్లమెంట్ పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ ఉమాదేవి నగర్‌లో ఓటు హక్కును సోమవారం స్థానికులు వినియోగించుకున్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా స్థానిక యూత్ ఐకాన్, సంఘ సేవకులు కూరపాటి కరుణాకర్ రాజు యువతను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ రాజు, నాయకులు రాములు గౌడ్, కృష్ణమూర్తి గుప్తా, సమ్మయ్య యాదవ్, అశోక్ చారి, రాము, సూర్యరాజు యూత్ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, శంకర్ పాల్గొన్నారు.



గిరినగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న స్థానిక యువకులు....




నూతనంగా ఓటు హక్కు వినియోగించుకున్న యువకుడు సరస్వతి నిఖిల్ రాజు....
ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధురాలు సరస్వతి భారతమ్మ...
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

'మల్కాజిగిరి' పోలింగ్ ప్రశాతం



- ఉప్పల్‌లో ఓటేయడానికి వచ్చిన మహిళ గుండెపోటుతో మృతి
- మల్లాపూర్‌లో మొరాయించిన ఈవీఎం
- సాయంత్రం 5 గంటల వరకు 46.27శాతం

నవతెలంగాణ-సిటీబ్యూరో
మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ ప్రశాతంగా ముసిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. ఉప్పల్‌లో ఓటేయడానికి వచ్చిన ఓ మహిళ గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందగా.. మల్లాపూర్ నెహ్రూనగర్‌లోని 175 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రధాన పార్టీల నియోజక వర్గ ఇన్‌చార్జిలు పోలింగ్ సరళిని పరిశీలించారు. సాయంత్రం 5 గంటల వరకు 46.27శాతం పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం పోలింగ్ శాతం నేటి మధ్యాహ్నం వరకు వెలువడే అవకాశం ఉంది. అత్యధికంగా మేడ్చల్ నియోజకవర్గంలో 52.12 శాతం పోలింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో 42.37 శాతం నమోదైంది. రూరల్‌లో ఎక్కువగా.. అర్బన్ ఏరియాల్లో తక్కువగా పోలింగ్ నమోదైనట్టు తెలుస్తోంది.

తగ్గుతున్న పోలింగ్
ఇప్పటి వరకు మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌కు వరుసగా నాలుగు సార్లు ఎన్నికలు జరిగాయి. పోలింగ్ శాతం ప్రతిసారీ తగ్గుతూ వస్తోంది. 2009లో మొదటిసారి ఎన్నిలు జరగ్గా.. 51.46శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత 2014లో 50.90శాతం, 2019లో 49.63శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 46.27శాతం నమోదైంది. ఈ లెక్కలని బట్టి చూస్తే పోలింగ్ శాతం క్రమంగా తగ్గుతూ వస్తోంది.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం ఇలా..
(సాయంత్రం 5 గంటల వరకు)

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	శాతం
మేడ్చల్	6,65,979	52.12
మల్కాజిగిరి	5,08,048	42.37
కుత్బుల్లాపూర్	7,24,992	48.2
కూకట్‌పల్లి	4,82,056	43.23
ఉప్పల్	5,40,052	44.93
ఎల్బీనగర్	6,04,763	43.76
కంటోన్మెంట్	2,53,706	47.88



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

కుటుంబ సభ్యులతో ఓటేసిన పద్మారావు గౌడ్



మొండ మార్కెట్ లో గల ఇస్లామియ హైస్కూల్ లో కుటుంబ సభ్యులతో కలిసి బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టి.పద్మా రావు గౌడ్ ఓటేశారు. అనంతరం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ లోని పలు పోలింగ్ కేంద్రాల సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నవతెలంగాణ-ఓయూ

మళ్లీ ఓటెత్తని నగరం

- అవగాహనలు కల్పించినా మారని ఓటర్లు

నవతెలంగాణ - బంజారాహిల్స్

ఎంత ప్రయత్నించినా ఎంత పబ్లిసిటీ చేసినా ఎంత గొప్పగా చాటింపు వేయించిన నగర ప్రజలు మారలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా 4వ విడత ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఓటింగ్ అత్యల్పంగా హైదరాబాద్ జిల్లాయే నమోదు చేసింది. విద్యావంతులు, ఉద్యోగులు,సంస్కారవంతులు, సెలబ్రిటీలు, యువత అత్యధికంగా ఉండే నగరవాసులే ఓటింగ్ శాతంలో వెనుకబడిపోయారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కేవలం 19.37% ఓటింగ్ నమోదు జరిగితే, మధ్యాహ్నం నుండి సాయంత్రం ఏడు గంటల వరకు మరో 20 శాతం పూర్తిచేసుకుని పూర్తిగా 39 నుంచి 40 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది.

నగరంలో పోలింగ్ ప్రశాంతం

- అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు
- ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

చెదురుమదురు ఘటనలు మినహా నగరంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఉదయం నుంచి ఓటరు ఓటువేసేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కొన్ని చోట్ల సాయంత్రం ఆరు గంటల కల్లా క్యూలైన్‌లో ఉన్నవారు సైతం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పలు ప్రాంతాలల్లో ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో ఆయా ప్రాంతాలల్లో ఓటింగ్ ప్రక్రియకు కొంత ఆలస్యమైంది. మరికొన్నిచోట్ల స్వల్ప ఘర్షలు చోటుచేసుకోవడంతో అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో సమస్య సర్దుమనిగింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం భవాని నగర్ లోని మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ బీజేపీ కండువాతో పోలింగ్ బూతులలో ప్రచారం చేస్తున్నాడని కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారికి సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు. మరికొన్న చోట్ల ఉదయం మాక్ పోలింగ్ సమయంలో సమస్యలు తలెత్తాయి. వెంటనే సంబంధిత అధికారులు సరి చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా అధికారులు మానిటరింగ్ చేశారు. నగరంలో ఏ పోలింగ్ కేంద్రంలో సమస్యలు తలెత్తినా సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు.

ఉప్పల్‌లో పోలింగ్ కేంద్రంలో గుండెపోటుతో వృద్ధురాలు మృతి

ఉప్పల్‌లో 349 నంబర్ పోలీగ్‌బూత్‌లో ఓటు వేసేందుకు వచ్చిన గట్టు విజయలక్ష్మి(65) అనే మహిళా ఓటు వేసిన తర్వాత పోలింగ్ కేంద్రంలోనే కుప్పకూలింది. ఆస్పత్రికి తీసుకెళ్లడంతో అప్పటికే ఆమె గుండెపోటులో మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతపై మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ సెక్షన్లకింద కేసునమోదైంది.

ఓటుహక్కును వినియోగించుకున్న ప్రముఖులు

నగరంలో ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్, ఫిలింనగర్, షేక్‌పేట్, మణికొండ, మాదాపూర్, బంజారాహిల్స్‌లో సినీ ప్రముఖులతోపాటు పలువురు రాజకీయ నాయకులు, అధికారులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మోండా మార్కెట్‌లోని ఇస్లామీయ హైస్కూల్‌లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెస్ట్ మారేడ్ పల్లిలోని కస్తూర్బా గాంధీ గర్ల్స్ కాలేజీలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హైదరాబాద్‌లోని నందినగర్‌లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లోని గవర్నమెంట్ స్కూల్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, తండ్రి కే.కేతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మాదాపూర్‌లోని వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజ్‌లో కుటుంబసభ్యులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ఓటుహక్కును వినియోగించుకున్నారు.



భారీ పోలీస్ భద్రత మధ్య ఈవీఎంల తరలింపు

నగరంలోని రెండు ఎంపీ స్థానాలతో పాటు, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి కావడంతో జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ సందర్భంగా హైదరాబాద్, రాచకొండ మూడు పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ బందోబస్తును నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్, ఎల్బీనగర్ నియోజకవర్గాలలో పోలైన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను పోలీసుల బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి భద్రపరిచారు. అక్కడ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.

'కంటోన్మెంట్' పోలింగ్ 52 శాతం

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ కూడా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. 52 శాతం పోలింగ్ అయిందని ఎన్నికల అధికారి మధుకర్ నాయక్ తెలిపారు.

కంటోన్మెంట్ ఉప ఎన్నిక కోసం 234 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈసారి ఉప ఎన్నికలలో అధికార పార్టీకి చెందిన అభ్యర్థి శ్రీ గణేష్ ప్రతిపక్ష పార్టీకి చెందిన అభ్యర్థి నివేదిత అలాగే బీజేపీకి చెందిన అభ్యర్థి వంశీ తిలక్‌తో పాటు మరో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో దిగారు.







బోయిన్‌పల్లిలో ఓటు వేసిన ఎమ్మెల్యే

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బోయిన్ పల్లిలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు ఆయనతోపాటు మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు.అనంతరం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్లు పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకున్న మధుకర్ నాయక్

కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల అధికారి బోర్డు సీఈవో మధుకర్ నాయక్ రాయి ప్రభుత్వ పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న శ్రీ గణేష్

కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ పికెట్ లోని బూత్ నెంబర్ 89లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు అందరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఓటు హక్కును వినియోగించుకున్న నివేదిత

బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత పికెట్ గాంధీయన్ స్కూల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.





ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే తలసాని

నవతెలంగాణ-బేగంపేట్

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లి లోని కస్తూర్బా కళాశాల ఆవరణలోని 20వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విజ్ఞతతో విధిగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. మనకు అన్ని విధాలుగా అండగా ఉండే వ్యక్తులనే ఎన్నుకోవాలని, ఎవరికి ఓటు వేస్తే మేలు జరుగుతుందో గుర్తించి ఓటు వేయాలని సూచించారు. ఆయన వెంట మోండా మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, నాయకులు హరికృష్ణ తదితరులు ఉన్నారు.





ప్రశాంతంగా ఓటింగ్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

ఎస్సార్ నగర్, బోరబండ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది. బోరబండ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ బూతులు ఉన్నప్పటికీ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినందున ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇదిలా ఉండగా కొన్ని పోలింగ్ బూతులలో 11 గంటలు అయినా ఎలాంటి టిఫిన్ అందించలేదని పోలింగ్ సిబ్బంది మీడియాకు చెప్పడం కనిపించింది.

భారీ మెజార్టీతో గెలవబోతున్న కాంగ్రెస్ అభ్యర్థులు

- అదం సంతోష్

నవతెలంగాణ-ఓయూ



రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో భారీ మెజార్టీతో గెలవబో తున్నట్టు కాంగ్రెస్ సికింద్రాబాద్ నాయకులు ఆదం సంతోష్ ధీమా వ్యక్తం చేశారు. ఓటింగ్‌లో పాల్గొన్న ప్రతీ ఓటర్ మహాశయులకు ఆయన కతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి దానం నాగేందర్ భారీ మెజార్టీతో గెలవబోతున్నట్టు సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత 25 రోజులుగా పార్టీ విజయం కోసం శ్రమించిన నేతలకు కార్యకర్తలను ఆయన అభినందించారు. ఇక రాష్ట్రంలో ఎన్నికలు ఇంత సజావుగా ప్రశాంతంగా పూర్తి కావడానికి సహకరించిన ఎన్నికల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో పాటుగా, పోలీస్ యంత్రాంగానికి సంతోష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఇదిలా ఉండగా ఆదం సంతోష్ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అడ్డగుట్ట డివి జన్ తుకారం గేట్ మున్సిపాలిటీలో తన కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.





ఓటు వేసిన కార్పొరేటర్లు

నవతెలంగాణ-బేగంపేట

బేగంపేట డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, మొండ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికలు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు





నవతెలంగాణ-ఓయూ

తార్నాక సెంట్ ఆన్స్ హై స్కూల్లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత మోతే శోభన్ రెడ్డి ఓటు హక్కును వినియోగించు కున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని దేశ భవిష్యత్తుకు పాటుపడాలని, మొదటిసారి ఓటు వేస్తున్న యువత ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని డిప్యూటీ మేయర్ కోరారు.

ఓటు వేసిన టీజేఎస్ అధ్యక్షుడు

తార్నాక నాగార్జున నగర్ తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రో.ఎం. కోదండరాం తన సతీమణితో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన టీజేఎస్ అధ్యక్షుడు వల్లారపు శ్రీనివాస్



టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ బౌద్ధనగర్ నేతాజీ స్కూల్ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అంబర్‌పేటలో ప్రశాంతంగా పోలింగ్

- ఉదయం మందకోడిగా మొదలై మధ్యాహ్నం కొద్దిగా పుంజుకున్న పోలింగ్
- పోలింగ్ కేంద్రాలు తెలియక తికమక పడిన ఓటర్లు

నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ కొన్ని చెదురుముదురు సంఘటనలు తప్ప ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని 236 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ మొదలైన మొదటి రెండు గంటల్లో అంటే ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్య మందకొడిగా సాగింది. కేవలం 6.42 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. చాలా మంది ఓటర్లు ఇండ్ల నుంచి బయటకు రాలేదు. తర్వాత రెండు గంటల్లో అంటే పుంజుకుంది. అప్పుడు 18.55 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరికొంత వేగం పెరిగి 28.45 శాతం, ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు 37.45 శాతం పోలింగ్ నమోదైంది. ఇక 3 నుంచి 5 గంటల వరకు 45.30 శాతం నమోదైంది. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ సరళిని బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కుటుంబ సమేతంగా గోల్నాకలోని సెయింట్ పాల్ స్కూల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కిషన్ రెడ్డి బర్కత్‌పురలోని దీక్షా మోడల్ స్కూల్లో కుటుంబ సమేతంగా తన ఓటు వేశారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై. అమృత, దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్, ఇ.విజయ్‌కుమార్ గౌడ్, బి. పద్మవెంకటరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి తదితరులు కూడా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

అంబర్‌పేట నియోజకవర్గంలోని 55 పోలింగ్ కేంద్రంలో 7 గంటలకు పోలింగ్ మొదలైంది. పలు చోట్ల అరగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. సిబ్బంది వచ్చి సరిచేసిన తర్వాత పోలింగ్ ప్రారంభమైంది. బర్కత్‌పురలోని దీక్షా మోడల్ స్కూల్లో కూడా అరగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఓటు వేయడానికి వచ్చి లైన్ లో అరగంట పాటు నిల్చున్నారు. సిబ్బంది వచ్చి ఈవీఎంలను సరి చేసిన తర్వాత ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి గంట వరకు కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎం, వీవీ ప్యాట్లు మొరాయించాయి. ఇక చాలా మంది ఓటర్లు తమకు ఏ పోలింగ్ బూత్లో ఓటు ఉందో తెలియక తికమకపడ్డారు. ఎప్పుడు ఓటు వేసే కేంద్రానికి వెళితే అక్కడ ఓటు లేకపోవడంతో వెనుదిరిగారు.



గోల్నాకలోని సెయింట్ పాల్స్ స్కూల్ బూత్ నెంబర్ 175లో పోలింగ్ జాబితాలో ఉన్న ఫోటోలో గడ్డం లేకుండా ఉండి.. ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తికి గడ్డం ఉండడంతో పోలింగ్ ఆఫీసర్ అభ్యంతరం తెలిపారు. ఇలా ఐదు మందిని వెనక్కు పంపడంతో ఇది తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు వచ్చి పోలింగ్ ఆఫీసర్‌ను నిలదీసి ధర్నా చేశారు. పోలీసులు వచ్చి సముదాయించి మళ్లీ వారిని ఓటు వేయించారు.

నల్లకుంట సత్యానగర్ బూత్‌లో కూడా విధుల్లో ఉన్న ఆశా వర్కర్‌పై కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్నావంటూ దాడి చేయడానికి వెళ్లారు. పోలింగ్ ఆఫీసర్, పోలీసులు వచ్చి తాము ఇక్కడ అంతా గమనిస్తున్నామని, అలాంటిది ఏదీ జరగడం లేదని చెప్పడంతో వెనుదిరిగారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఓటర్ స్లిప్పులు ఇంటింటికి పంపిణీ చేయకపోవడంతో తమ ఓటు ఎక్కడ ఉందో తెలియక ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. చాలా మంది ఓట్లు గల్లంతయ్యాయి. ఒక్క ఇంట్లో ముగ్గురు ఉంటే ఒక్కొక్కరి ఓటు ఒక్కో పోలింగ్ బూత్‌లో పడింది. బాగ్ అంబర్ పేట బతుకమ్మకుంటలో ఈ పరిస్థితి నెలకొంది. ఇలా భర్త ఒకచోట, భార్య ఒకచోట, పిల్లలు ఒకచోట ఓటు వేయాల్సివచ్చింది.

దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద వీల్ చైర్, వారిని తీసుకురావడానికి వాహనాలను ఏర్పాటు చేశారు. కొత్తగా ఓటు వచ్చిన వారు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండాకాలం కావడంతో ఓటు వేయడానికి చాలా మంది అనాసక్తిని చూపారు. బయటకు కూడా రాలేదు.

పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్నికలు ఉండటంతో ఆ రాష్ట్ర ప్రజలు చాలా మంది సొంతూరికి వెళ్లిపోయారు. ఇక్కడ పోలింగ్ తగ్గడానికి అది కూడా ఒక కారణం అని పలువురు విశ్లేషిస్తున్నారు. నల్లకుంటలోని ఆర్యభట్ల స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్లో కొందరి ఓట్లు తొలగించగా...అవి మరో పోలింగ్ బూత్‌లో ఉన్నాయి. దీనివల్ల ఓటర్లు తికమకపడ్డారు. కొందరు ఓటు తొలగించారని వెనుదిరిగారు.

ముషీరాబాద్‌లో ఓటింగ్ ప్రశాంతం



- ఊపిరి పీల్చుకున్న ఎన్నికల అధికారులు
- ఓటింగ్‌లో ఎక్కువ శాతం పాల్గొన్న యువత, ప్రముఖులు
- మధ్యాహ్నం నుంచి ఊపందుకున్న పోలింగ్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ పోలింగ్ లో ఎక్కువ శాతం యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఆరు డివిజన్ లలో 274 పోలింగ్ బూతులలో ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సెంటర్ల వద్ద పోలీసు సిబ్బంది జీహెచ్ఎంసీ ఎన్నికల అధికారులు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయడంతో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి మందకోడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం ఊపందుకుంది. ఎండ తీవ్రత కూడా తక్కువగా ఉండడంతో ప్రజలు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపించారు. కొన్ని పోలింగ్ బూత్ సెంటర్ల వద్ద ప్రజలు గంటలు తరబడి లైన్‌లో నిలబడి తమ ఓటు వేయగా కొన్ని పోలింగ్ బూత్ లలో ఓట్లు వేసేందుకు ఓటర్లు లేక ఎన్నికల అధికారులు వేచి చూడవలసి వచ్చింది. కొన్ని బూత్ లలో చిన్నచితక గొడవల మినహా ఎటువంటి ఇబ్బందులు ఎత్తకపోవడంతో ముషీరాబాద్‌లో ప్రశాంతంగా ఓటింగ్ ముగిసింది. నియోజకవర్గంలో దాదాపు 3 లక్షల ఏడు వేల 511 మంది ఓటర్లు ఉండగా దాదాపు 46 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు తెలిపారు.

పార్లమెంటు ఓటింగ్‌లో యువత పెద్ద ఎత్తున హాజరై తమ ఓటు హక్కు వినియోగించుకోగా నియోజకవర్గంలోని ప్రముఖులు సైతం ఉదయాన్నే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖుల్లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఉన్నారు. ఆయన రాంనగర్ శ్రీ జే వి హై స్కూల్ లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు, గాంధీనగర్ డివిజన్ లేబర్ కమిషన్ కార్యాలయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఓటు వేశారు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, ఆర్ కృష్ణయ్య, కార్పొరేటర్లు పావని వినయ్ కుమార్, రచన శ్రీ, నాయకులు సూర్యనారాయణ శర్మ, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ ఎల్ పద్మ, తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకుని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజల సమస్యలను ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రముఖ సంఘసంస్కర్త రజనీకాంత్ గౌడ్ వృద్ధులు ఓటు వేసేందుకు సహకరించారు. నియోజకవర్గంలో ఆయా పార్టీలకు సంబం ధించిన నాయకులు కార్యకర్తలు వారి పార్టీకి నియోజకవర్గం ఓట్లు ఎక్కువ పోలయ్యాయని అభ్యర్థుల గెలుపులో ముషీరాబాద్ ఓట్ల కీలకంగా మారుతాయి అని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రతిసారి ఎన్నికల సమయంలో ఓట్లు వేసే వారి సంఖ్య పెరగకపోవడంతో ఒకింత ఆందోళన వ్యక్తం అవ్వగా ఉన్నంతలో ప్రజలు మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంపై హర్షించదగ్గ విషయం. ప్రజలు తమ అమూల్యమైన సమయాన్ని వృధా చేయకుండా నాయకులను ఎన్నుకోవడంలో ముందుండి ఓటు హక్కును వినియోగించుకుని ఆదర్శవంతంగా మారాలని ప్రతి ఒక్కరు కోరుతున్నారు.



ఓటు హక్కు ప్రతీ ఒక్కరి సొత్తు

- కార్పొరేటర్ విజయా రెడ్డి

నవతెలంగాణ-బంజారా హిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్‌లో గల డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ బిల్డింగ్‌లో 59వ పోలింగ్ స్టేషన్‌లో స్థానిక కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి తన ఓటు హక్కును వినియో గించుకున్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రతీ ఒక్కరి సొత్తు అని ఆమె అన్నారు.

సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలో 51 .74 శాతం పోలింగ్

నవతెలంగాణ-ఓయూ



సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం నియోజకవర్గ పరిధిలో 220 పోలింగ్ కేంద్రాలాలో 2 లక్షల 66 వేల 337 ఓట్లకు గాను 1 లక్ష 37 వేల 797 (51 . 74 శాతం) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంతకుముందు సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీలు , కాలనీ లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్స్ బారులు తీరారు. ఇక బూత్ ల వద్ద పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఓటు హక్కు వినియోగించుకున్న నిజాంపేట మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి దంపతులు ...
నవతెలంగాణ-దుండిగల్



ఇంజనీరింగ్ స్టాఫ్‌కాలేజ్ ఆఫ్ ఇండియాలో కన్వెన్షన్ సెంటర్‌ను జూలై చివరిలో లేదా ఆగస్టు మూడవ వారంలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కన్వెన్షన్ సెంటర్‌ను రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభించేందుకు సోమవారం ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్‌రావు నేతృత్వంలో రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని కలుసుకుని ఆహ్వానించారు. ఈ మేరకు ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి అంగీకారం తెలిపారని రామేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్రపతి అంగీకరించడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన

జిల్లా ఎన్నికల అధికారి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి మొఘల్‌పుర హరి బౌలి రైఫాయం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. మాదాపూర్ లోని వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కాలేజీలోని పోలింగ్ కేంద్రంలో రోనాల్డ్ రోస్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించు కున్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో (జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో)



ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుండి ఎన్నికల ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా మానిటరింగ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్ణీత సమయానికి అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఆయా రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని, అక్కడక్కడ కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ సమయంలో కొన్ని సమస్యలు తలెత్తాయని, వెంటనే వాటిని సంబంధిత ఇంజనీర్స్‌తో సరి చేయడం జరిగిందని తెలిపారు.

నగరవాసులది అదే దారి

- నగరంలో తగ్గిన ఓటింగ్ శాతం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో కోటి మందికి పైగా నివసిస్తున్నారు. కానీ ప్రతిసారి ఎన్నికల్లో మాత్రం ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదుకావడం రివాజుగా మారింది. ఏ ఎన్నికలైనా 50 శాతానికి మించి దాటడం లేదు. ఇతర ప్రాంతాల్లో 70శాతానికిపైగా ఓటింగ్ శాతం నమోదవుతుంటే నగరంలో మాత్రం ఓటింగ్ శాతం పతనమవుతోంది. ఈ సారైనా నగరంలో ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో బల్దియా పక్కా ప్రణాళికలు అమలు చేసింది. చదువుకున్నవారు, ఐటీ ఉద్యోగులు, యువత నిరాశక్తత వదిలి ఉత్సాహంగా ఓటు వేసేలా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక దష్టిసారించారు. విస్తృతంగా ఓటరు అవగాహన కార్యాక్రమాలను నిర్వహించింది. అయినా ఓటింగ్ శాతం పెంచలేక పోయారు.

1944 పోలింగ్ కేంద్రాలు... 22,17,9054 ఓటర్లు

జిల్లాలో సికింద్రాబాద్, హైదరాబాద్, పార్లమెంట్‌కు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల జరిగాయి. మొత్తం జిల్లాలో 3986 పోలింగ్ కేంద్రాల్లో 45 లక్షల 91 వేల 201 ఓట్లువున్నాయి. అందులో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 1944 పోలింగ్ కేంద్రాల్లో 22,17,9054 ఓటర్లు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలో 1810 పోలింగ్ కేంద్రాల్లో 21,20,401 ఓటర్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో 232 పోలింగ్ కేంద్రాల్లో 2,53,706 ఓటర్లున్నారు. సోమవారం ఓటింగ్ సందర్భంగా హైదరాబాద్ నియోజకవర్గంలో అందిన సమాచారం మేరకు 46.08 శాతం , సికింద్రాబాద్ పార్లమెంట్‌లో 48.11 శాతం, కంటోన్మెంట్ నియోజకవర్గం 52.00 శాతం ఓట్లు నమోదయ్యాయి. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలతో పాటు పోలింగ్ సిబ్బంది ఆ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ వద్ద కు పూర్తి బందోబస్తు తో సెక్టర్ ఆఫీసర్‌తో కలిసి క్షేమంగా చేరుకున్నారు. అక్కడ పొలైన ఓట్ల పూర్తి సమాచారంతో సెక్టార్ వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద తీసుకొని ఎన్నికల నియమావళి ప్రకారంగా నివేదిక అందించిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు ఏర్పాటుచేసిన ఉచిత బస్సు సౌకర్యంను కల్పించారు. దాంతో పాటు పోలింగ్ అధికారులకు డీఆర్‌సీ సెంటర్ వద్ద భోజన వసతి కల్పించారు.



పాత బస్తీలో ఓటింగ్ ప్రశాంతం











నేడు రసమయి బాలల ఉగాది పురస్కారాలు

నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణలో ప్రతీ సంవత్సరం లాగా ఈ క్రోధి ఉగాది సందర్భంలో వివిధ కళా రంగాలకు సంబంధించిన బాలలకు శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై మంగళవారం పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు సంస్థ స్థాపకుడు డాక్టర్ ఎం. కే.రాము పత్రికా విలేకరులకు తెలిపారు. ముఖ్య అతిథిగా హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ పాల్గొనగా నాట్య గురువు డాక్టర్ భారతి, ఎం.శ్రీనివాసులు అతిధులుగా పాల్గొంటారు.

ఓటు హక్కును సద్వినియోగపరచుకోండి



నవతెలంగాణ-దుండిగల్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి నిజాంపేట్ లోని ఎం.పి.పి.ఎస్ స్కూల్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజా స్వామ్య నిర్మాణంలో భాగమయ్యారు. వారితో పాటూ ఫణి, ఏలూరి సత్య (నాని), ప్రేమ్ కుమార్, శ్రీశైలం, శంకర్, హేమారెడ్డిలు కూడా వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం కే.ఎస్.ఆర్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పోలింగ్ కేంద్రాలైన జెడ్.పి.హెచ్.ఎస్, విజ్ఞాన్ స్కూళ్ళకి వెళ్లి, అక్కడి పోలింగ్ బూత్ ఏజెంట్లు, ఇన్‌చార్జిలతో కలిసి, ప్రజలకు ఓటర్ స్లిప్‌లను అందచేశారు. ఈ సందర్భంగా కే.ఎస్.ఆర్ మాట్లాడుతూ ' ఓటు ప్రజల భవిష్యత్తు, అభివృద్ధిని నిర్దేశించే ఏకైక ఆయుధం' అని, ప్రజలందరూ వారి ఓటుహక్కును వినియోగించుకోవాలని చైతన్య పరిచారు. ముఖ్యంగా భారీగా యువత ఓటు వేసేందుకై ముందుకి రావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రతీ ఒక్కరినీ అభినందించారు.

అందం, చదువు, ధనం లేకున్నా అమ్మ అమ్మే



నవతెలంగాణ-కల్చరల్

అందం చదువు ధనం ఇవేవీ లేకున్నా ప్రతి వారికీ వారి అమ్మ అమ్మే ఆమె ప్రేమకు కొలమానం లేదని సివిల్ సర్వీస్ విశ్రాంత వున్నతాధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ అభినందన నిర్వహణలో అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భం సాంఘీక సేవా కర్త సత్య వాణికి భవాని మాతృ మూర్తి మాదిరాజు వరలక్ష్మి స్మారక పురస్కారంతో పాటు ప్రఖ్యాత గాయకుడు డీ.వీ. మోహన కృష్ణ అమ్మ డీ కుసుమకు ప్రముఖ గాయని విజయ లక్ష్మి అమ్మ సుగుణకు మాతృవందనం పేరిట సత్కారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో అమ్మ కే తొలి ప్రాధాన్యం అని మాతృ దేవో భవ తరువాతే పితృ దేవో భవ అంటారని గుర్తు చేశారు. సత్యవాణి భారతీయ వాణీగా మన దేశ సంస్కృతిని ప్రచారం చేస్తున్నారని అన్నారు. కుసుమ రేణుక గొప్ప గాయకులకు జన్మ నిచ్చారని ప్రశంసించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మదర్స్ డే ప్రత్యేకంగా లేదని ప్రతి రోజూ అమ్మను ప్రేమించటం సంస్కారం అన్నారు. పొరుగు దేశం నుంచి వచ్చిన సంసృతి ఇనా సంస్కారంగా చేసుకోవటం మంచిదే కదా అన్నారు. స్వాగతం పలికిన సంస్థ స్థాపకులు భవాని తమ తల్లి కష్టాలు కొర్చు కొని తనను పెంచిన సంగతులు అర్ద్రంగా గుర్తు చేసుకున్నారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె వి కృష్ణ కుమారి విజయానంద కృష్ణ, ఇందిరా విజయ్ తదితరులు పాల్గొన్నారు. ధనుంజయ్ పాడిన అమృత మూర్తి అమ్మ శీర్షికను పాడిన పాటలు హృదయనికి హత్తుకున్నాయి.

ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోండి..

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ పురపాలక పరిధి శంభీపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా. ఆయన మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అని తెలిపారు. ప్రజలందరూ ఏకమై ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా, ప్రతీ ఓటర్ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని సూచించారు.





ఎల్‌బీనగర్‌లో పోలింగ్ సరళిని పరిశీలించిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కి గౌడ్...
నవతెలంగాణ-ఎల్‌బీనగర్



కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్న మీర్ పేట్ బీఆర్ఎస్ నాయకులు..
నవతెలంగాణ-మీర్‌పేట్

బంజారాహిల్స్‌లో ఓటు వేసిన కలెక్టర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజవర్గం ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్-13లోని తెలంగాణ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.





మాదాపూర్ లోని వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కాలేజీలోని పోలింగ్ కేంద్రం లో రోనాల్డ్ రోస్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

మళ్లీ అదే సీన్...!!

- ఓటింగ్ పట్ల పెద్దగా ఆసక్తి చూపని భాగ్యనగరవాసులు
- అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక ఏర్పాట్లు, సెలవు ఇచ్చినా మారని పరిస్థితి
- హైదరాబాద్‌లో 46.08 శాతం, సికింద్రాబాద్‌లో 48.11శాతం పోలింగ్ నమోదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

భాగ్యనగర ఓటర్లు మరోసారి బద్ధకించారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సెలవు ప్రకటించినా.. అధికారులు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక చర్యలు తీసుకున్నా.. నగర ఓటరు తీరులో మాత్రం మార్పు రావడం లేదు. ఎప్పటిలాగే పోలింగ్‌కు నగరవాసులు దూరం పాటించారు. మరోవైపు ఓటు హక్కు వినియోగంపై అధికారులు పలు విధాల్లో అవగాహన కల్పిస్తున్నా.. చివరకు పోలింగ్ తేదీ వచ్చేసరికి నగర ఓటర్లు గడప దాటి బయటకు రాకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గ్రామీణ ప్రాంత ఓటర్లు పోలింగ్ బూతులకు తరలివెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నా.. జంటనగరాల ప్రజలు మాత్రం మారడంలేదు. గతంలో మాదిరిగా ఈసారి కూడా సిటీ జనం ఓటు వేసేందుకు కదలలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో తక్కువగా ఓటింగ్ శాతం నమోదైంది. అందులో అత్యల్పంగా హైదరాబాద్‌లోనే ఓటింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ కావడం గమనార్హం. అయితే కొందరు ఉదయమే లేచి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నా.. ఓవరాల్‌గా మాత్రం పోలింగ్ నామమాత్రంగానే జరిగింది. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు 5.6 శాతం, ఉదయం 11గంటలకు 10.70 శాతం, మధ్యాహ్నం 1.00గంటలకు 19.37 శాతం, 3 గంటలకు 29.47 శాతం, సాయంత్రం 5.00 గంటలకు 39.17 శాతం, పోలింగ్ ముగిసే నాటికి 46.08 శాతం పోలింగ్ నమోదుకాగా.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో మధ్యాహ్నం 1.00 గంటల వరకు 24.30శాతం, మధ్యాహ్నం 3గంటల వరకు 34.58శాతం ఉండగా.. సాయంత్రం 5గంటలకు 42.23 శాతం, పోలింగ్ ముగిసే నాటికి అది 48.11 శాతంగా పోలింగ్ నమోదైంది. కాగా, గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 45.8శాతం ఓటింగ్ శాతం నమోదు కాగా.. సికింద్రాబాద్ పార్ల మెంట్ పరిధిలో 48.9శాతం పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే.

అసెంబ్లీ సెగ్మెంట్ వారిగా పోలింగ్ ఇలా..

హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకరవ్గంలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ క్రమంగా అదే స్థాయిలో కొనసాగింది. మొదటి రెండు గంటల్లో సగటున 5శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తర్వాత రెండు గంటల వ్యవధిలో మరో పది శాతం, అ తర్వాత మరో రెండు గంటల్లో 15 శాతం నమోదైంది. అటు నుంచి ప్రతీ రెండు గంటలకు వరుసగా పది శాతం చొప్పున ఓటింగ్ పెరుగుతూ వచ్చింది. మొత్తం మీద గత పర్యాయం కంటే పోలింగ్ తక్కువగా నమోదైంది. రెండు లోక్‌సభ స్థానాలోని అన్ని నియోజవర్గాలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 5గంటలకు పోలింగ్ ముగిసే సయమానికి నాంపల్లి, జూబ్లిహిల్స్, ముషీరాబాద్‌లో 45శాతం పోలింగ్ కాగా.. అంబర్‌పేట్, ఖైరతాబాద్, ముషీరాబాద్, సనత్‌నగర్, సికింద్రాబాద్‌లో 48-52శాతంపైనే ఓటింగ్ నమోదైంది. హైదరాబాద్ పరిధిలోనూ బహుదూర్‌పురా అత్యల్పంగా 34.19శాతం ఓటింగ్ నమోదు కాగా.. చాంద్రాయణగుట్ట, చార్మినార్, గోషామహల్, కార్వాన్, మలక్‌పేట్, యాకుత్‌పూలో 38శాతం నుంచి 44శాతం వరకు పోలింగ్ నమోదు అయ్యింది. మొత్తంగా పాతబస్తీ ఓటర్ల తీరులోనూ మార్పు రాలేదు. ప్రతిసారి పోలింగ్ శాతం దారుణంగా దిగజారుతోంది. వాస్తవంగా నగరంలోని మిగిలిన చోట్ల పోలింగ్ ఓ ఎత్తయితే పాతబస్తీలో ఓటింగ్ మరో ఎత్తు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి కనబర్చరు. గత రెండు పర్యాయాల పోలింగ్ పరిశీలిస్తే మొత్తం ఓటర్లలో సగం మంది కూడా పోలింగ్‌లో పాల్గొనకపోవడం ఇందుకు నిదర్శనం. ప్రతీసారి ఎన్నికల యంత్రాంగం ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపడతున్నా.. పరిస్థితిలో ఏమాత్రం మార్పు కనిపించడంలేదు. ఇండ్లలో నుంచి బయటికి వచ్చి ఓటేసేందుకు పెద్దగా ఆసక్తిని కనబర్చని పరిస్థితి నెలకొంది.

మొబైల్ ప్రభావం..!

పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లకు అనుమతి లేదు. ఈ నిబంధన ఎప్పటి నుంచో అమలులో ఉన్నప్పటికీ.. చాలా మంది తెలిసి తెలియక సెల్‌ఫోన్ వెంట పెట్టుకుని వచ్చేశారు. వాస్తవానికి చాలామంది ఫోను లేకుండా బయటకు వచ్చే పరిస్థితి సైతం ఉండదు. దీంతో మొబైల్ ఫోన్లతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావడం కనిపించింది. పోలింగ్ కేంద్రం బయటే పోలీసులు వారిని ఆపేశారు. దాంతో, ఇద్దరిద్దరు వచ్చిన వారు ఒకరి తర్వాత మరొకరు వెళ్లి ఓటు వేశారు. కొంతమంది ఓటు వేయకుండానే తిరిగి వెళ్లిపోయారు. నిజానికి, మొబైల్స్ వంటి వాటిని పోలింగ్ ఏజెంట్లు లేదా సిబ్బంది వద్ద పెట్టి ఓటు వేశాక తిరిగి పొందే సౌకర్యం కల్పించాలి. అలా లేకపోవడంతో చాలామంది ఓటు వేయకుండానే వెనుదిరిగారు. దీనికితోడు ఓట్ల జాబితాలో తీవ్ర గందగోళం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసిన వారి ఓట్లు గల్లంతయ్యాయి. నాలుగైదు ఓట్లు ఒక కుటుంబంలోని వారివి ఒకేచోట కాకుండా వేరు వేరు బూతుల్లోకి మార్చడం, ఓటు వేసేందుకు ఎపిక్ లేదా గుర్తింపు కార్డుతో పోలింగ్ కేంద్రానికి వచ్చినా ఓటు లేకపోవడం, ఏపీ ఓటర్లు ఆంధ్రాకు తరలివెళ్లడం వంటివి జంటనగరాల్లో పోలింగ్ శాతం తగ్గడానికి కారణంగా తెలిసింది.



గౌలిగూడ వాల్మీకి సమాజ్ పోలింగ్ కేంద్రంలోబీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.
నవతెలంగాణ -సుల్తాన్ బజార్



ఆదర్శనగర్ లో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్త దంపతులు.
నవతెలంగాణ -సుల్తాన్ బజార్



నల్లకుంటలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్
నవతెలంగాణ-అంబర్‌పేట



గౌలిగూడలో ఓటు హక్కు వినియోగించుకున్న పీసీసీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్.
నవతెలంగాణ - సుల్తాన్ బజార్



మహబూబ్ గంజ్ అగర్వాల్ భవన్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్త తదితరులు.
నవతెలంగాణ -సుల్తాన్ బజార్

పోలింగ్ సెంటర్ ముందు ఓటర్లు ఆందోళన

- ఓట్లు గల్లంతయ్యాయంటూ ఆరోపణ
- షేక్‌పేట్‌లో ఘటన



నవతెలంగాణ-మెహిదీపట్నం

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని షేక్‌పేట డివిజన్‌లో సక్కుబాయి మెమోరియల్ స్కూల్ పోలింగ్ సెంటర్ వద్ద తమ ఓట్లు గల్లంతయ్యాయని పలువురు ఓటర్లు ఆందోళనకు దిగారు. 20 రోజుల కిందట తాము చెక్ చేసుకుంటే తమ పేర్లు ఓటర్ లిస్ట్‌లో ఉన్నాయని ఇప్పుడు వెళ్తే మాత్రం తమ పేర్లు లిస్టులో లేవని అధికారులు చెబుతున్నారన్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికలలో తాము ఇదే సెంటర్ నుంచి ఓటు వేసామని ఇప్పుడు తమ ఓట్లు ఎలా డిలీట్ అవుతాయని వారు ప్రశ్నించారు. తమ దగ్గర ఓటర్ స్లిప్పులు కూడా ఉన్నాయన్నారు. షేక్‌పేటలో హిందువులు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో మాత్రమే ఇలా ఓట్లు గల్లంతయ్యాయని వారు ఆరోపించారు. తాము ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని దీని వెనుక జీహెచ్ఎంసీ అధికారుల హస్తం ఉందని వారు ఆరోపించారు. తమకు ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై విచారణ చేపడతామని అధికారులు తెలిపారు.



రాష్ట్ర న్యాయమూర్తి విజయ్ సేనా రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్.29లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నవతెలంగాణ-హిమాయత్ నగర్



సికింద్రాబాద్, పాతబస్తీలల్లో పోలింగ్ కేంద్రల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి
నవతెలంగాణ-సిటీబ్యూరో

గోషామాహల్‌లో ఎన్నికలు ప్రశాంతం





నవతెలంగాణ -సుల్తాన్ బజార్

గోషామహల్ నియోజకవర్గంలో సోమవారం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. గన్ ఫౌండ్రి, జాంబాగ్, బేగంబజార్ , గోషామహల్, దత్తాత్రేయ నగర్, మంగళహాట్ డివిజన్ లలో ని 235 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7గంటల నుంచి ఓటర్లు ఓటు వినియోగించు కునేందుకు బారులు తీరారు. వయోవద్ధులు ,వికలాంగులు వీల్ చైర్లల సాయంతో వాలంటరీల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 18 సంవత్సరాల నిండిన యువ ఓటర్లు ఓటు వేయడానికి ఆసక్తి చూపారు. కొంతమంది ఓటర్లు తాము అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేశామని లోకసభ ఎన్నికలు వచ్చేసరికి తమ ఓటు ఓటర్ లిస్టులో లేదంటూ ఓటర్ కార్డు చూపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు వారిని పోలీసులు సముదాయించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీరు లేకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



లోకసభ ఎన్నికల్లో బర్కస్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు సేవలందిస్తున్న అధ్యక్షుడు ఎం సదానంద్, ఎం జై కుమార్ ,శ్యామ్ ప్రసాద్ ,నవీన్ ,బాలరాజ్ ,సందీప్ ,వంశీ ,గోవర్ధన్, విశాల్ ,వై రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ -సుల్తాన్ బజార్



సికింద్రాబాద్‌లో రాచకొండ సీపీ తరుణ్ జోషి తన ఓటు హక్కును వినియోగించున్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



గన్ ఫౌండ్రి డివిజన్ లో ఓటు హక్కు వినియోగించుకున్న స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ దంపతులు.
నవతెలంగాణ -సుల్తాన్ బజార్



ముషీరాబాద్ నియోజకవర్గం లో పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేష్ ముదిరాజ్
నవతెలంగాణ - ముషీరాబాద్



ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి సి కృష్ణ యాదవ్
నవతెలంగాణ-అంబర్‌పేట



నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బందోబస్తును పరిశీలించారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో



ఓటు హక్కు వినియోగించుకున్న అంబర్‌పేట బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి.
నవతెలంగాణ-అంబర్‌పేట

హైదరాబాద్‌లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- జిల్లా ఆర్వో, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని చెప్పారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మలక్‌పేట్, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చంద్రాయన్‌గుట్ట, యాకుత్ పూర, బహాదూర్ పూర, అసెంబ్లీ సెగ్మెంట్‌లలో జరిగిన ఎన్నికల సరళిని ఆయన తన చాంబర్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా మానిటరింగ్ చేస్తూ.. తన దృష్టికి వచ్చిన అంశాలపై అధికారులకు తగు సూచనలు చేస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్‌ను హైదరాబాద్ జనరల్ అబ్జర్వర్ పీఏ శ్రీవిద్య ఉదయం పరిశీలించారు. పోలింగ్ ఉదయం 9 గంటలకు 5.6 శాతం, ఉదయం 11 గంటలకు 10.70 శాతం, మధ్యాహ్నం 1.00గంటలకు 19.37 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 29.47 శాతం సాయంత్రం 5.00 గంటలకు 39.17 శాతం ఓటింగ్ జరిగిందని ఆయన తెలిపారు.

పాతబస్తీలో ప్రశాంతంగా ఎన్నికలు

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

పాతబస్తీలో ఎన్నికలు టెన్షన్ వాతావరణంలో ప్రారంభమై ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చిన్నపాటి చిదురు మదురు సంఘటనలు తప్ప ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఉదయం 7:00 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు మందకోడిగా ప్రారంభమై మధ్యాహ్నం పుంజుకోగా సాయంత్రం ఊపందుకున్నాయి. హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ పోలింగ్ బూత్ ప్రాంతాలలో తిరుగుతూ పోలింగ్ సరళిని పరిశీలించారు. ముఖ్యంగా చాంద్రాయణగుట్ట యాకుత్‌పురా కార్వాన్ బహదూర్‌పూర చార్మినార్ ప్రాంతాలలోని పోలింగ్ సెంటర్లలో బూతులను పరిశీలించారు. బీజేపీ అభ్యర్థి మాధవి లత పోలింగ్ బూత్ ప్రాంతాలను పరిశీలిస్తూ కొందరి మహిళలను బుర్ఖాలు తీయాలంటూ పరిశీలించారు. దాంతో అది వివాదస్పదమైంది. ఆమె మీద కేసు కూడా నమోదైంది. ఇక పోలింగ్ శాతం విషయానికొస్తే గత ఓటింగ్ పర్సంటేజ్ కంటే ఈసారి పోలింగ్ పర్సంటేజ్ చాలా తగ్గిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలియజేశారు.

ఓటేసిన 'మల్కాజిగిరి' అభ్యర్థులు





తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్), వారి సతీమణి యాస్మిన్ ఫర్హానాతో కలిసి బంజారాహిల్స్ రోడ్‌నెం-10లోని ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓటు పాత్ర కీలకం : గౌతమ్ రావు.

నవతెలంగాణ-అంబర్‌పేట

ఓటు హక్కు శక్తివంతమైనదని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు అన్నారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని డీడీ కాలనీలోని బూత్ నెంబర్ 16లో గౌతమ్ రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు పాత్ర కీలకం అన్నారు.





అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్ ఇతర నాయకులు
నవతెలంగాణ-అంబర్‌పేట









బధిరుల స్వరాన్ని కనిపెడుతోంది

సాధారణంగా వినికిడి సమస్య ఉన్న వారికి మాటలు కూడా రావు. అలాంటి వారి స్వరాన్ని కనుగొనేందుకు విశేష కృషి చేస్తున్నది ఐశ్వర్య కర్నాటికి. బధిరుల కోసం ఏదైనా చేయాలనే ఆమె తపనే గ్లోవాట్రిక్స్‌ను స్థాపించేలా చేసింది. వారి కోసం ఏఐ-శక్తితో కూడిన గ్లోవ్‌లను అభివృద్ధి చేసింది. సంకేత భాషను అనువదించడా నికి కృత్రిమ మేధస్సును ఉపయో గించే వినూత్న గ్లోవ్‌లను అభివృద్ధి చేసిన ఆమె పరిచయం నేటి మానవిలో...

ఐశ్వర్య 8వ తరగతి చదువుతున్నప్పుడు తన పాఠశాలలో వికలాంగ పిల్లలకు బోధించడానికి ప్రత్యేక విభాగం ఉండేది. విద్యార్థి మండలిలో భాగంగా ఆమె ప్రతి వారం ఈ పిల్లలతో ముచ్చటించేవారు. ఈ పరస్పర చర్యల సమయంలో సెరిబ్రల్ పాల్సీ, ఆటిజం, లోకోమోటివ్ డిజార్డర్స్ ఉన్న పిల్లలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవచ్చని ఆమె గమనించింది. కానీ చెవిటి పిల్లవాడు మాత్రం ఎవరితోనూ మాట్లాడలేకపోయేవాడు. 'అతని సైగల భాష ఎవరికీ అర్థమయ్యేది కాదు. దాంతో అతను ఎప్పుడూ ఒంటరిగా ఉండేవాడు. అందుకే నేను అతనితో మాట్లాడటానికి సంకేత భాష నేర్చుకోవడం ప్రారంభించాను' అని ఐశ్వర్య అంటున్నారు.

కృత్రిమ మేధస్సుతో...

అప్పటి నుంచి ఐశ్వర్య బధిర సమాజానికి ఏదైనా చేయాలనుకున్నారు. కానీ ఆమె కోరిక నెరవేరింది మాత్రం ఆమె కోరుకున్న 12 ఏండ్ల తర్వాత. ఐశ్వర్య, పరీక్షిత్ సోహోనితో కలిసి 2020లో గ్లోవాట్రిక్స్ అనే సంస్థను స్థాపించారు. ఇది పూణేకి చెందిన స్టార్టప్. ఇది సంకేత భాషను వాయిస్‌లోకి అనువదించడానికి కృత్రిమ మేధస్సును ఉపయోగించే గ్లోవ్‌లను అభివృద్ధి చేసింది. 'మేము చెవిటి, మాట్లాడే లోపము గల వ్యక్తులను సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎందుకంటే వారు తమ భావాలను వ్యక్తపరచగలరని మేము కోరుకుంటున్నాము" అని ఆమె జతచేస్తుంది.

పిలుపుని అనుసరించడం

ఐశ్వర్యకు వ్యాపారం చేయడమంటే చాలా ఇష్టం. కాలేజీలో చదివే రోజుల్లోనే ఆమె డోనట్స్ అమ్మడం వంటి చిన్న వ్యాపారాన్ని నిర్వహించేది. 'నేను 9 టు 5 చేసే ఉద్యోగం కోసం పుట్టలేదని నాకు తెలుసు. నా సొంతంగా ఏదైనా చేయాలనుకుంటున్నాను' అని ఆమె జతచేశారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత ఆమె తన తండ్రితో కలిసి ఎంఏసీజే అనే క్వాలిటీ అస్యూరెన్స్ కంపెనీని ప్రారంభించి తన కలను నెరవేర్చుకుంది. ఈ సంస్థ రియల్ ఎస్టేట్ భవనాల నాణ్యతను తనిఖీ చేసేది. 2018లో సీట్ సెన్సార్ల తయారీలో ఉన్న లక్సెంబర్గ్‌కు చెందిన కంపెనీకి టెస్టింగ్ సెంటర్‌ను ప్రారంభించి, నిర్వహించే బిడ్‌ను కూడా ఆమె గెలుచుకుంది. అయితే ఆ వెంచర్ సవాళ్లను ఎదుర్కొంది. అదే ఏడాది కంపెనీ మూసివేయాల్సి వచ్చింది. అప్పుడే ఆమెకు చిన్నతనంలోని తన కోరిక గుర్తుకొచ్చింది.

నిర్దిష్టమైన ఆలోచన లేదు

ఐశ్వర్య ఎప్పటినుంచో వినికిడి సమస్య ఉన్నవారికి ఏదైనా చేయాలని భావించినా మనసులో నిర్దిష్టమైన ఆలోచన లేదు. ఏడాది తర్వాత 2020లో ఎంబీఏ కోసం సిద్ధమవుతున్నప్పుడు ఒక పార్టీలో సోహోనిని కలుసుకుంది. బధిరుల సంఘం కోసం పని చేయాలనే తన కోరికను పంచుకుంది. ఇద్దరూ కలిసి దాన్ని ప్రారంభించాలనుకున్నారు. 'గ్లోవాట్రిక్స్‌ను ప్రారంభించడం గురించి నాకు సరైన అవగాహన లేదు. కానీ అప్పుడు కోవిడ్ సంభవించింది. దాంతో నేను ఎంబీఏ కోసం విదేశాలకు వెళ్లలేకపోయాను. ఆ సమయాన్ని స్టార్టప్‌లో పెట్టుబడి పెట్టాను' అని ఆమె చెప్పారు.

టెక్నాలజీని స్వీకరించండి

సామాజిక అభివృద్ధి రంగంలో మహిళలు తక్కువ ఉన్నప్పటికీ, ఈ రోజుల్లో మహిళా వ్యవస్థాపకతను పెంచే అవకాశాలు, పథకాలు పుష్కలంగా ఉన్నాయని ఆమె అభిప్రాయ పడ్డారు. అభివృద్ధి చెందుతున్న టెక్ ల్యాండ్ స్కేప్‌ను అంగీకరిస్తూనే ఐశ్వర్య 'టెక్నాలజీని స్వీకరించండి, మీరు దాని నుండి తప్పించుకోలేరు. మిమ్మల్ని మీరు అప్‌డేట్ చేసుకుంటూ ఉండండి. ఎప్పటికీ దాన్ని వదులుకోవద్దు. అనుకున్నది కచ్చితంగా సాధించగలరు అని మిమ్మల్ని మీరు నమ్మండి' అని ఆమె మహిళా పారిశ్రామిక వేత్తలకు చెబుతున్నారు.

మంచి కోసం టెక్

ఐశ్వర్య ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు రిమోట్ కంట్రోల్‌లకు బదులుగా సంజ్ఞ-నియంత్రిత రోబోటిక్ కారులో పనిచేశానని పంచుకున్నారు. ఈ ప్రాజెక్ట్ తన స్టార్టప్‌లో కూడా కీలక పాత్ర పోషించిందని ఆమె చెప్పారు. గ్లోవాట్రిక్స్‌లో వారు ఫిఫ్త్‌సెన్స్‌ను అభివృద్ధి చేశారు. ఇది 3డి స్పేస్‌లో చేతి, వేళ్ల కదలికలను మ్యాప్ చేసే సెన్సార్లతో ఏఐ-ఆధారిత గ్లోవ్ లాంటి పరికరం. కుడివైపు పాయింటర్ వేలుపై వ్యక్తి సంజ్ఞలు చేసినప్పుడు నొక్కాల్సిన బటన్ వుంటుందని ఆమె చెప్పారు. ఇవి అల్గారిథమ్‌ల ద్వారా అమలు చేయబడతాయి. వాటిని వచనంలోకి అనువదిస్తాయి. స్పీకర్ ద్వారా ఇది వాయిస్‌గా మార్చబడుతుంది. అదేవిధంగా ఇది మైక్రోఫోన్‌తో కూడా వస్తుంది. మాట్లాడే పదాలను సంగ్రహిస్తుంది. వినికిడి సమస్య ఉన్నవారి కోసం టెక్స్ట్, ఇమేజ్‌లుగా మారుస్తుంది.



మరిన్ని సంజ్ఞలను జోడిస్తూనే...

'మేము 100 సంజ్ఞల ఆధారంగా 98శాతం కచ్చితత్వాన్ని సాధించాం. మరిన్ని సంజ్ఞలను జోడిస్తూనే ఉన్నందున ఇది పెరుగుతూనే ఉంటుంది. కొంతకాలం తర్వాత మేము ఈ ఉత్పత్తిని బి2బి మార్కెట్‌లో కూడా పరిచయం చేస్తాం. మేము ఇప్పటివరకు ఈక్విటీ ఫ్రీ గ్రాంట్లు, ప్రైస్ మనీలో రూ. 1 కోటి వరకు సేకరించాము' అని ఆమె జతచేస్తున్నారు. స్టార్టప్ దాని ఎనిమిదవ హార్డ్‌వేర్ పునరావృతం, రెండవ యాప్ పునరావృతం చేసింది. ప్రస్తుతం దీని ధర రూ. 20,000. ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్, నిధి ప్రయాస్, బిరాక్ బిగ్ గ్రాంట్ నుండి వీరు నిధులే సేకరించారు. ఇది 'బెస్ట్ ఉమెన్ లీడ్ అసిస్టెంట్ టెక్నాలజీ స్టార్టప్' అవార్డును కూడా గెలుచుకుంది. ■

మహిళా పారిశ్రామిక వేత్తగా సవాళ్లు

పారిశ్రామికవేత్తగా ఐశ్వర్య ప్రయాణంలో సవాళ్లు తప్పలేదు. రియల్ ఎస్టేట్ రంగంలో పురుషుల ఆధిపత్యం ఎక్కువ. ఒక పురుష సివిల్ ఇంజనీర్ కంటే ఫీల్డ్‌లో ఎక్కువ అనుభవం ఉన్నప్పటికీ మహిళ కాబట్టి ఆమె దగ్గర ఆర్డర్లు తీసుకోవడానికి కష్టమర్లు ఇబ్బంది పడేవారని ఐశ్వర్య గుర్తుచేసుకు న్నారు. అదేవిధంగా సేల్స్ కాల్ కోసం ఒక బిల్డర్‌ని కలిసిన మరొక సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. అతను 'తుమారీ ఉమర్ కిత్నీ హై ఉత్నా మేరా తజుర్బా హై. తుమ్ మేరి గల్తీ నికలోగి' (నీ వయసు నా అనుభవం అంత లేదు. నువ్వు నా తప్పును ఎత్తిచూపుతావా) అన్నాడు. 'ఇలాంటి అనుభవాల నుండి ప్రతి ఒక్కరినీ అధిగమిం చడం ద్వారా మాత్రమే గౌరవం పొందగలనని తెలుసుకున్నాను' అని ఆమె జతచేస్తున్నారు.

కరివేపాకుతో ఎన్ని లాభాలో...



మన ఆరోగ్యం మెరుగుపడాలంటే, రోజుని ఆరోగ్యకరమైన రీతిలో ప్రారంభించాలి. దక్షిణ భారత వంటకాల్లో తరచుగా కరివేపాకును వాడుతారు. ఇది చాలా రుచికరమైనది. ప్రతి రోజూ ఉదయాన్నే తాజా కరివేపాకును తినడం వల్ల ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని పోషకాహార నిపుణులు అంటున్నారు. ఖాళీ కడుపుతో కరివేపాకును నమలడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం....

జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచుతుంది: కరివేపాకును ఖాళీ కడుపుతో తింటే జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ఉదయం కరివేపాకును తిన్న తర్వాత, జీర్ణ ఎంజైమ్‌లు ఉత్తేజితమవుతాయి, ప్రేగు కదలికలను సులభతరం చేస్తాయి. ఇది మలబద్ధకం నుంచి ఉపశమనం పొందడంలోనూ సహాయపడుతుంది.

మార్నింగ్ సిక్నెస్ నుండి ఉపశమనం: చాలా మంది ఉదయం నిద్రలేచిన తర్వాత బలహీనత, తలతిరగడం, వాంతులు వంటి సమస్యలు ఎదుర్కొంటారు. అటువంటి పరిస్థితిలో, మీరు కొన్ని కరివేపాకులను నమిలినట్లయితే, మీ జీర్ణక్రియ ఆరోగ్యంగా ఉంటుంది. మార్నింగ్ సిక్నెస్ నుంచి ఉపశమనం పొందుతారు.

బరువు తగ్గడం: మలబద్ధకంతో బాధపడేవారు ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత కరివేపాకు జ్యూస్ తాగాలి, ఎందుకంటే ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. శరీరంలో జీర్ణక్రియ బాగా జరుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. మీరు బరువు, పొట్ట కొవ్వును తగ్గించుకోవచ్చు.

జుట్టుకు మంచిది: కరివేపాకు జుట్టు రాలడాన్ని నిరోధించడంలో సహాయపడుతుంది. ఉదయాన్నే ముందుగా ఒక గ్లాసు నీరు తాగాలి. కొన్ని నిమిషాల తర్వాత కొన్ని తాజా కరివేపాకులను తిని 30 నిమిషాల తర్వాత టిఫిన్ చేయాలి.

పోలింగ్ ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. కొంతమంది నేతలు పోలింగ్ కేంద్రాల్లో దురుసుగా ప్రవర్తించడం, ఓటింగ్ సరళిపై కామెంట్లు చేయడం మినహా ఎలాంటి గొడవలూ జరగలేదు. రీ పోలింగ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. ప్రిసైడింగ్ అధికారులు, పరిశీలకులు ఇచ్చే నివేదికల ఆధారంగా మంగళవారం రీపోలింగ్‌పై ఈసీ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మొరాయించిన ఈవీఎంలు

రాష్ట్ర వ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. వనపర్తి జిల్లా అమరచింత జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్ 228/77లో ఈవీఎంలు మొరాయించాయి. రెండు గంటల పాటు ఈవీఎంలు పని చేయకపోవడంతో వాటిని రీప్లేస్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 100కు పైగా సెంటర్లలో ఈవీఎంలు మొరాయించినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. చిన్న చిన్న సాంకేతిక సమస్యలు తలెత్తిన వాటికి మరమ్మతులు చేయగా, మిగతా వాటిని మార్చడంతో పోలింగ్ సజావుగా సాగిందని పేర్కొంది.

ఎవరి ధీమా వారిదే!

(మొదటిపేజీ తరువాయి)

విశ్లేషించే పనిలో ఆయా పార్టీల నేతలు తలమునకలై ఉన్నారు. ఎన్నికలను పూర్తి ప్రశాంతంగా నిర్వహించడంలో సీఈఓ వికాస్‌రాజ్ సక్సెస్ అయ్యారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తన దృష్టికి వచ్చినా, తక్షణం స్పందిస్తూ, తగిన చర్యలకు ఆదేశాలిస్తూ, ఆయన పూర్తి ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు. అయితే గతంలో మాదిరే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటింగ్ శాతాన్ని పెంచడంలో మాత్రం విఫలమయ్యారు. గ్రేటర్ పరిధిలోని ఏ పోలింగ్ బూత్‌లో కూడా 50 శాతం ఓట్లు పోల్ కాలేదు. సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్ వివరాల ప్రకారం హైదరాబాద్ లోకసభ స్థానంలో అత్యల్పంగా 39.17 శాతం, సికింద్రాబాద్ స్థానంలో 42.48 శాతం మాత్రమే ఓట్లు పోల్ అయ్యాయి. ఓట్ల పండుగ ముగియడంతో ఇప్పటి వరకు హడావిడిగా, టెన్షన్ పడిన అభ్యర్థులు కాస్త రిలీఫ్ ఫీల్ అవుతున్నారు. కుటుంబసభ్యులతో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితాలు వచ్చేవరకు వేచిచూడటం తప్ప వారికీ మరో ప్రత్యామ్నాయం లేని విషయం తెలిసిందే. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటలకు కూడా ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. దీనితో తుది పోలింగ్ శాతం అర్ధరాత్రి 1.30 గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉన్నదని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం తెలిపింది.

నివేదిక తర్వాతే రీపోలింగ్‌పై నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. పోలింగ్ రోజు సీ విజిల్ , 1950, ఎన్‌జీఎస్‌పీ పోర్టల్ ద్వారా 400కు పైగా ఫిర్యాదులు వచ్చినట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించి 38 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా డిసెంబర్ ఒకటి నుంచి ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.330 కోట్ల విలువ చేసే నగదు, బంగారం, ఇతర ఆభరణాలు, డ్రగ్స్, నార్కొటిక్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.



మీరు బొట్టెందుకు పెట్టుకున్నారు?..

- మహిళలపై ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అనుచరుల దౌర్జన్యం
- ఆపకుండా వారికే ఎమ్మెల్యే మద్దతు..

నవతెలంగాణ- ఆదిలాబాద్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు ఆయన అనుచరులు ఓ పోలింగ్ కేంద్రంలోకి కాషాయ కండువాలు ధరించి ప్రవేశించారు. కొంత మంది మహిళలు వారిని అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం కాషాయ కండువా ధరించి పోలింగ్ కేంద్రంలోకి రాకూడదని, ఎందుకు వచ్చారని మహిళా ఓటర్లు ప్రశ్నించారు. 'మీరు బొట్టు కూడా పెట్టుకోవద్దు.. ఎందుకు పెట్టుకున్నారు' అని మహిళా ఓటర్ల పట్ల దురుసుగా ప్రవర్తించారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆ మహిళలను బయటకు పంపండి అంటూ పోలీసులను ఎమ్మెల్యే ఆదేశించడం గమనార్హం. కాషాయ కండువా కప్పుకున్న వారిని బయటకు పంపిస్తేనే తాము కూడా బయటకు వెళ్తామని మహిళలు పోలీసులకు తెగేసి చెప్పారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి..

జైనూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలపై బీజేపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. ఘర్షణలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బీజేపీ కార్యకర్తల దాడిని బీఆర్ఎస్ కార్యకర్తలు నిలువరించారు. ఇరు పార్టీల మధ్య ఘర్షణతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఘర్షణకు దిగిన కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. ఈ దాడిలో మీడియా ప్రతినిధుల సెల్‌ఫోన్లు ధ్వంసమయ్యాయి.

ఉప్పల్‌లో పార్టీ కండువాతో పోలింగ్ బూత్‌లోకి...

మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నాచారం డివిజన్ భవానినగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉప్పల్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పార్టీ కండువాతో పోలింగ్ బూత్ వద్ద బైఠాయించి తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని ఓటర్లను ప్రభావితం చేస్తుండగా.. కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు బీజేపీ నాయకులకు కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. నాచారం పోలీసులు ఇరుగ్రూపులకు సర్దిచెప్పి పంపించారు.

ఓటరుపై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సోదరుడి దాడి

నవతెలంగాణ- జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటు వేయడానికి వచ్చిన ఓటరుపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ సోదరుడు నగేష్ షెట్కార్ దాడికి పాల్పడ్డాడు. అందరూ చూస్తుండగానే ఓటరును కాలితో తన్నాడు. దీనిపై విపక్ష పార్టీలు మండిపడు తున్నాయి. నగేష్‌పై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

మహాలక్ష్మి పథకం కింద రూ.లక్ష

(మొదటిపేజీ తరువాయి)

వల్ల మహిళలు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారని సోమవారం విడుదల చేసిన వీడియో సందేశంలో అన్నారు. అలాంటి వారందరికీ కాంగ్రెస్ హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

"స్వాతంత్ర్య సంగ్రామం మొదలుకొని నేటి ఆధునిక భారత నిర్మాణం వరకు మహిళల కృషి మరువలేనిది. కానీ, ద్రవ్యోల్బణం వల్ల నేడు వారు తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నారు. వారి కష్టానికి న్యాయం చేకూర్చేందుకు కాంగ్రెస్ విప్లవాత్మక గ్యారంటీతో ముందుకొచ్చింది. మహాలక్ష్మి పథకంతో ప్రతి పేద మహిళకు సంవత్సరానికి రూ.1 లక్ష లభిస్తాయి" అని సోనియా గాంధీ హామీ ఇచ్చారు.

తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఇప్పటికే తాము అమలు చేస్తున్న గ్యారంటీల వల్ల అనేక కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని సోనియా పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు, ఆహార భద్రత వంటి విప్లవాత్మక చర్యల ద్వారా కోట్లాది మంది భారతీయులకు కాంగ్రెస్ పార్టీ సాధికారత కల్పించిందన్నారు. మహాలక్ష్మి ద్వారా దాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

ఆ ప్రధానుల ప్రత్యేకత మోడీకి అందేనా!

సోనియా గాంధీ వీడియో సందేశాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు పార్టీ నేతలు తమ 'ఎక్స్' ఖాతాల్లో పోస్ట్ చేశారు. ఒక్క ఓటు విలువ సంవత్సరానికి రూ.లక్షతో సమానమని సోనియా సందేశాన్ని షేర్ చేస్తూ రాహుల్ గాంధీ అన్నారు. "నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న మహిళలకు కాంగ్రెస్ మహాలక్ష్మి పథకం సంజీవనిలా పనిచేయనుంది. ప్రతినెలా ఖాతాల్లో రూ.8,500 జమ అయితే ఆర్థికంగా ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. మీ కుటుంబ భవిష్యత్తును మీరే నిర్దేశించగలరు" అని రాహుల్ రాసుకొచ్చారు.

పెండ్లి చేసుకోక తప్పేలా లేదు

రాయబరేలి: "తాను త్వరలో పెండ్లి చేసుకోక తప్పేలా లేదు" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సరదా వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సోమవారం ప్రియాంకా గాంధీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న జనం రాహుల్ జీ పెండ్లి ఎప్పుడు చేసుకుంటారని ప్రశ్నించగా ఆయన స్పందిస్తూ.. 'నేను పెండ్లి చేసుకోక తప్పేలా లేదు (అబ్ జల్దీ హి కర్నీ పడేగీ)' అని నవ్వుతూ అభివాదం చేశారు. అక్కడే ఉన్న ప్రియాంక గాంధీ సైతం నవ్వుతూ కనిపించారు.

ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విషయం తెలిసిందే. కేరళ వయనాడ్ ఎంపీ స్థానం నుంచి మరోసారి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సిట్టింగ్ ఎంపీ కూడా. అలాగే, కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీలో సైతం బరిలో దిగారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ మొన్నటి వరకు పోటీ చేయగా ఇప్పుడు ఆమె స్థానంలో రాహుల్ గాంధీ పోటీలో ఉన్నారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రచారంలో బీజేపీ, ఎన్డీయే సర్కారు వైఖరిపై ఆయన తీవ్రంగా స్పందించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాయ్‌బరేలీతో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ ఇక్కడి నుంచే పోటీ చేశారన్న రాహుల్.. ఇది తమకు కర్మభూమి లాంటిదని అన్నారు.

దండకారణ్యంలో ఆగని ఎన్‌కౌంటర్లు

నవతెలంగాణ-చర్ల

రాష్ట్ర సరిహద్దు మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా భమ్రాగఢ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఒక మహిళా మావోయిస్టు సహా ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎదురు కాల్పులు జరిగిన ప్రదేశం ఇటు ఛత్తీస్‌గఢ్ అటు మహారాష్ట్ర సరిహద్దుగా పోలీస్ అధికారులు తెలుపుతున్నారు. హతమైన మావోయిస్టుల్లో పెరమిలి దళం కమాండర్ వాసు కూడా ఉన్నట్టు సమాచారం.

14మంది మావోయిస్టుల అరెస్టు

ఛత్తీస్‌గఢ్, బీజాపూర్ జిల్లాలోని గంగుళూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముట్వెండి, పిడియా అటవీ ప్రాంతంలో 14 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు, ప్రచార సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

పేలిన మందుపాతర

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నదికి అవతల ఉన్న బొడ్గా గ్రామంలో బీజీఎల్ (బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్) సెల్ పేలిన ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. గ్రామ సమీపంలోని పొలంలో పిల్లలు ఆడుకుంటూ యూబీజీఎల్‌పై పడటంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాలతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో భైరంగఢ్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఘటన సమాచారం అందిందని, పరిశీలిస్తున్నామని జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లు గ్రామస్తులను తెచ్చి చంపేశారని, వారు మావోయిస్టులు కాదని పౌరసంఘాలు ఆరోపిస్తున్నాయి.

బుర్ఖాలు తొలగించి.. ముస్లిం ఓటర్ల ఐడీ తనిఖీ

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఐపీసీ సెక్షన్లతోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద ఆమెపై మలక్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై మాధవీలత మాట్లాడుతూ.. తాను ఒక అభ్యర్థిని అని చట్ట ప్రకారం ఫేస్‌మాస్క్‌లు లేకుండా ఐడీ కార్డుల వెరిఫికేషన్ చేసే హక్కు అభ్యర్థులకు ఉంటుందన్నారు. వాస్తవానికి ఆ హక్కు పోలింగ్ బూత్ ఆఫీసర్లదే. నిజామాబాద్ జిల్లాలో ముస్లిం మహిళా ఓటర్లు బుర్ఖా ధరించి పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి అభ్యంతరం తెలిపారు. అసలు ఓటు వేయడానికి ఎవరు వచ్చారు..? ఎలా గుర్తిస్తారు..? అని ముస్లిం మహిళా ఓటర్లను ఉద్దేశించి ప్రిసైడింగ్ ఆఫీసర్‌పై అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఏం డ్యూటీ చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ఎన్నికల అధికారులు అభ్యంతరం తెలిపారు.


గురుద్వారాలో మోడీ

(మొదటిపేజీ తరువాయి)

రంజిత్ సింగ్ .. తాకత్ శ్రీ హరిమందర్ జీ గురుద్వారాను నిర్మించారు. గురుగోబింద్ పుట్టిన ఊరు ఇదే. సిక్కు గురువుల్లో ఈయన పదో వ్యక్తి. పాట్నాలో ఆయన 1666లో జన్మించారు. గురుగోబింద్ తన తొలి రోజులను ఇక్కగే గడిపారు. ఆ తర్వాత ఆయన ఆనంద్‌పూర్ సాహిబ్‌కు వెళ్లారు. పాట్నా సాహిబ్ గురుద్వారాలో మోడీ ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత ఆయన వంటశాలకు వెళ్లారు. ఆ తర్వాత లంగర్ సర్వ్ చేశారు. ఇదంతా ఓట్ల కోసమే అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

భారత్ మానవ హక్కుల రికార్డుకు ఎదురు దెబ్బ !

- ఎన్‌హెచ్‌ఆర్‌సికి గుర్తింపు వాయిదా



న్యూఢిల్లీ : భారతదేశ మానవ హక్కుల రికార్డుకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన, జెనీవా కేంద్రంగా పనిచేసే గ్లోబల్ అలయన్స్ ఆఫ్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఇనిస్టిట్యూషన్స్ (జీఏఎన్‌హెచ్‌ఆర్‌ఐ) ఈ ఏడాది జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)కు గుర్తింపు ఇవ్వడాన్ని వాయిదా వేసింది. ఇలా గుర్తింపును వాయిదా వేయడం వరుసగా ఇది రెండో ఏడాది. ఈ నిర్ణయంతో మానవ హక్కుల మండలిలో అలాగే కొన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సంస్థల్లో భారత్ ఓటు వేసే హక్కు ప్రభావితమవుతుంది. మే 1వ తేదీన జరిగిన అక్రిడిటేషన్లపై సబ్ కమిటీ (ఎస్‌సిఎ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కమిటీ తాజా నివేదిక ఇంకా రావాల్సి వుంది. గుర్తింపును వాయిదా వేయాలంటూ సిఫార్సు చేయడానికి పలు కారణాలను గతంలో ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యుల నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, మానవ హక్కుల దర్యాప్తుల పర్యవేక్షకు పోలీసు అధికారులను నియమించారని, కమిటీలో మహిళలు, మైనారిటీల ప్రాతినిధ్యం కొరవడిందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఈ నిర్ణయాన్ని తెలియచేశారని సంబంధిత వర్గాలు ధృవీకరించాయి.

కాశ్మీర్‌లో పోటీకి నై

మూడు స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించని బీజేపీ

ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇక్కడ ఇవే తొలి ఎన్నికలు





- లోయ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం
- ఓడిపోతే ఆర్టికల్ 370 రద్దుపై ప్రతికూల ప్రభావం
- ఈ కారణంగానే పోటీకి కాషాయపార్టీ దూరం
- ఎన్నికల విశ్లేషకులు, నిపుణుల వెల్లడి

న్యూఢిల్లీ : ఆర్టికల్ 370 రద్దు తర్వాత కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకాశ్మీర్‌లో తొలిసారిగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. జమ్మూకాశ్మీర్‌లో మొత్తం ఐదు ఎంపీ స్థానాలుండగా.. అందులో మూడు స్థానాలు బారాముల్లా, శ్రీనగర్, అనంత్‌నాగ్-రాజౌరీలు కాశ్మీర్ లోయలో ఉన్నాయి. అయితే, మే 13న శ్రీనగర్‌లో పోలింగ్‌తో కాశ్మీర్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. లోయలోని మిగతా రెండు స్థానాలకు ఈనెల 20, 25న ఎన్నికలు జరగనున్నాయి.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితి మారిపోయిందనీ, పర్యాటక రంగం వృద్ధిని సాధించిందనీ, వాణిజ్య-వ్యాపారాలు సాఫీగా సాగుతున్నాయనీ, జీ20 వంటి అంతర్జాతీయ సదస్సును ఇక్కడ నిర్వహించగలిగామని కేంద్రంలో ఉన్న అధికార బీజేపీ సర్కారు ఇప్పటి వరకూ చెప్పుకుంటూ వచ్చింది. ఇంత సానుకూల మార్పు వచ్చిందని చెప్పుకుంటున్న కాషాయపార్టీ లోయలోని మూడు స్థానాలకు పోటీ నుంచి దూరంగా ఉండటం గమనార్హం. ఈ మూడు స్థానాలకు అభ్యర్థులను పోటీలో దించకపోవటానికి గల కారణాలు ఏమిటని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

2019లో మోడీ ప్రభుత్వం జమ్మూకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన విషయం విదితమే. అలాగే, జమ్మూకాశ్మీర్‌ను జమ్మూ మరియు కాశ్మీర్, లఢఖ్‌లు అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది కూడా. కొంతమంది విశ్లేషకులు కాశ్మీర్‌లో 2024 ఎన్నికలను ఆ 2019 ఎత్తుగడలపై రెఫరెండంగా భావిస్తున్నారు. ఇలాంటి తరుణంలో లోయలో తమ అభ్యర్థులను బీజేపీ నిలబెట్టకపోవటంపై రాజకీయ వర్గాల్లో చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అంతా సానుకూల మార్పు వచ్చిందన్న బీజేపీ.. పోటీ నుంచి ఎందుకు తప్పించుకున్నదో స్పష్టం చేయాలని విమర్శకులు, విపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఆర్టికల్ 370 రద్దుపై లోయలోని ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారనీ, ఇక్కడున్న మూడు ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తే ఓడిపోవటమేగాక.. డిపాజిట్ రాదనే భయంతోనే బీజేపీ ఇక్కడ తన అభ్యర్థులను బరిలో నిలపలేదని వారు అంటున్నారు. ఒకవేళ తమ అభ్యర్థులు ఓడిపోతే..

ఆర్టికల్ 370 రద్దుపై ప్రజల వ్యతిరేకతగా బీజేపీ ఓటమిని భావించే అవకాశం ఉంటుందన్న భయంతోనే కాషాయపార్టీ వెనకడుగు వేసిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఆర్టికల్ 370 రద్దుపై కాశ్మీర్‌లోయలోని ప్రజలు బీజేపీపై ఇప్పటికీ ఆగ్రహంతోనే ఉన్నారు. ఇక్కడి కాశ్మీరీలు ప్రతిరోజూ ఈ ప్రాంత ప్రత్యేక హోదాను రద్దు చేయటం, ఆ తర్వాత వేలాది మందిని అరెస్టు చేసిన తర్వాత భద్రతాపరమైన అణిచివేతకు ఆదేశించాలన్న బీజేపీ నిర్ణయంపై ఇప్పటికీ కోపాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు.. స్వేచ్ఛను హరించిందనీ, జర్నలిస్టులను అరెస్టు చేయించిందనీ, ఫెడరల్ ప్రభుత్వాన్ని విమర్శించే వార్తా సైట్‌లను మూసివేయించిందనీ, అధిక నిరుద్యోగం, విద్యుత్ కొరత, ప్రాథమిక మౌలిక సదుపాయాల కొరత ఈ ప్రాంతాన్ని పీడిస్తున్నాయని ఇక్కడి ప్రజలు అంటున్నారు. తమ అసంతృప్తి ఈ సారి కాశ్మీర్ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబిస్తుందని కొందరు చెప్తున్నారు. మరికొందరు తాము ఓటు వేయటానికి ఇబ్బంది పడబోమని వెల్లడించారు.

శ్రీనగర్ నుంచి నేషనలిస్ట్ కాన్ఫరెన్స్(ఎన్.సీ) అభ్యర్థిగా ఉన్న సయ్యద్ అగా రుహుల్లా మాట్లాడుతూ.. కాశ్మీరీ ఓటర్లు తమ అసమ్మతిని వ్యక్తీకరించటానికి ఈ ఎన్నికలు ఒక అవకాశమని అన్నారు. 2019 నుంచి రాష్ట్ర శాసనసభ సస్పెండ్ చేయబడినందున ప్రజలు హక్కులు కోల్పోయారని భావిస్తున్నారనీ, కాబట్టి కాశ్మీరీలకు స్థానిక ప్రభుత్వం లేదని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు.

కాశ్మీరీలు తమ భూమి, సంస్కృతిపై దాడి జరుగుతున్నదని భయపడుతున్నారు. ఆర్టికల్ 370 కాశ్మీర్‌లో భూమిని కొనుగోలు చేయకుండా, స్థిరపడకుండా బయటి వ్యక్తులను నిరోధించింది. అయితే ప్రస్తుతం ఆ రక్షణ పోయిందనీ, బీజేపీ ఈ ప్రాంతంలో జనాభా మార్పును చేయటానికి ప్రయత్నిస్తున్నదని స్థానికులు చాలా మంది అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. "కాశ్మీర్‌లో పోటీ చేస్తే, ఎన్నికలు ఆర్టికల్ 370పై ప్రజాభిప్రాయ సేకరణగా మారుతాయనీ, అది పార్టీని ఇబ్బందికర స్థితిలోకి నెట్టివేస్తుందని బీజేపీకి తెలుసు" అని కాశ్మీర్‌లోని రాజకీయ విశ్లేషకుడు ముహమ్మద్ తెలిపారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా గతనెలలో జమ్మూలో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ.. బీజేపీ ప్రజల హృదయాలను గెలుచుకోవాలని కోరుకుంటున్నదనీ, లోయలోనూ 'కమలం వికసించటానికి' తొందరేమీ లేదని అన్నారు. బీజేపీ 1996లో పోటీ చేయటం ప్రారంభించినప్పటి నుంచి శ్రీనగర్, బారాముల్లా, అనంతనాగ్-రాజౌరీ మూడు కాశ్మీర్ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేదు. శ్రీనగర్‌లో మే 13న, బారాముల్లా మే 20న, అనంత్‌నాగ్-రాజౌరీ మే 25న ఎన్నికలకు వెళ్లనున్నది. మొన్నటి వరకు కాశ్మీర్‌లో బీజేపీ పోటీ చేస్తుందని అంతా భావించారు. రెండు నెలల క్రితం జాతీయ ఎన్నికల ప్రకటనకు రోజుల ముందు, 2019 ఆర్టికల్ 370 రద్దు తర్వాత మొదటిసారిగా మోడీ ఈ ప్రాంతంలోని అతిపెద్ద నగరమైన శ్రీనగర్‌ను సందర్శించారు. మీ హృదయాలను గెలుచుకోవటానికి నేను తీవ్రంగా కృషి చేస్తున్నాననీ, ఆ ప్రయత్నం కొనసాగుతుందని చెప్పారు. అయినప్పటికీ, కాశ్మీర్‌లో పోటీ చేసే సాహసాన్ని మోడీ కూడా చేయలేకపోతున్నారని రాజకీయ నాయకులు అంటున్నారు.

ఈ ప్రాంతం భారత్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి ఎక్కువ కాలం పాలక పక్షంగా ఎన్‌సీ, పీడీపీలు కాశ్మీర్ లోయలో ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీలు జమ్మూలో ప్రభావాన్ని కలిగి ఉన్నాయి. ఎన్‌సీ, పీడీపీలు బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే)ని సవాలు చేస్తున్న కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగం. అయినప్పటికీ, ఈ రెండు ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు కాశ్మీర్‌లో పరస్పరం పోటీ పడుతుండటం గమనార్హం. కాశ్మీర్‌లో ఉన్న మరో రెండు పార్టీలైన అప్నీ పార్టీ, పీపుల్స్ కాన్ఫరెన్స్‌లు బీజేపీకి పరోక్షంగా మిత్రపక్షంగా ఉన్నాయని వాదనలు ఉన్నాయి. అయితే, ఆ రెండు పార్టీలు మాత్రం ఈ వాదనలను ఖండించాయి.

ఇండియా వేదిక గెలుపుతో విముక్తి

జూన్ 5న జైలు నుంచి బయటకు వస్తా..!

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా వేదిక గెలిస్తే.. తాను జూన్ 5న తీహార్ జైలు నుంచి విడుదలవుతానని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ అమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్లనుద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మద్యం స్కాం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. మళ్లీ జూన్ 2న లొంగిపోవాలని సూచించిన విషయమూ తెలిసిందే.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తీహార్‌లోని తన సెల్‌లో రెండు సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. ఫీడ్‌ను 13 మంది అధికారులు పర్యవేక్షించారు. సీసీటీవీ ఫీడ్‌ను పీఎంవోకు సైతం అందించారు. మోడీ సైతం పర్యవేక్షిస్తున్నారు. ఆయనకు తనపై ఎలాంటి పగ ఉందో నాకు తెలియదు. బాత్‌రూమ్‌కి వెళ్లడానికి నేను రాత్రి ఏ సమయానికి లేస్తానో కూడా వారు పర్యవేక్షించే వారు' అని అన్నారు. కేజ్రీవాల్ డిప్రెషన్‌లో లేరని తెలిపారు. జూన్ 2న తాను తిరిగి జైలుకు వెళ్లినా ... జూన్ 4న వెలువడే ఫలితాలలో ఇండియా కూటమి గెలిస్తేనే 5న మళ్లీ బయటకు వస్తానని అన్నారు.

కాంగ్రెస్‌కు టెంపోలో డబ్బులు పంపారా!

అదానీ, అంబానీలను అరెస్ట్ చేయండి : మల్లికార్జున్ ఖర్గే



న్యూఢిల్లీ: అదానీ, అంబానీల నుంచి కాంగ్రెస్‌కు టెంపోల నిండా డబ్బులు అంది ఉంటాయన్న ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తిప్పికొట్టారు. ధైర్యవంతమైన బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలను ఎందుకు అరెస్టు చేయలేదు? అని ప్రశ్నించారు. అలాగే 'మీరు హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేశారు. అదానీ, అంబానీలను ఎందుకు అరెస్టు చేయడం లేదు' అని మల్లికార్జున్ ఖర్గే అన్నట్లు పీటీఐ వార్తా సంస్థ సైతం పేర్కొంది.కాగా, ప్రధాని మోడీ ప్రభుత్వం పాలసీలు రూపొందించినప్పుడు అదానీ సహా కొంత మంది పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరించిందని రాహుల్ గాంధీ విమర్శిం చారు. రైతుల సంక్షేమాన్ని ఫణంగా పెట్టి పారిశ్రామికవేత్తల రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని గతంలోనే ఆరోపించారు. మరోవైపు ఇటీవల తెలంగాణాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా రాహుల్ గాంధీపై మోడీ విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్ యువరా జు ఐదేండ్లుగా పదే పదే ఒక విషయం చెబుతున్నారు. రాఫెల్ ఇష్యూ తెరుమరుగ య్యాక ఐదుగురు పారిశ్రామిక వేత్తలను, ముఖ్యంగా అంబానీ, అదానీలను లక్ష్యంగా చేసుకున్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే వారిపై దాడులు చేయడం మానేశారు. కాంగ్రెస్‌కు టెంపో లోడ్లు (కరెన్సీ) చేరాయా? అని నేను అడగాలనుకుంటున్నా. రాత్రికి రాత్రే అంబానీ, అదానీపై యువరాజు ఆరోపణలు ఆగిపోవడానికి ఏ డీల్ జరిగింది' అని మోడీ ప్రశ్నించారు.

ఈవీఎంలు భద్రపరిచే చోట సీసీటీవీలు ఆఫ్

ఏదో తప్పు జరిగింది : సుప్రియా సూలే



ముంబై: " ఈవీఎంలు భద్రపరిచిన గోదాంలో 45 నిమిషాలపాటు సీసీటీవీలు ఆపేశారు " అని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ కుమార్తె, బారామతి లోక్‌సభ అభ్యర్థి సుప్రియా సూలే ఆరోపించారు. లోపల ఏదో తప్పు జరిగిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ రెబల్ నేత అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ బీజేపీ అభ్యర్థిగా సుప్రియా సూలేపై పోటీ చేసింది. మే 7న మూడో దశ పోలింగ్‌లో భాగంగా బారామతితోపాటు ఇతర నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. నాటి నుంచి ఈవీఎంలను బారామతిలోని ఎఫ్‌సీఐ గోదాంలో భద్రపరిచారు. కాగా ఈవీఎంల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీటీవీలు సోమవారం ఉదయం 10.30 నుంచి 11.15 వరకు సుమారు 45 నిమిషాలపాటు ఆఫ్ అయ్యాయని సుప్రియా సూలే తెలిపారు. అక్కడ ఉన్న తమ సిబ్బంది ఎన్నికల అధికారులు, పోలీసుల దష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరిచిన గోదాం లోపల ఏదో తప్పు జరిగి ఉంటుందని సుప్రియా సూలే అనుమానం వ్యక్తం చేశారు. ఎక్స్‌లో పోస్ట్ ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు. సీసీటీవీలు ఆఫైన వీడియో క్లిప్ కూడా ఆమె షేర్ చేశారు.



కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కన్నప్ప సందడి

విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రాన్ని ఈనెల 20న కేన్స్‌లో జరగనున్న ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప'గా ఆవిష్కరించనున్నారు. 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప' కేవలం సినిమా కాదు.. ఇది ఒక సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ కానుంది. కథను చెప్పే విధానాన్ని పునర్నిర్వచించబోతోంది. ఇక రెడ్ కార్పెట్ మీద ఈ సినిమా రాక కోసం అందరూ చూస్తుండగా.. ఇప్పటికే ఈ మూవీపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. విష్ణు మంచు తన టీంతో కలిసి తెలుగు చిత్రసీమలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదికగా నిలిచేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీజర్‌ను ఆవిష్కరించడం మాకు చాలా ఆనందంగా ఉంది. ప్రపంచ ప్రేక్షకులకు మేం ఎంతో ఇష్టంగా రూపొందించిన కన్నప్పను ప్రదర్శించడానికి కేన్స్ అనువైన వేదికగా ఉపయోగపడుతుంది. మన భారతీయ చరిత్రను ప్రపంచ వేదికపైకి తీసుకురావడం, మన కథలు, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు తెలియజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం' అని అని విష్ణు మంచు ట్వీట్ వేశారు. ఈ సినిమా షూటిర్ శరవేగంగా జరుగుతోంది. అక్షయ్ కుమార్, మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్‌కుమార్ వంటి హేమాహేమీలు ఇప్పటికే తమ పాత్రలకు సంబంధించి చిత్రీకరణను పూర్తి చేసుకున్నారు. తాజాగా హీరో ప్రభాస్ సెట్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రాన్ని మోహన్ బాబు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శివుని భక్తుడైన భక్త కన్నప్ప అచంచలమైన భక్తిని, విశ్వాసాన్ని చూపించబోతున్నారు.

హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ షెల్డన్ చౌ, యాక్షన్ డైరెక్టర్ కెచా ఖంపక్ ఈ చిత్రానికి పని చేయటం విశేషం.

నవచిత్రం

భారీ సెట్‌లో వీర ధీర శూరన్



విక్రమ్ హీరోగా హెచ్.ఆర్.పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్న చిత్రం 'వీర ధీర శూరన్'. విక్రమ్ 62వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది.

రీసెంట్‌గా విడుదలైన టైటిల్, టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. తెన్ కాశీలో భారీ సెట్ వేసి సినిమాను పూర్తి చేస్తున్నారు మేకర్స్. ఇప్పటి వరకు చేయనటువంటి డిఫరెంట్ రోల్‌లో విక్రమ్ అలరించబోతున్నారు. ఆయన లుక్ మాస్, రగ్డ్‌గా ఉంది. సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి అంచనాలు పెరుగుతున్నాయి. సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా!. అని అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో కాళి పాత్రలో విక్రమ్ అందరినీ మెప్పించడానికి రెడీ అవుతున్నారు. విక్రమ్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్ధికీతో పాటు ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

హరోం హర రిలీజ్‌కి రెడీ


సుధీర్‌బాబు

హీరో సుధీర్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'హరోం హర' మేకర్స్ 'మురుగడి మాయ' అనే కొత్త పాటను విడుదల చేశారు. టైటిల్ సూచించినట్లుగా, ప్రపంచంలో జరిగే ప్రతిచర్యకు కారణమైన మురుగన్ శక్తిని ఈ పాట నిర్వచిస్తుంది. చైతన్ భరద్వాజ్ స్కోర్ చేసిన ఈ మెస్మరైజింగ్ నెంబర్ సుధీర్ బాబు, సునీల్ స్నేహాన్ని చూపుతుంది. రఘు కుంచె ఈ పాటను అద్భుతంగా పాడారు. భరద్వాజ పాత్రుడు కుప్పం యాసలో ఆకట్టుకునే లిరిక్స్ రాశారు. ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో 1989లో జరిగిన ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో మాళవిక శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆటలు

ఐపీఎల్‌లో నేడు
ఢిల్లీ X లక్నో
వేదిక : ఢిల్లీ , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

వర్షం అడ్డంకి

- కోల్‌కతా..గుజరాత్ మ్యాచ్ రద్దు
- ప్లే ఆఫ్ నుంచి గుజరాత్ ఔట్





పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
కోల్‌కతా	12	9	3	18	1.42
రాజస్తాన్	12	8	4	16	0.34
చెన్నై	13	7	6	14	0.52
సన్‌రైజర్స్	12	7	5	14	0.40
బెంగళూరు	13	6	7	12	0.38
ఢిల్లీ క్యాపిటల్స్	13	6	7	12	-0.48
లక్నో	12	6	6	12	-0.76
గుజరాత్	12	5	7	10	-1.32
ముంబయి	13	4	9	8	-0.27
పంజాబ్‌కింగ్స్	12	4	8	8	-0.42

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

చిరాగ్-సాత్విక్‌పైనే ఆశలు

నేటినుంచి థాయ్‌లాండ్ ఓపెన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఒలింపిక్స్‌కు ముందు భారత షట్లర్లు ఆడే చివరి బ్యాడ్మింటన్ టోర్నీ ఇదే. ఈ క్రమంలో భారత స్టార్ డబుల్స్ ఆటగాలు చిరాగ్‌శెట్టి-సాత్విక్ సాయిరాజ్ టైటిల్ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. టైటిల్ నెగ్గిన ఉత్సాహంతో ఒలింపిక్స్‌కు సన్నద్ధం కావాలని భారత డబుల్స్ ద్వయం ఆశిస్తున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ ఛాంపియన్, ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గిన హెచ్ఎస్ ప్రణయ్‌పైనా భారీ ఆశలున్నాయి. అలాగే కిరణ్ జార్జి, సతీష్ కుమార్, లక్ష్యసేన్‌తోపాటు మహిళల సింగిల్స్‌లో పివి సింధు ఈ టోర్నీకి దూరం కావడంతో అస్మిత్ ఛాలీహా సింగిల్స్ బరిలో నిలిచింది. కిరణ్ తొలి రౌండ్‌లో చైనాకు చెందిన వెంగ్-హాంగ్-యంగ్‌తో, సతీష్ క్వాలిఫయర్‌తో తలపడనున్నారు. ఇక మహిళల డబుల్స్‌లో 4వ సీడ్ భారత షట్లర్లు తానీషా కాస్ట్రో,-అశ్విని పొన్నప్ప బరిలోకి దిగనున్నారు.



ఈషా, మనుకు పారిస్ ఒలింపిక్ బెర్తులు

- పురుషుల విభాగంలో మరో ఇద్దరు కూడా..
- ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్



భోపాల్: పారిస్ ఒలింపిక్స్‌కు మరో ఇద్దరు భారత షూటర్లు అర్హత సాధించారు. ఎంపి షూటింగ్ ఆకాడమీలో జరిగిన 25మీ. మహిళల పిస్టల్ విభాగంలో ఈ రెండు బెర్తులు భారత్‌కు దక్కాయి. సోమవారం జరిగిన 25మీ. మహిళల పిస్టల్ విభాగంలో ఈషా సింగ్, మను బకర్‌తోపాటు అనీష్ భన్వాలా, విజయ్ వీర్ సింగ్‌లు కూడా ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. మహిళల 25మీ. పిస్టల్ విభాగంలో ఇషా అత్యుత్తమ ప్రదర్శనను కనబర్చి ఒఎస్‌టి టి-3లో 43పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇక మను 40పాయింట్లతో రెండోస్థానంలో, రిథమ్ సాంగ్వాన్ మూడోస్థానంలో నిలిచారు. ఇక పురుషుల 25మీ. పిస్టల్ కేటగిరీలో అనీష్ భన్వాలా, ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో విజయ్ వీర్ సింగ్ మొత్తం 36పాయింట్లతో ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

భారత్‌కు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దెబ్బ

- ఎగుమతుల కంటే దిగుమతుల వృద్ధి ఎక్కువ
- విదేశీ సరకుల రాకలో 38 శాతం పెరుగుదల
- ఎగుమతుల్లో మాత్రం 14 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారత ఆర్థిక వ్యవస్థకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఎగుమతుల్లో వృద్ధి తక్కువగా ఉండగా.. మరోవైపు ఇబ్బడిమబ్బడిగా దిగుమతులు పెరిగాయి. గడిచిన ఐదేళ్లలో ఎగుమతుల వృద్ధి కంటే దిగుమతులు రెట్టింపు అయ్యాయి. గడిచిన 2019-24 ఆర్థిక సంవత్సరాల్లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) భాగస్వామ్య దేశాల నుండి భారత్‌కు వస్తు దిగుమతులు 38 శాతం పెరిగాయి. భారత్‌తో ఎఫ్‌టిఎ కలిగిన యుఎఇ, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాల నుంచి 2023-24లో 187.92 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్‌ఐ) సంస్థ వెల్లడించింది. 2018-19 నాటికి ఈ దిగుమతులు 136.20 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మరోవైపు ఎఫ్‌టిఎ భాగస్వామ్య దేశాలకు భారత ఎగుమతులు 2023-24లో 14.48 శాతం మాత్రమే పెరిగి 122.72 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2018-19లో 107.20 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. ఈ పరిణామాలతో మోడీ హయంలోని బిజెపి సర్కార్ పలు దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎ) ఆర్థిక వ్యవస్థకు చేటు చేస్తున్నాయని స్పష్టమవుతోంది.

జిటిఆర్‌ఐ రిపోర్ట్ ప్రకారం.. 2023-24లో యుఎఇకి ఎగుమతులు 18.25 శాతం పెరిగి 35.63 బిలియన్లుగా నమోదయ్యాయి. ఇవి 2018-19లో 30.13 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. కాగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో దిగుమతులు 2018-19లో 29.79 బిలియన్లుగా ఉండగా.. 2023-24లో 61.21 శాతం ఎగిసి 48.02 బిలియన్లకు చేరాయి. యుఎఇతో 2022లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఆస్ట్రేలియాతో 2022 డిసెంబర్‌లో ఒప్పందం కుదిరింది. ఆ దేశానికి 2018-19లో 3.52 బిలియన్ డాలర్ల ఎగుమతులు ఉండగా.. 2023-24లో 7.94 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. అదే సమయంలో దిగుమతులు 13.13 బిలియన్లుగా ఉండగా.. 23.06 శాతం పెరిగి 16.16 బిలియన్లగా నమోదయ్యాయి. ఆగ్నేయాసియా 10 దేశాల కూటమి ఆసియన్ బ్లాక్‌కు 2018-19లో 37.47 బిలియన్ల ఎగుమతులు జరగ్గా.. గత ఆర్థిక సంవత్సరంలో సుమారు 10 శాతం పెరిగి 41.21 బిలియన్లకు చేరుకున్నాయి. దిగుమతులు 34.3 శాతం పెరిగి 59.32 బిలియన్ డాలర్ల నుంచి 79.67 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో దక్షిణ కొరియాకు భారత ఎగుమతులు 36.38 శాతం పెరిగి 4.71 బిలియన్ల నుండి 6.42 బిలియన్లకు చేరాయి. దిగుమతులు 26.12 శాతం పెరిగి 16.76 బిలియన్ల నుండి 21.14 బిలియన్లకు చేరుకున్నాయి. భారత్- దక్షిణ కొరియా మధ్య 2011లో ఎఫ్‌టిఎ అమల్లోకి వచ్చింది. జపాన్‌కు ఎగుమతులు 6.06 శాతం స్వల్పంగా పెరిగాయి. 2018-19లో 4.86 బిలియన్లుగా ఉండగా.. 2023-24లో 5.16 బిలియన్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 38.56 శాతం పెరిగి 12.77 బిలియన్ల నుండి 17.70 బిలియన్లకు చేరుకున్నాయి. భారతదేశం-జపాన్ ఎఫ్‌టిఎ 2011లో అమలు చేయబడింది. "ఈ గణంకాలు భారతదేశ ఎఫ్‌టిఎ గ్లోబల్ వాణిజ్య తీరుతెన్నులను ప్రదర్శిస్తుంది." అని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ డేటా పేర్కొంది.

ఎగుమతుల్లో 17వ స్థానం..

ప్రపంచ వాణిజ్యంలో స్థూల ఎగుమతుల్లో 1.8 శాతం వాటాతో భారత్ 17వ స్థానంలో ఉంది. అత్యధిక దిగుమతుల విషయంలో ప్రపంచ వాణిజ్యంలో 2.8 శాతం వాటాతో 8వ స్థానంలో ఉంది. 2023-24లో భారతదేశ స్థూల సరుకుల ఎగుమతులు 3.11 శాతం తగ్గి 437.1 బిలియన్ డాలర్లకు చేరుకోగా.. దిగుమతులు 5.4 శాతం తగ్గి 677.2 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి.

కింగ్స్ కార్నర్‌స్టోన్ కాలేజీతో ఆర్ఎంఐటీ వర్సిటీ జట్టు

హైదరాబాద్ : కింగ్స్ కార్నర్‌స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజీతో ఆర్ఎంఐటి వర్సిటీ భాగస్వామ్యం చేసుకున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆ విద్యా సంస్థల ప్రతినిధులు ప్రొఫెసర్ అభిజిత్ మణి, నికోల్ ఆర్విన్, ప్రొఫెసర్ రాజారామన్ ఏరి ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ ఉన్నత విద్యా ప్రయాణం కోసం భారతదేశం నుండి ఆస్ట్రేలియాకు సజావుగా వెళ్లడానికి వీలు కల్పిస్తున్నామన్నారు. రెండు సంస్థలు ఢిల్లీలోని ఆస్ట్రేలియన్ హైకమిషన్‌లో 2016లో ఆస్ట్రేలియన్ బదిలీ కార్యక్రమానికి సహకరించడానికి ఒక ఒప్పందంపై సంతకం చేశాయన్నారు. విద్యార్థులకు అసమానమైన విద్యావకాశాలను అందించే లక్ష్యంతో ఈ ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేశామన్నారు. విద్యాపరంగా వృత్తిపరంగా విద్యార్థుల విజయాన్ని పెంపొందించడంలో ఆర్ఎంఐటి నిబద్ధత కలిగి ఉందన్నారు.

హిమాయత్‌నగర్‌లో వీఎల్‌సీసీ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : వెల్నెస్ అండ్ బ్యూటీ సేవల సంస్థ వీఎల్‌సిసి హిమాయత్ నగర్లో తన నూతన కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. శాశ్వత కొవ్వు తగ్గింపు కోసం విప్లవాత్మక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక యాంటీ ఏజింగ్ స్కిన్ లేజర్ చికిత్సలు, కండరాల టోనింగ్, బిల్డింగ్ కోసం అధునాతన యంత్రాలతో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ సెంటర్‌లో నిపుణులచే సమగ్ర వెల్ నెస్ సొల్యూషన్స్, కూల్ ట్రిమ్, ఎం టోన్, ఇతర సృజనాత్మక కొవ్వు నష్ట పరిష్కారాలను అందిస్తుందని వెల్లడించింది.

జొమాటోకు రూ.175 కోట్ల లాభాలు

ముంబయి : ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.175 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.188 కోట్ల నష్టాలు చవి చూసింది. గడిచిన త్రైమాసికంలో సంస్థ ఫుడ్ డెలివరీ వ్యాపారం స్థూల ఆర్డర్ విలువ (జిఒవి) 28 శాతం పెరిగి రూ.8,439 కోట్లుగా నమోదయ్యింది. కాగా.. 2023-24లో మొత్తంగా రూ.351 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం 2022-23లో రూ.971 కోట్ల నష్టాలు నమోదు చేసింది. గడిచిన మార్చి త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ రూ.3,562 కోట్లకు చేరింది. 2022-23 ఇదే త్రైమాసికంలో రూ.2,056 కోట్లుగా ఉంది.

భారీ నష్టాల్లోంచి.. తుదకు లాభాలు..

- సెన్సెక్స్ 112 పాయింట్ల ర్యాలీ



ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో బిఎస్ఇ సెన్సెక్స్ తుదకు 112 పాయింట్ల లాభంతో 72,776 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 49 పాయింట్లు రాణించి 22,104కు చేరింది. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం తర్వాత పుంజుకున్నాయి. ఉదయం 72,477 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. ఓ దశలో 71,866 కనిష్టాన్ని తాకింది. ఇంట్రాడే కనిష్టాల నుంచి సెన్సెక్స్ 910 పాయింట్ల మేర పుంజుకోవడం విశేషం. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, టిసిఎస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి.

లౌకికవాదంపై చిన్నచూపు

- మోడీ పాలనలో మైనారిటీలపై అడుగడుగునా వివక్ష
- విద్వేష ప్రసంగాలతో అర్థం లేని ఆరోపణలు
- సమాజంలోనూ స్పందన కరువు

న్యూఢిల్లీ : అత్యంత దుర్బలులకు వ్యతిరేకంగా శక్తివంతులైన వారు ప్రదర్శించే క్రూరత్వం, అన్యాయంపై ఆగ్రహం వ్యక్తం చేయడానికి ఫ్రాన్స్‌లో 'జే అక్యూజ్' (నేను ఆరోపిస్తున్నాను) అనే పదాన్ని వాడతారు. గూఢచర్యానికి పాల్పడుతున్నాడన్న ఆరోపణపై ఫ్రాన్స్‌లో ఆల్ఫ్రెడ్ డేఫస్ అనే సైనికాధికారిని ప్రభుత్వం దోషిగా నిర్ధారించింది. అయితే యూదు జాతీయుడైన డేఫస్‌ను అన్యాయంగా కేసులో ఇరికించి శిక్షించారని భావించిన జోలా అనే పాత్రికేయుడు అతనిని కాపాడేందుకు ఎంతో ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో జోకాకు జైలు శిక్ష కూడా పడింది. అయితే ఇంగ్లండ్ పారిపోయిన జోలా, ఆ శిక్ష నుండి తప్పించుకోగలిగాడు. ఏదేమైనా అతని జోక్యం కారణంగానే చివరికి డేఫస్ నిర్దోషిగా బయటపడ్డాడు.



సమాజంలో స్పందన లేదు

ఒక వ్యక్తిపై అన్యాయంగా నేరం మోపితే, ప్రపంచవ్యాప్తంగా నిరసన వ్యక్తం కావడం ఇప్పుడు హాస్యాస్పదంగా అనిపించవచ్చు. ప్రపంచంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దాష్టీకాలు, క్రూరత్వాలపై మానవ సమాజం ఏ మాత్రం స్పందించకపోవడంతో అది సున్నితత్వాన్ని కోల్పోయింది. పాలస్తీనాలో మారణహోమం జరుగుతుంటే సమాజం కేవలం సానుభూతి చూపిందే తప్ప ఆక్రమణదారులను నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇప్పుడు మన దేశంలో జరుగుతున్నది ఏమిటి? సమాజం అణచివేతకు, వివక్షకు గురైనప్పుడు, ద్వేషాన్ని నింపుకున్న ఓ వ్యక్తి జారీ చేసే ఆజ్ఞలను పాటించేందుకు న్యాయ సాధనాలు సాగిలబడినప్పుడు మనలో కదలిక లేదు. మేధావులు తటస్థులుగా ఉండిపోయారు. దీనిని ఎవరైనా ప్రశ్నిస్తే సుదీర్ఘమైన నిర్బంధాలు తప్పడం లేదు. ప్రేమ యొక్క శక్తిని గురించి మహాత్మా గాంధీ మనకు బోధించారు. కానీ ప్రధాని మాత్రం ద్వేషం ఎంత శక్తివంతమైనదో మనకు చూపించారు.

లౌకికవాదంపై చులకన

మోడీ హిందుత్వను ఆచరిస్తారు. ఆ సిద్ధాంతం ముస్లిం, క్రైస్తవ వ్యతిరేకతను బోధిస్తుంది. మోడీ మాదిరిగా వీర్ సావర్కార్ కూడా ముస్లిం సమాజాన్ని ద్వేషించారు. వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్ జోషీ కూడా హిందుత్వ వాదులే. అయితే మోడీ వచ్చిన తర్వాత హిందుత్వను మరింత ముందుకు తెచ్చి దానిని జాతి మనస్తత్వానికి కేంద్రంగా మార్చేశారు. ఈ ప్రక్రియలో లౌకికవాదం, సమానత్వం, సోదరభావం పట్ల మన కట్టుబాటును నిర్వీర్యం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మోడీ ఏమన్నారంటే ...30 సంవత్సరాలుగా ఈ నాటకాన్ని మనం చూస్తూనే ఉన్నాం. లౌకికవాదం అనే ట్యాగ్ ధరించడం ఇప్పుడు ఫ్యాషన్ అయింది. ఈ ఎన్నికల్లో లౌకికవాద ముసుగు వేసుకొని దేశాన్ని మోసం చేసే దమ్ము ఏ ఒక్క పార్టీకీ లేదు. వారు ముసుగులు తీసేశారు...అని చెప్పారు. లౌకికవాదాన్ని ఓ నాటకంగా కొట్టిపారేయడం ద్వారా మన బహుళ సాంస్కృతిక తత్వానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాన్ని మోడీ అపహాస్యం చేశారు.

విద్వేష రాగం

పది సంవత్సరాల పాలనలో మోడీ విద్వేష రాగాన్నే ఆలపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ ధోరణి మరింత మితిమీరింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని అర్థం లేని ఆరోపణలు సంధిస్తున్నారు. వారిని చొరబాటుదారులుగా, అధిక సంతతికి జన్మనిచ్చే వారిగా తూలనాడుతున్నారు. మతపరమైన ముస్లిం తీవ్రవాదానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. 'ఓట్ జిహాద్'కు తప్పుడు అర్థాన్ని ఇస్తున్నారు.

మైనారిటీలపై వివక్ష ఎందుకు?

మోడీ నోటి వెంట అనేక వైవిధ్యభరితమైన పదాలు వెలువడుతుంటాయి. ప్రజలను మభ్యపెట్టడానికి ఆయన అనేక తెలివైన పదాలు ప్రయోగిస్తుంటారు. ఉదాహరణకు లౌకికవాదంపై ఆయన ఏమన్నారో చూడండి...అందరికీ న్యాయం జరుగుతుంది తప్ప శాంతి లభించదు. అదే లౌకికవాదం. అది సంక్షేమ పథకాల సంకుచిత చట్రంలో చిక్కుకుపోయింది. ప్రభుత్వ పథకాలకు వివక్ష ఉండదు. కులం, మతం చూడకుండా అవి పంపిణీ అవుతాయి...ఇదీ లౌకికతత్వానికి ప్రధాని ఇచ్చిన నిర్వచనం. మరి అలాంటప్పుడు ముస్లిం మైనారిటీల విషయంలో వివక్ష చూపడం ఎందుకు? పౌరసత్వ సవరణ చట్టం అమలు ద్వారా కేంద్రం ముస్లింల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే.

అసెంబ్లీకి, లోక్‌సభలకు మధ్య భారీ తేడా

- ఉత్సాహం తక్కువే
- మధ్యాహ్నానికి పుంజుకున్న పోలింగ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



రాష్ట్రంలో తాజా లోక్‌సభ ఎన్నికలు, గత అసెంబ్లీ ఎన్నికలకు మధ్య భారీ తేడా కనిపిస్తున్నది. పోలింగ్ బూత్‌లకు ఓటర్లు రావడానికే చాలా ఆలస్యం చేశారు. మధ్యాహ్నానికి ఒకింత పోలింగ్ పుంజుకుంది. సోమవారం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్కడక్కడా కొన్ని పోలింగ్ స్టేషన్లు బోసిపోయి కనిపించాయి. ఒక్కో లోక్‌సభ స్థానంలో లక్షల మంది ఓటర్లు ఉంటారు. కానీ, పోలింగ్ సందర్భంగా బూత్‌లు పరిశీలిస్తే క్యూలైన్లు కొన్ని చోట్ల భారీగా ఉండగా, మరికొన్ని చోట్ల స్వల్పంగా కనిపించాయి. ఈ సారి మహిళల సంఖ్య కొంత పలుచపడ్డట్టుగా అనిపించింది. రాష్ట్రంలోని ఓటర్లల్లో పురుషులతో సమానంగా మహిళా ఓటర్లు ఉన్న విషయం తెలిసిందే. అయితే క్యూలైన్లలో పరిస్థితి భిన్నంగా కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా 17 పార్లమెంటు స్థానాల్లోని అర్బన్ నియోజకవర్గాల్లో ప్రధానంగా ఇది కనబడింది. పల్లెల్లో కొంత పరవాలేదనిపించినా అసెంబ్లీకి, పార్లమెంటుకు పలు తేడాలు కనిపించాయి. అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థులు దాదాపు స్థానికులై ఉంటారు. అక్కడక్కడా పారాచూట్ నుంచి దిగినా, ఎక్కువ శాతం నేరుగా స్థానిక నాయకత్వం, ఓటర్లతో సంబంధాలు కలిగి ఉంటారు. దీంతో ఇంటి దగ్గర నుంచి పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటేసే వరకు ఫాలోఅప్ ఉంటుంది. వాహనాల్లోనూ చేరవేసి ఓటు వేయించుకోవడం చేస్తారు. అదే లోక్‌సభకు వచ్చేసరికి అభ్యర్థులకు స్థానికులతో తక్కువ సంబంధాలు కలిగి ఉంటాయి. కొన్ని సమయాల్లో ఏకంగా రాజకీయాలకే కొత్తైన వారుంటారు. రిజర్వు నియోజకవర్గాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు ఉన్నంత హడావిడి, పోటీ లోక్‌సభకు కనపడదు. ఎంపీ అభ్యర్థులు నేరుగా లింక్ పెట్టుకోకపోవడానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ఒక్కో లోక్‌సభా స్థానంలో దాదాపు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. ఎమ్మెల్యేలు స్థానికంగా బాగా పలుకుబడి కలిగి ఉంటారు. దీంతో నేరుగా ఎంపీ జోక్యం అంతంతగానే ఉంటుంది. ప్రజలకు, నియోజకవర్గానికి ఏమీ చేయాలన్నా ఎమ్మెల్యేలతో తప్పనిసరిగా మాట్లాడాల్సి ఉంటుంది. తద్వారా ఎంపీ అభ్యర్థి స్థానికుడై విస్తృతంగా పరిచయాలు, సంబంధాలు ఉంటే పరిస్థితి మరోలా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తుంటారు. పోలింగ్ మందకొడిగా సాగడానికి, బూత్‌లకు ఓటర్లు ఆలస్యంగా రావడానికి ఎండలు సైతం ఒక కారణంగా కనిపిస్తున్నది. తాజాగా వర్షాలు పడి కొంత ఎండ తగ్గినప్పటికీ, ఉక్క మాత్రం అలాగే ఉంది. ఈ పరిస్థితి కూడా ఓటర్లు ఇంటి నుంచి బయటకు రాకపోవడానికి మరో కారణమై ఉంటుందనే ప్రచారమూ ఉంది. ఈనేపథ్యంలో అర్బన్ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గినట్టుగా భావిస్తున్నారు. అలాగే పల్లెలు, తండాల్లో పోలింగ్ ఉత్సాహంగా జరిగింది. మెదక్ జిల్లా పంగాయిపేట తండాలో 100 శాతం పోలింగ్ జరిగింది. ఇదిలావుండగా తమ సమస్యలు పరిష్కరించలేదంటూ పలు గ్రామాల్లో ఓటర్లు పోలింగ్‌ను బహిష్కరించారు.

అప్పడే వెనక్కి...

- ఓటేసిన వెంటనే హైదరాబాద్‌కు
- టోల్‌ప్లాజా వద్ద భారీ ట్రాఫిక్ జామ్




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసేందుకు భారీగా తరలివెళ్లిన ఓటర్లంతా అప్పుడే హైదరాబాద్ కు తిరుగుముఖం పట్టారు. తెలంగాణ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన నగరంలోని ఓటర్లంతా సెలవులు ముగియడంతో మళ్లీ వెంటనే ప్రయాణం కట్టారు. గత గురువారం నుంచి ఏపీకి భారీఎత్తున ఓటు వేసేందుకు తమ తమ సొంత ప్రాంతాలకు వెళ్లిన సంగతి తెలిసిందే. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయిన సంగతి తెలిసిందే. లక్షలాది మంది తరలివెళ్లి ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు. వీరి సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ వేల సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేసింది. ప్రయివేటు ట్రావెల్స్‌లోనూ ప్రయాణం చేశారు. టీఎస్ఆర్టీసీ దాదాపు 700కుపైగా బస్సులను ఏర్పాటు చేయగా, హైదరాబాద్ నుంచి తెలంగాణ జిల్లాలకు 1500 బస్సులు నడిపింది. సోమవారం ఉదయం సైతం బస్సులు అందుబాటులో ఉన్నాయి. కొందరు సొంత వాహనాల్లో వెళ్లిపోయారు. కాగా పోలింగ్ ముగిసిన వెంటనే అప్పుడే హైదరాబాద్‌కు పయనమయ్యారు. తెలంగాణ జిల్లాల నుంచి స్వల్పంగా నగరానికి వచ్చినా, ఏపీ నుంచి భారీసంఖ్యలో తిరుగుముఖం పట్టారు. సోమవారం సాయంత్రం చౌటుప్పల్ సమీపంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక జామ్ అయింది. ఏపీఆర్టీసీతోపాటు టీఎస్ ఆర్టీసీ బస్సులు, ప్రయివేటు ట్రావెల్స్, సొంత వాహనాల్లో ఓటేయడానికి వెళ్లిన వేలాది మంది నగరానికి వచ్చేశారు. సోమవారం అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ రద్దీ కొనసాగుతూనే ఉంది.

అరరే ఎంత పనాయే..!

ఓటేసుకునే అవకాశం లేని ఎంపీ అభ్యర్థులు







నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరైనా మీ అమూల్యమైన ఓటేసి తమను గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తూ ఉంటారు. అందుకు పంచాయతీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దిగిన అభ్యర్థులు ఎవరూ మినహాయింపు కాదన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఓటర్ల వద్దకు వచ్చి తమను గెలిపించండంటూ కోరిన అభ్యర్థులకే, తాము బరిలో దిగిన నియోజకవర్గాల్లో ఓట్లు లేకపోవడం కొసమెరుపు.

హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ, ఇదే స్థానం నుంచి బరిలోకి దిగిన బీజేపీ ఎంపీ అభ్యర్థి కొంపెల్లి మాధవి లత, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ఈ కోవలోకే వస్తారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వీరు ముగ్గురు పోటీ చేసినా, తమ గెలుపు కోసం తామే ఓట్లు వేసుకోకపోవడం గమనార్హం.

అసదుద్దీన్ ఓవైసీ..

హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. కానీ ఆయన నివాసం రాజేంద్రనగర్ పరిధిలో ఉంది. అంటే ఈ ప్రాంతం చేవెళ్ల లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. అదీకాక చేవెళ్లలో ఎంఐఎం తరఫున ఎవరు బరిలో నిలవలేదు. దాంతో ఏదో పార్టీకి, ఎవరో ఒకరికి ఆయన ఓటు వేయాల్సి ఉంది. దీంతో అసదుద్దీన్ గెలుపునకు ఆయన సైతం ఓటు వేసుకోలేక పోయారు.

కొంపెల్లి మాధవి లత..

హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆమె బరిలో దిగారు. సికింద్రాబాద్ ఈస్ట్ మారెడుపల్లిలోని మహేంద్రహిల్స్‌లో ఆమె నివసిస్తున్నారు. ఈ ప్రాంతం మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. దీంతో మాధవి లత తన కోసం.. తన ఓటును వేసుకునే అవకాశం దక్కలేదు.

పట్నం సునీతామహేందర్‌రెడ్డి..

మల్కాజ్‌గిరి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఆమె పోటీ చేశారు. ఓటు చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోని తాండురులో ఉంది. ఈ నేపథ్యంలో ఆమె సైతం తన ఓటు తనకు కాకుండా.. ఇతరులకు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మరోవైపు రాష్ట్రంలో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులందరూ దాదాపుగా తమ నియోజక వర్గాల్లో తమ విజయం కోసం ఓటు వేసుకున్నారు. కానీ ఈ ముగ్గురు అభ్యర్థులు మాత్రమే తమ గెలుపునకు తాము ఓటు వేసుకునే అవకాశం లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవో

- నిబంధనల ప్రకారం టీఏడీఏ చెల్లించాలన్న టీచర్లు
- పోలీసుల బలప్రయోగం
- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి : టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జీ చేయించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. నారాయణఖేడ్ ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలనీ, పీవో, ఏపీవోలకు రోజుకు రూ.600, ఓపీవోలకు రూ.400 చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11న జీవో నెంబర్ 61ని విడుదల చేసిందని తెలిపారు.ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీవో,ఏపీవో రూ.3,150 లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో రూ.2,400 మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. ఒకే పార్లమెంటు నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసులు బలప్రయోగం చేసి విచక్షణా రహితంగా లాఠీచార్జీ చేశారనీ, ఉపాధ్యాయులను గాయపరిచారని వివరించారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీవో, పోలీసులపై చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం

- ఎమ్మెల్యే రాజాసింగ్, మాధవిలతపై కేసు నమోదు
- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత
- ఎన్నికల విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి డీజీపీ అభినందనలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగిందని రాష్ట్ర డీజీపీ డాక్టర్ రవి గుప్తా తెలిపారు. కొన్ని చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికల ప్రక్రియ కౌంటింగ్ దశను వదిలి శాంతియుతంగా జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడటానికి ఉదయం నుంచే 65వేల మంది సివిల్ పోలీసులు, 160 కంపెనీలు కేంద్ర సాయుధ బలగాలు, ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన 20వేల మంది పోలీసులు కలిపి బందోబస్తును కట్టుదిట్టంగా నిర్వహించారని ఆయన అన్నారు. ముఖ్యంగా, మావోయిస్టు ప్రభావిత ఉత్తర తెలంగాణలోని ఐదు పార్లమెంటు నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాయుధ పోలీసులు కాపు కాశారని ఆయన చెప్పారు.



ఇక మతపరంగా సున్నితమైన హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సైతం ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోలేదని ఆయన తెలిపారు. కాగా, మలక్‌పేట పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఒక బూత్‌లో హైదరాబాద్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి మాధవీలత ఒక మహిళ బురఖాను తొలగించి చూడటం వంటి చర్యపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కేసును నమోదు చేశామని డీజీపీ తెలిపారు. అలాగే, మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పైనా ఎన్నికల నిబంధనల ఉల్లంఘింపునకు సంబంధించి కేసు నమోదు చేశామని అన్నారు. జనగామ, నారాయణ్‌ఖేడ్‌లలోని బూత్‌లలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య చిన్న ఘర్షణ చోటు చేసుకున్నదని ఆయన చెప్పారు. మొత్తమ్మీద, రాష్ట్రంలో శాంతియుత వాతావరణంలో పోలింగ్ దశ ముగిసిందని డీజీపీ చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుంచి పోలింగ్ దశ వరకు రాష్ట్ర పోలీసులు జరిపిన సోదాలలో 191 కోట్ల రూపాయల విలువైన నగదు, మద్యం, మాదకపదార్థాలు, వెండి, బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు.

మొత్తం 30 వేల మందికి పైగా రౌడీలు, గుండాలు అవాంఛనీయ సంఘటనలకు పాల్పడేవారిని బైండోవర్ చేసినట్టు డీజీపీ వివరించారు. కాగా, పోలింగ్ పూర్తి కావటంతో ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ స్టేషన్‌ల నుంచి నిర్దేశిత స్ట్రాంగ్ రూమ్‌లకు సాయంత్రం ఆరు గంటల నుంచి తరలించటం ప్రారంభించామనీ, ఈ ప్రక్రియ అర్ధరాత్రి పొద్దు పోయేంత వరకు కొనసాగే అవకాశమున్నదని డీజీపీ అన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్పీఎఫ్, టీఎస్-ఎస్పీ బెటాలియన్, సాయుధ పోలీసులు, సివిల్ పోలీసులతో 24 గంటల పాటు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ఈ భద్రత వచ్చే నెల 4న కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కొనసాగుతుందని అన్నారు. తమకు అవసరమైన కేంద్ర బలగాలను తప్ప మిగతా రాష్ట్రాల నుంచి వచ్చిన బలగాలను వారి స్వంత రాష్ట్రాలకు మంగళవారం నుంచి తరలించటం జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నికల బందోబస్తును శాంతియుతంగా నిర్వహించినందుకు గానూ రాష్ట్ర పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ రోజు పోలింగ్ ప్రక్రియను పూర్తిగా డీజీపీ కంట్రోల్ రూమ్ నుంచి శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్, రాష్ట్ర రైల్వే పోలీసు విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్‌లు పర్యవేక్షించి తగిన ఆదేశాలనిచ్చారని ఆయన తెలిపారు.

ఇవి బ్యాటరీ ధరలు భారం

- రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎండి వెల్లడి



న్యూఢిల్లీ : విద్యుత్ వాహనాల బ్యాటరీల ధరలు అధికంగా ఉన్నాయని రాయల్ ఎన్‌ఫీల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్థ్ లాల్ అన్నారు. విద్యుత్ మోటార్ సైకిల్ తయారీకి పెద్ద బ్యాటరీలు అవసరమవుతాయన్నారు. ప్రస్తుతం బ్యాటరీల పరిమాణం పరంగా పెద్దగా ఉన్నాయన్నారు. బరువు కూడా ఎక్కువగానే ఉన్నాయన్నారు. దీనివల్ల పెట్రోల్ ద్విచక్ర వాహనాలతో పోలిస్తే ఇవిల వ్యయం బాగా పెరుగుతుందని లాల్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 2025 నాటికి తమ తొలి విద్యుత్ మోటార్ సైకిల్‌ను తీసుకొస్తామని ఇది వరకే ప్రకటించినప్పటికీ.. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ మరింత ఆలస్యం కానుందన్నారు. ఇవి మోటార్ సైకిల్ తీసుకొచ్చే ఆలోచన ఉన్నప్పటికీ తాము తొందరపడడం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ ఇవిలకు డిమాండ్ పెద్దగా లేదన్నారు. బ్యాటరీల బరువు తగ్గి, వాటి ధరలు అందుబాటులోకి వచ్చే వరకు ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉండకపోవచ్చున్నారు. అయినప్పటికీ తాము సొంతంగా ఓ ఇవి మోటార్ సైకిల్‌ను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. అదే విధంగా స్పెయిన్‌కు చెందిన స్టార్క్ మోటార్ సైకిల్‌తో మరో ప్రాజెక్ట్‌పై పని చేస్తున్నామన్నారు.